మన సమగ్ర
ప్రజావాణి
తెలుగు డైలీ

RNI NO:TGTEL/25/A5443

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

Wanted Reporters

తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికీ ప్రాధాన్యత)



Ph: 9440032006

రాజన్న సిరిసిల్ల	శనివారం	28.11.2026	సంపుటి : 01	సంచిక : 326	పేజీలు : 12	వెల : 2/-
RAJANNA SIRICILLA	SATURDAY	28.11.2026	Volume : 01	Issue :326	Pages : 12	Cost : 2/-

పర్యావరణ పరిరక్షణకు
పెద్దపీట

- ప్రకృతిని కాపాడటం.. పెట్టుబడులను ఆకర్షించడం ప్రభుత్వ లక్ష్యం
- సహజ వనరుల సంరక్షణలో వెనక్కి తగ్గేది లేదు
- చెరువుల పునరుద్ధరణ, కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- క్లైమేట్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,నవంబర్ 27 : పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురావడంతో పాటు ప్రకృతి సంపదను కాపాడుకోవడం కూడా ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని వెల్లడించారు. శుక్రవారం హైదరా బాద్‌లో నిర్వహించిన క్లైమేట్ కాంక్లేవ్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. భావితరాలకు సహజ వనరులను అందించేం దుకు ప్రభుత్వం కట్టుబడి మిగతా2లో...

లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంపునకు
కేంద్రం నిర్ణయం

- ప్రస్తుతం 543గా ఉన్న స్థానాలు 850కి చేరే అవకాశం
- రాష్ట్రాల మధ్య ప్రస్తుత సీట్ల నిష్పత్తి 2051 వరకు కొనసాగింపు ప్రతిపాదన
- డీలిమిటేషన్‌తో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు ముడిపెట్టి రాజ్యాంగ సవరణకు కసరత్తు
- నవంబర్ 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు



న్యూఢిల్లీ,నవంబర్ 27 : లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లోనూ సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపా దించింది. రాష్ట్రాల మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న లోక్‌సభ స్థానాల పంపిణీ నిష్పత్తిని మరో 25 ఏళ్లపాటు, అంటే 2051 వరకు కొనసా గించాలని నిర్ణయించింది. నియోజకవర్గాల పునర్విభ జన ప్రక్రియతో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలును ముడిపెట్టి రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకురావాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ మిగతా2లో...

డిప్యూటీ మేయర్,
వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు

- ఉదయం 11 గంటలకు పరోక్ష ఎన్నికల నిర్వహణ
- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

వివరాలు 2లో

పట్టణ ఎన్నికల్లో 63.44
శాతం పోలింగ్

- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా
- 23 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్
- ఈ నెల 30న ఓట్ల లెక్కింపు



వివరాలు 2లో

డీలిమిటేషన్‌పై విపక్షాల
ఉమ్మడి వ్యూహం

- నేడు ఇండియా కూటమి కీలక భేటీ
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చ
- కూటమితో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలకూ ఆహ్వానం



వివరాలు 2లో

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో కోట్ల రూపాయల
భూదందా బాగోతం!

- 186 ఎకరాల భూసేకరణలో అక్రమాల ఆరోపణలు..
- రాజరాజేశ్వర స్వామి భూమి ఉందంటూ అధికారి వీడియో వైరల్!
- ఒక్క సర్వే నంబర్‌లోనే 3 ఎకరాల 8 గుంటల భూమి ఉన్నట్లు వెల్లడి!
- అధికారుల పదోన్నతుల వెనుక అసలు మర్మమేమిటి?
- వీడియో ఆధారాలతో మన సమగ్ర ప్రజావాణి ప్రత్యేక పరిశోధనాత్మక కథనం..

హనుమకొండ జిల్లా ప్రతినిధి:
ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ భూసేకరణ వ్యవహారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారుతోంది. మొత్తం 186 ఎకరాల భూమి సేకరణలో కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారుల పాత్రపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఆధారాలు వెలుగులోకి రావడంతో భూసేకరణ తీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఒక్క సర్వే నంబర్‌తోనే సంచలన విషయాలు!
రాజరాజేశ్వర స్వామి భూమి ఉందంటూ భూసేకరణ అధికారి వెల్లడించినట్లు ఉన్న వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. కేవలం ఒక్క సర్వే నంబర్‌లోనే 3 ఎకరాల 8 గుంటల భూమి ఉన్నట్లు అధికారి పేర్కొన్నట్లు వీడియోలో కనిపిస్తోంది. మరి మొత్తం 186 ఎకరాల భూసేకరణలో ఇలాంటి భూములు ఎన్ని ఉన్నాయి? వాటి వివరాలు ఏమిటి? పరిహారం చెల్లింపులు ఎలా జరిగాయి? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.



అధికారుల పదోన్నతుల వెనుక మర్మమేమిటి?
ఈ భూసేకరణ వ్యవహారంలో పనిచేసిన అధికారులకు వరుసగా పదోన్నతులు రావడం కూడా చర్చనీయాంశంగా మారింది. మండల రెవెన్యూ అధికారి నుంచి రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయికి, రెవెన్యూ డివిజనల్ అధికారి నుంచి జిల్లా రెవెన్యూ అధికారి స్థాయికి, ఉప తహసీల్దార్ నుంచి మండల రెవెన్యూ అధికారి స్థాయికి పదోన్నతులు పొందిన అధికారుల వ్యవహారంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ పదోన్నతులకు, భూసేకరణ వ్యవహారానికి ఏమైనా సంబంధం ఉందా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

186 ఎకరాల్లో ఎవరెవరి వాటా ఎంత?
భూసేకరణలో అసలు ఏం జరిగింది? భూముల విలువ నిర్ధారణ ఎలా చేశారు? ప్రభుత్వ భూములు, దేవాదాయ భూముల వివరాలను ఎలా పరిగణనలోకి తీసుకున్నారు? ఈ వ్యవహారంలో ఎవరికి ఎంత ప్రయోజనం చేకూరింది? అధికారుల మధ్య అక్రమ లావాదేవీలు జరిగాయనే ఆరోపణల్లో వాస్తవాలేమిటి? అన్న అంశాలకు సమాధానాలు రావాల్సి ఉంది.

ఆధారాలతో మన సమగ్ర ప్రజావాణి ప్రత్యేక పరిశోధన!
ఈ వ్యవహారంపై మన సమగ్ర ప్రజావాణి ప్రత్యేక పరిశోధనాత్మక కథనాన్ని చేపట్టింది. అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి ఒక్కొక్క అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురానుంది. ముందుగా భూసేకరణ అధికారికి సంబంధించిన వీడియో ఆధారాలను ప్రజల ముందుంచనుంది. అనంతరం ఇతర అధికారులకు సంబంధించిన వీడియోలు, కీలక వివరాలను వరుస కథనాలుగా ప్రచురించనుంది.

పూర్తి వివరాలు రేపటి ప్రత్యేక ప్రసారంలో!
186 ఎకరాల భూసేకరణలో అసలేం జరిగింది? అధికారుల పాత్ర ఏమిటి? కోట్ల రూపాయల వ్యవహారంలో నిజానిజాలేమిటి?



మరిన్ని అధికారుల వీడియోలు, కీలక ఆధారాలతో మన సమగ్ర ప్రజావాణి తెలుగు దినపత్రిక తదుపరి కథనంలో మరిన్ని వివరాలను వెలుగులోకి తీసుకురానుంది.

ప్రభుత్వ భూమి.. ప్రజాధనం.. బాధ్యత ఎవరిది? నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే!

లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంపునకు కేంద్రం నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం 543 స్థానాలున్న లోక్‌సభలో 50 శాతం పెంపు జరిగితే సభ్యుల సంఖ్య సుమారు 850కి చేరే అవకాశం ఉంది. రాష్ట్రాల మధ్య సీట్ల పంపిణీలో ప్రస్తుతం ఉన్న నిష్పత్తిని యథాతథంగా కొనసాగించాలని ప్రతిపాదించారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించిన రాష్ట్రాల ప్రాతినిధ్య నిష్పత్తిని మరో 25 ఏళ్లపాటు కొనసాగించడం ద్వారా జనాభా పెరుగుదల ఆధారంగా రాష్ట్రాల మధ్య సీట్ల పంపిణీలో మార్పులు రాకుండా చూడాలని కేంద్రం భావిస్తోంది. ముఖ్యంగా జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ వల్ల రాజకీయ ప్రాతినిధ్యంలో నష్టం జరగకుండా ఈ ప్రతిపాదన తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 2029 ఎన్నికల నాటికి అమలు చేయాలన్నది కేంద్రం లక్ష్యంగా కనిపిస్తోంది. ఇందుకోసం జనగణన, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయాలని ప్రతిపాదిస్తోంది. ఈ అంశాలపై చర్చించేందుకు నవంబర్ 30 నుంచి లోక్‌సభ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశం కానుంది. **ప్రతిపక్షాల అభ్యంతరాలు** కేంద్ర ప్రతిపాదనలపై ప్రతిపక్షాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. డీలిమిటేషన్ అంశంపై ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు ఇండియా కూటమి శనివారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశం కానుంది. కేంద్ర ప్రతిపాదనలను వ్యతిరేకించాలని చర్చించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టాల్సిన అవసరం లేదని బీజేడీ అభిప్రాయపడింది. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల పరిధిలోనే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయవచ్చని పేర్కొంది. మరోవైపు డీలిమిటేషన్ బిల్లును ప్రస్తుత రూపంలో అంగీకరించబోమని సీపీఐ ఎంపీ పి. సంతోష్‌కుమార్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ పేరుతో రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నియోజకవర్గాల స్వరూపాన్ని మార్చే ప్రమాదం ఉందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవద్దని సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. ఈ ప్రతిపాదనలపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కీలక చర్చ జరిగే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

ఉందని, ఈ క్రమంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో తెలంగాణకు ప్రత్యేకమైన చరిత్ర, వారసత్వం ఉన్నాయని గుర్తుచేశారు. కాకతీయుల కాలం నుంచి కొమరం భీం వరకు ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని చాటిచెప్పిన గొప్ప సంప్రదాయం మనకుందని అన్నారు. హైదరాబాద్‌లో ఒకప్పుడు 1,300 చెరువులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 700కు తగ్గిపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు కోసమే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంబర్‌పేట బతుకమ్మ కుంట, హైటెక్ సిటీలోని తుమ్మిడికుంటను కబ్జాల నుంచి విడిపించి పునరుద్ధరించినట్లు వివరించారు. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టును కూడా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల పునరావాసాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టినట్లు పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో హైదరాబాద్‌లో భారీ వర్షాలు, వరదల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, రానున్న ఎనిమిది నెలలు వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు నగరంలోని కాలుష్యకారక పరిశ్రమలను తరలించామని, బస్సులు, ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహిస్తున్నామని, ఆహార, ఔషధ కల్తీని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలోనూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, సంస్థలు, పారిశ్రామికవేత్తలు కూడా భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్, వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్, పద్మశ్రీ చింతల వెంకట్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత భారత

నిర్మాణానికి మహాపాదయాత్ర

హైదరాబాద్,నవంబర్ 27 : దేశంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి చేపట్టిన 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' మహాపాదయాత్ర శుక్రవారం ముగిసింది. నవంబర్ 25న అంబర్‌పేటలోని మహంకాళి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర మూడు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల మీదుగా సుమారు 40 కిలోమీటర్లు సాగి జూబ్లీహిల్స్‌లో ముగిసింది. యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక సందేశానికి మద్దతు తెలిపారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మైదానంలో నిర్వహించిన సభలో మెగాస్టార్ చిరంజీవి, ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్, ఏఐజీ ఆస్పత్రుల వ్యవస్థాపకుడు డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత భారత నిర్మాణం యువత చేతుల్లోనే ఉందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ శక్తిని దేశాభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర రాజకీయాలకు అతీతంగా నిర్వహించామని,

అన్ని వర్గాల ప్రజల నుంచి స్వచ్ఛందంగా మద్దతు లభించిందని తెలిపారు. చిరంజీవి మాట్లాడుతూ యువత తలుచుకుంటే సమాజంలో గొప్ప మార్పు తీసుకురాగలరని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని, దేశ భవిష్యత్తును కాపాడాలని సూచించారు. శ్రీశ్రీ రవిశంకర్, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి కూడా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. మూడు రోజుల పాదయాత్రలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. మొదటి రోజు సినీ నటులు నిఖిల్, పాయల్ రాజ్‌పుత్, రెండో రోజు బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, నటుడు బెల్లంకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చివరి రోజు నటులు నాగార్జున, సాయికుమార్, శివాజీ, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాదయాత్రలో అడుగులు కలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. యువతను వ్యసనాల నుంచి కాపాడేందుకు ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, కుటుంబాలు, సామాజిక సంస్థలు సమష్టిగా కృషి చేయాలని ఈ కార్యక్రమం పిలుపునిచ్చింది.

గంధమల్ల ప్రాజెక్టు ఏడాదిలో పూర్తి చేస్తాం

ఆలేరు,నవంబర్ 27 : ఆలేరు ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరై, నూతన చైర్మన్ సుధాగాని మల్లేశం గౌడ్, వైస్ చైర్మన్ ఎం.ఏ. ఏజాజ్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా మార్కెట్ కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన గోదాములు, మార్కెట్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి తెలిపారు.

గురుకుల విద్యార్థుల క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం

- రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- డిసెంబరు 11 నుంచి గ్రామగ్రామాన ఖేలో ఇండియా ఉత్సవాలు

- తెలంగాణను దేశంలోనే అగ్రగామి క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్, నవంబర్ 27 : గురుకుల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఒలింపిక్ జ్యోతిని వెలిగించి జాతీయస్థాయి క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు క్రీడలను నిర్లక్ష్యం చేయకుండా చదువుకు ఇచ్చినంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశాలు కూడా ఉంటాయని తెలిపారు. డిసెంబరు 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామగ్రామాన 'ఖేలో ఇండియా' క్రీడా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణను దేశంలోనే ప్రముఖ క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, క్రీడా సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలోని జ్యోతిబా పూలే గురుకులాల్లో సుమారు 1.70 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని మంత్రి తెలిపారు. విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని కఠోర శ్రమతో వాటిని సాధించాలని పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి సైదులు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు

అమరావతి,నవంబర్ 27 :

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్పొరేషన్ల డిప్యూటీ మేయర్లు, మున్సిపాలిటీల వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. డిసెంబరు 5వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. రాష్ట్రంలోని నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. గతంలో వాయిదా పడిన నర్సీపట్నం, మాచర్ల మున్సిపాలిటీల వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను కూడా అదే రోజు నిర్వహించనున్నారు. డిసెంబరు 5న ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోతే డిసెంబరు 6న చేపట్టాలని ఎన్నికల సంఘం సూచించింది. ప్రత్యేక సమావేశాలకు సంబంధించి సభ్యులకు డిసెంబరు 1వ తేదీలోగా నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఎన్నికలను చేతులెత్తే పద్ధతిలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

పట్టణ ఎన్నికల్లో 63.44 శాతం పోలింగ్

అమరావతి,నవంబర్ 27 :

ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 63.44 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. గురువారం జరిగిన పోలింగ్‌కు సంబంధించిన వివరాలను శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 1,009 వార్డుల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. మొత్తం 24,98,312 మంది ఓటర్లకు గాను 15,85,031 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా పొదిలిలో అత్యధికంగా 77.90 శాతం, ప్రకాశం జిల్లా కందుకూరులో 76.67 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 54.67 శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికల నిర్వహణకు సహకరించిన ఓటర్లు, ఎన్నికల సిబ్బంది, పోలీసు శాఖకు అనిల్ చంద్ర పునేఠా కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 30న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.

డీలిమిటేషన్‌పై విపక్షాల ఉమ్మడి వ్యూహం

న్యూఢిల్లీ, నవంబర్ 27 :

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించనున్న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేసేందుకు ఇండియా కూటమి, ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలు శనివారం సమావేశం కానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో ఉదయం 11.30 గంటలకు ఈ భేటీ జరగనుంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు ముందు అనుసరించాల్సిన కార్యాచరణపై నేతలు చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ సమావేశం వివరాలను వెల్లడించారు. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేడీ వంటి ఇండియా కూటమిలో లేని ప్రతిపక్ష పార్టీలను కూడా సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిపారు. కేంద్రం తీసుకురానున్న ప్రతిపాదనలపై అన్ని పార్టీలతో చర్చించి ఉమ్మడి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్ల అమలును ముడిపెడుతూ కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకురావచ్చన్న ప్రచారం నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపైనా ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నాయి. రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తి, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సభలో ప్రభుత్వ ప్రతిపాదనలను ఎలా ఎదుర్కోవాలి, అన్ని ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం ఎలా సాధించాలనే అంశాలపై నేతలు కార్యాచరణ రూపొందించనున్నారు.

అమెరికాలో బాంబ్ సైక్లోన్ బీభత్సం

న్యూయార్క్,నవంబర్ 27 : అమెరికాలో బాంబ్ సైక్లోన్ తీవ్ర బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు, ఈదురుగాలులు, మంచు కారణంగా న్యూయార్క్, న్యూజెర్సీ సహా పలు రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించింది. తుపాను ప్రభావంతో 9 లక్షలకుపైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్లు విరిగిపడి ఇళ్లపై పడటంతో ఆస్తి నష్టం సంభవించింది. పెన్సిల్వేనియా, న్యూజెర్సీ రాష్ట్రాలను కలిపే కొమోడోర్ బ్యారీ వంతెన దెబ్బతినడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. మేరీల్యాండ్‌లో ఇళ్లపై చెట్లు కూలిన ఘటనలపై 300కు పైగా ఫిర్యాదులు అందాయి. న్యూయార్క్‌లో వరద నీటిలో చిక్కుకున్న వాహనాల నుంచి ప్రయాణికులను సహాయక సిబ్బంది రక్షించారు. తుపాను కారణంగా వందలాది విమాన సర్వీసులు రద్దు కాగా, మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. థాంక్స్‌గివింగ్ వేడుకల కోసం ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. వాతావరణ పీడనం 24 గంటల్లోనే అసాధారణంగా పడిపోవడం వల్ల ఏర్పడే తీవ్ర తుపానును 'బాంబ్ సైక్లోన్'గా పిలుస్తారు. ఈ తుపాను ప్రభావంతో అమెరికాలోని పలు ప్రాంతాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

ఖమ్మం, నవంబర్ 27 :

ఖమ్మం నగరంలోని వెలుగుమట్లలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌తో కలిసి 15వ డివిజన్‌లోని భూదాన్ భూమిలో నిర్మిస్తున్న 310 ఇళ్ల కాలనీని సందర్శించారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులను మరో పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో పేదల సౌకర్యార్థం నిర్మిస్తున్న బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, పార్కు, డ్రైనేజీ, ఓపెన్ జిమ్ పనులను మంత్రి పరిశీలించారు. అన్ని పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే ఈ ఇళ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వెలుగుమట్లలో గతంలో కొందరు వ్యక్తులు సంఘాల పేరుతో నిరుపేదలకు నకిలీ పట్టాలు ఇచ్చి డబ్బులు వసూలు చేశారని మంత్రి పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, భూదాన్ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిజమైన పేదలకు ఇళ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని హైకోర్టు ఆదేశించిందని వివరించారు. కోర్టు ఉత్తర్వులు, ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు అర్హులైన నిరుపేదల కోసం 310 ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ పర్యటనలో డీఆర్డీఏ పీడీ కె. శ్రీరామ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, నగరపాలక సంస్థ డీఈ నవ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా భారత సేవా సమితి

● గొల్లపల్లిలో 14 మంది రైతులకు ఆవుల పంపిణీ



పెనుమూరు ప్రజావాణి ప్రతినిధి నవంబర్ 27 పెనుమూరులో పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందించడమే లక్ష్యంగా భారత సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాడి ఆవుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పెనుమూరు మండలం గొల్లపల్లిలో శుక్రవారం భారత జ్యోతి డాక్టర్ రావూరి వెంకటస్వామి ఆధ్వర్యంలో 14 మంది పాడి రైతులకు ఆవులను పంపిణీ చేశారు.భారత సేవా సమితి ఆధ్వర్యంలో పెనుమూరు మండలానికి చెందిన 100 మంది పాడి రైతులకు ఆవులు మంజూరు చేయించగా, అందులో భాగంగా మొదటి విడతలో 14 మందికి పశువులను అందజేశారు. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే ఆవులను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక్కో ఆవు విలువ సుమారు రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకు ఉంటుందని వెల్లడించారు.ఈ సందర్భంగా డాక్టర్ రావూరి వెంకటస్వామి మాట్లాడుతూ పాడి రైతులకు చేయూతనందించి, వారి జీవనోపాధిని మెరుగుపరచడమే భారత సేవా సమితి ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు మురుకంబట్టు శాఖ మేనేజర్ రవళిక, పశువైద్యులు హేమాద్రి, భారత సేవా సమితి సభ్యులు వి. నాగరాజు, గ్రామ వాలంటీర్ వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవశాస్త్ర రంగాల్లో విస్తృతమైన కెరీర్ అవకాశాలు -- ప్రొఫెసర్ ఎం. సుభాష్ చంద్ర

కడప : ప్రజావాణి నవంబర్ (27) ప్రభుత్వ పురుషుల కళాశాల (ఏ), కడపలోని జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ఐదీ స్టార్ కాలేజ్ పథకంకింద *Star Talk--2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా »»Class Room to Career: Exploring Emerging Opportunities in Life Science"అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసకార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి యోగి వేమన విశ్వవిద్యాలయం, మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి ప్రొఫెసర్ డా. ఎం. సుభాష్ చంద్ర స్టార్ ఎక్స్‌పర్ట్‌గా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తరగతి గది విద్యను ఆధునిక జీవశాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసుకుంటూ ఉన్నత విద్య, పరిశోధన, ఉపాధి మరియు ఇతర కెరీర్ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జీవశాస్త్ర రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన పెంపొందించుకోవాలని, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు



సమాధానాలు ఇస్తూ వారితో ముఖాముఖి చర్చించారు.
కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. వెంకట లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని ఆధునిక విద్యా, పరిశోధనా అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆమె సూచించారు. డా. జి. వెంకట సుబ్బయ్య మంచి విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన విద్య మరియు భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన అవగాహన అవసరమని తెలిపారు. DBT స్టార్ కాలేజ్ పథకం సమన్వయకర్త డా. వై. సావిత్రిలి మాట్లాడుతూ, కళాశాలలో ఐదీ స్టార్ కాలేజ్ పథకం ద్వారా నిర్వహిస్తున్న వివిధ విద్యార్థి-కేంద్రీకృత కార్యక్రమాలు, ప్రాక్టికల్ శిక్షణలు, నిపుణుల ఉపన్యాసాలు, పరిశోధనా కార్యకలాపాలు మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు తరగతి గది విద్యతో పాటు ప్రస్తుత శాస్త్రీయ రంగాల్లో అవసరమైన నైపుణ్యాలను అందించడమే స్టార్ కాలేజ్ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో లిడా. సి. నరసింహారావు, డా. హరి ప్రసాద్, నవనీశ్వర్ రెడ్డి, కల్పన, డా. పి. కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డిలి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాలలోని లిలైఫ్ సైన్సెస్ విభాగాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రొఫెసర్ సుభాష్ చంద్రతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.కార్యక్రమం విద్యార్థులకు జీవశాస్త్ర రంగంలో ఉన్నత విద్య, పరిశోధన మరియు కెరీర్ అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించింది.

జుక్కల్ లో రాజ్యాంగ దినోత్సవం

● ఇంద్రమ్మ బీమా ప్రారంభం.





మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి నవంబర్ 27కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంలో గల గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.. గ్రామ సర్పంచ్ సావిత్రి-సాయ గౌడ్ అధ్యక్షతన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగంలోని ఆశయాలు, ప్రజాస్వామ్య విలువలు, పౌరుల హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సర్పంచ్ సావిత్రి-సాయి గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ సమక్షంలో ప్రారంభించారు.. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.. ఈ ఉప సర్పంచ్ ఫిర్దోస్ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ అసిస్టెంట్ రాజు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు..

పోరుమామిళ్ల డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

పోరుమామిళ్ల : ప్రజావాణి నవంబర్ (27)పోరుమామిళ్ల: పోరుమామిళ్ల డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం విద్యార్థులు, అధ్యాపకులు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్ రాజ్ హాజరుకాగా, కళాశాల అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకలతో కళాశాల ప్రాంగణం సందడి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.
ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. సీనియర్లు, జూనియర్లు ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ స్నేహభావాన్ని పంచుకున్నారు. కళాశాల జీవితంలో కొత్తగా అడుగుపెట్టిన విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు వివిధ పాటలకు ఉత్సాహంగా డ్యాన్సులు వేస్తూ తమలోని కళా ప్రతిభను ప్రదర్శించారు. పాటలు, నృత్యాలతో కళాశాల ప్రాంగణం మార్మోగింది. విద్యార్థుల ప్రదర్శనలను తోటి విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో ప్రోత్సహించారు. సీనియర్లు, జూనియర్లు కలిసి వేడుకల్లో పాల్గొంటూ ఆనందంగా గడిపారు.







ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేసింది. విద్యార్థులందరూ కలిసికట్టుగా భోజనం చేస్తూ ఆత్మీయతను పంచుకున్నారు. చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలను పెంపొందించడంతో పాటు పరస్పర సహకారం, ఐక్యతకు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శామ్యూల్ దేవిడ్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకులుగా నిలుస్తూ అందరూ స్నేహపూర్వక వాతావరణంలో ముందుకు సాగాలని తెలిపారు.
కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఫ్రెషర్స్ డే వంటి కార్యక్రమాలు మంచి వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు తమలోని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు.సీనియర్లు జూనియర్లకు స్వాగతం పలకడం, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, అధ్యాపకుల సందేశాలు, మధ్యాహ్న భోజన కార్యక్రమంతో ఫ్రెషర్స్ డే వేడుకలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ వేడుకలు నూతన విద్యార్థులకు మధుర జ్ఞాపకాలను అందించడంతో పాటు కళాశాలలో స్నేహం, ఐక్యత, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచాయి.

మరోసారి ఉదారతను చాటుకున్న డాక్టర్ ఆనంద్ రావు..

● రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు బహుమతులు...



మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి నవంబర్ 27కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంలో గల రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జుక్కల్ లో జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి విద్యార్థులకు మరోసారి ఉదారతను చాతుకున్న ఆనందరావు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన నిర్వహించి వారికి మొదటి బహుమతి, రెండవ బహుమతి, మూడవ బహుమతి అందజేశారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ రావు తో పాటు గజా నంద్, సాయి కర్ణ జాదవ్, కండేరావు, మిలింద్, ప్రశాంత్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు..

చలో ఢిల్లీ.. పార్లమెంట్‌కు వెళ్దాం

● డిసెంబర్ 1 నుంచి 3 వరకు సీఐటీయూ పిలుపు

● కనీస వేతనం రూ.42 వేలుగా నిర్ణయించాలి -- ఎస్.కె. యాకూబ్



గరిడేపల్లి, నవంబర్ 27 (ప్రజావాణి):కార్మిక హక్కుల పరిరక్షణ, లేబర్ కోడ్ల రద్దు, కనీస వేతనం రూ.42 వేలకు పెంపు, స్కీం వర్కర్లకు కార్మికులుగా గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1 నుంచి 3 వరకు ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద జరిగే కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సీఐటీయూ పిలుపునిచ్చింది.శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలో టి. సరిత అధ్యక్షతన జరిగిన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో జిల్లా నాయకులు ఎస్.కె. యాకూబ్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తీసుకువచ్చిందని విమర్శించారు. దీంతో కనీస వేతనాలు, ఎనిమిది గంటల పని విధానం, ఉద్యోగ భద్రత వంటి కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని అన్నారు. సమ్మెలు చేసే హక్కుపై ఆంక్షలు విధిస్తూ కోట్లాది మంది కార్మికులను కార్మిక చట్టాల పరిధికి దూరం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తోందని యాకూబ్ విమర్శించారు. 2023 ఎన్నికల ముందు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అందిస్తామని హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఆ హామీల అమలుపై సరైన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెలు చేపట్టేందుకు కార్మిక ఉద్యమాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోపగాని సత్యమన్న, ఆర్. వెంకన్న, ఎస్. నర్సిరెడ్డి, సైదులు, శ్రీలక్ష్మి, ఎం. ఉమా, నాగమణి, సైదమ్మ, వెంకటమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొడ్డపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో శ్రీమతి కిక్కర పుణ్యావతి ఢిల్లీరావు ను అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించిన వారందరికి కృతజ్ఞత అభినందనలు

● అభ్యర్థిత్వాన్ని బలపరిచి, 1,166 ఓట్ల అఖండ మెజార్టీతో ఘనవిజయం అందించిన బొడ్డపాడు పంచాయతీ ఓటరు మహాశయులందరికీ అభినందనలు

● బొడ్డపాడు సర్పంచ్ కిక్కర పుణ్యావతి డిల్లీ రావు స్పష్టము చేశారు

పలాస ప్రజావాణి ప్రతినిధి పలాస మండలం బొడ్డపాడు పంచాయతీ సర్పంచ్ గెలుపుకు సహకరించిన ఓటర్ మహాసేయులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ బొడ్డపాడు కీక్కర్ పుణ్యావతి డిల్లీ రావు ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.
ఎన్నికల ఫలితాల వివరాలు:
పోలైన మొత్తం ఓట్లు: 1,692
కిక్కర పుణ్యావతి ఢిల్లీరావు: 1,379
తామాడ జ్యోత్స్న (మాజీ సర్పంచ్ మదన్): 209
కుసుమ పోతనపల్లి: 59
నోటా: 24



రద్దయిన ఓట్లు: 21
మెజార్టీ: 1,166 ఓట్లు
పలాస నియోజకవర్గంలోనే అత్యధిక మెజార్టీతో బొడ్డపాడు పంచాయతీ మొదటి స్థానాన్ని సాధించడం మనందరికీ గర్వకారణం.
ఈ చారిత్రాత్మక విజయానికి సహకరించిన బొడ్డపాడు పంచాయతీ ఓటరు మహాశయులకు, గ్రామ పెద్దలకు, వివిధ నగరాల నుంచి విచ్చేసి అండగా నిలిచిన ప్రవాస బొడ్డపాడు వాస్తవ్యులకు, కూటమి కుటుంబ సభ్యులకు, వివిధ యువజన సంఘాలకు, మహిళా సంఘాలకు, రైతు సంఘాలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు, నా స్నేహితులకు మరియు మా కుటుంబ సభ్యులందరికీ పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు.
మీరు మాపై ఉంచిన నమ్మకం ఒక బాధ్యత. మీరు అందించిన ఈ విజయం ఒక పదవి మాత్రమే కాదు... బొడ్డపాడు గ్రామ అభివృద్ధి కోసం మాకు అప్పగించిన ఒక గొప్ప విధి.మీ ఆశయాలకు అనుగుణంగా, మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతి ఒక్కరినీ కలుపుకొని బొడ్డపాడు పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇస్తున్నాము.మీ అభిమానం మా బలం... మీ ఆశీర్వాదం మా విజయం... మీ నమ్మకమే మా బాధ్యత! మరొక్కసారి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక వందనం... అభివందనం... పాదాభివందనం!ఇట్లు... కిక్కర పుణ్యావతి ఢిల్లీరావు (M.Sc B.Ed) బొడ్డపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్

మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కరం కోసం కృషి

■ అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయంతో పనిచేస్తే

■ నాపై విశ్వసం ఉంచి పదవి కట్టబెట్టిన సర్పంచులకు కృతజ్ఞతలు

■ మొగుడం పల్లి మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా పట్లోళ్ల బ్రహ్మానంద రెడ్డిు

జహీరాబాద్, నవంబర్ 27 (ప్రజావాణి): మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కరం కోసం కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం నుండి గ్రామాలకు రావాల్సిన అభివృద్ధి పనులను అందరికి సమానంగా అందేవిధంగా చూస్తామని సర్పంచ్ పట్లోళ్ల బ్రహ్మనంద రెడ్డి



అన్నారు. శుక్రవారం నాడు మొగుడంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సర్పంచుల ఫోరం కమిటీ సమావేశంలో ఖాన్ జమాల్ పుర్ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల బ్రహ్మనంద రెడ్డి ని ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు మండలంలోని సర్పంచులు, వివిధ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నూతనంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామాల అభివృద్ధికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.సర్పంచుల ఐక్యతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొగుడంపల్లి మండలానికి చెందిన సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో విద్యార్థులకు ప్రత్యక్ష బోధన

● విద్యుత్ సరఫరా విధానంపై అవగాహన పొందిన విద్యార్థులు



చిలుకూరు, నవంబర్ 27 (ప్రజావాణి): చిలుకూరు మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఒకేషనల్ విద్యార్థులకు గురువారం చిలుకూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రత్యక్ష బోధన కార్యక్రమం నిర్వహించారు.ఎలక్ట్రికల్ అండ్ హోమ్ అప్లయన్స్ విభాగం పాఠ్యాంశాల్లో భాగంగా నిర్వహించిన ఈ క్షేత్ర పర్యటనలో విద్యుత్ సరఫరా విధానం, సబ్‌స్టేషన్ పనితీరు, వివిధ గ్రామాలకు విద్యుత్ పంపిణీ చేసే ప్రక్రియను విద్యుత్ శాఖ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి సరఫరా వ్యవస్థ ద్వారా విద్యుత్ వినియోగదారులకు ఎలా చేరుతుందో ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారావు మాట్లాడుతూ.. పుస్తక జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రత్యక్ష బోధన ద్వారా పాఠ్యాంశాలపై స్పష్టత రావడంతో పాటు సాంకేతిక విద్యపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యుత్ శాఖ సిబ్బంది, ఒకేషనల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళల నైపుణ్యాలకు మార్కెట్ అనుసంధానం కల్పించి స్వయం ఉపాధిని ప్రోత్సహించాలి

● ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

ఏటూరునాగారం నవంబర్ 27,ప్రజావాణి:మేడారం ప్రాంతంలోని గిరిజన మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, వారు తయారు చేసే హస్తకళా ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు కల్పించడం తో పాటు, వాటిని మార్కెట్‌కు అనుసంధానం చేసి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీడీఏ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీ సమ్మక్క సారలమ్మ మహిళా శక్తి సంఘాల సభ్యులతో పీఓ ముఖాముఖిగా మాట్లాడి, వారు తయారు చేస్తున్న వెదురు హస్తకళలు, అలంకరణ వస్తువులు, ఇతర చేతివృత్తి ఉత్పత్తులను పరిశీలించారు. మహిళలు ప్రతిరోజూ ఏ సమయానికి పనులు ప్రారంభిస్తున్నారు, ఎంత సమయం కేటాయిస్తున్నారు, ఎంత దూరం నుంచి శిక్షణ లేదా తయారీ కేంద్రానికి వస్తున్నారు, ఉత్పత్తుల తయారీలో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళల అనుభవాలు, ఆసక్తి, నైపుణ్యాలను తెలుసుకుని మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా సూచనలు చేశారు.

ప్రతి ఉత్పత్తిపై సమ్మక్క సారలమ్మ ప్రత్యేక గుర్తింపు

మహిళలు తయారు చేసే ప్రతి వెదురు హస్తకళా ఉత్పత్తిపై “శ్రీ సమ్మక్క సారలమ్మ దేవతలు -- మేడారం” అనే ప్రత్యేక గుర్తింపు ఉండేలా స్టిక్కర్లు, లోగోలు లేదా ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలని పీఓ సూచించారు. దీనివల్ల మేడారంలో తయారైన ఉత్పత్తులను ఇతర ప్రాంతాల ఉత్పత్తుల నుంచి ప్రత్యేకంగా గుర్తించడంతో పాటు, మేడారం ప్రాంతానికి ప్రత్యేకమైన బ్రాండ్ గుర్తింపు ఏర్పడుతుందని తెలిపారు.

వెదురుతో తయారు చేసే అలంకరణ వస్తువులు, గృహోపకరణాలు, పెన్ స్టాండ్లు, ఫోటో ఫ్రేములు, ల్యాంప్ షేడ్లు, బుట్టలు, చిన్న అలంకరణ వస్తువులు, జ్ఞాపికలు, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి ఉత్పత్తులను మరింత ఆకర్షణీయంగా తయారు చేసేలా



మహిళలకు ప్రోత్సాహం అందించాలని సూచించారు.

ఒక నెలపాటు ప్రత్యేక శిక్షణ -- అనంతరం మేడారంలో విక్రయ కేంద్రం

గిరిజన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వెదురు హస్తకళలు, ఇతర హ్యాండీక్రాఫ్ట్స్ తయారీలో ఒక నెలపాటు ప్రత్యేక శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. శిక్షణలో ఉత్పత్తుల తయారీతో పాటు నాణ్యత, డిజైన్, ఫినిషింగ్, ప్యాకేజింగ్, ఉత్పత్తుల ధర నిర్ణయం, మార్కెటింగ్ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.

శిక్షణ పూర్తయిన అనంతరం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో మేడారంలో ప్రత్యేక విక్రయ కేంద్రం ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. తద్వారా మేడారం సందర్శనకు వచ్చే భక్తులు, పర్యాటకులు స్థానిక గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని, మహిళలకు నిరంతర ఆదాయ మార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఈ ఉత్పత్తుల రూపకల్పనలో స్థానిక గిరిజన కళలు, సంస్కృతి, మేడారం ఆధ్యాత్మిక ప్రత్యేకతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రతి ఉత్పత్తికి ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ధర



వివరాలు, తయారీదారుల సంఘం గుర్తింపు ఉండేలా చూడాలని తెలిపారు.

మహిళలకు నైపుణ్యం నుంచి స్వయం ఉపాధి వరకు ఐటీడీఏ అండ

గిరిజన మహిళలు కేవలం శిక్షణ పొందడమే కాకుండా, ఆ శిక్షణ ద్వారా ఆదాయం సంపాదించే స్థాయికి ఎదగాలని పీఓ ఆకాంక్షించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, మేడారం సందర్శకులకు చేరువ చేయడం, ఆన్‌లైన్ విక్రయ అవకాశాలను పరిశీలించడం వంటి చర్యల ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

గిరిజన మహిళల్లో ఉన్న సంప్రదాయ నైపుణ్యాలను ఆధునిక డిజైన్లు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తే మేడారం ప్రాంతానికి ప్రత్యేకమైన హస్తకళా బ్రాండ్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. మహిళల భాగస్వామ్యంతో స్థానికంగా తయారీ, విక్రయ వ్యవస్థను బలోపేతం చేసి, వారికి స్థిరమైన ఉపాధి కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

నిరంతర పర్యవేక్షణతోనే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల సాధన

● జిల్లా ప్యానెల్ టీం



గరిడేపల్లి, నవంబర్ 27 (ప్రజావాణి): విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణితంలో ఆశించిన అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని జిల్లా ప్యానెల్ టీం అధికారులు సూచించారు.

స్థానిక గరిడేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించేందుకు జిల్లా ప్యానెల్ టీం ప్రత్యేక తనిఖీ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్యానెల్ టీం నోడల్ అధికారి కాంపెల్లి గోపిరెడ్డి, సభ్యులు చారుగుండ్ల రాజశేఖర్, రావుల రాంబాబు, మండల విద్యాధికారి (వీజూ) పానుగోతు ఛత్రునాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు తరగతి గదులను సందర్శించి విద్యార్థుల చదవడం, గణిత సామర్థ్యాలను (FLN -- Foundational Literacy and Numeracy) ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని తెలుసుకుని, ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు అమలు చేస్తున్న ప్రత్యేక బోధనా పద్ధతులు (రెమిడియేషన్) గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, ప్రత్యేక బోధనా విధానాల పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళికాబద్ధమైన బోధనతోనే విద్యార్థులు ఆశించిన అభ్యసన సామర్థ్యాలను సాధించగలరని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు కిషోర్ బాబు, సౌజన్య, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

CM రెవంత్ రెడ్డి గారి మరియు MLA మేడిపెల్లి సత్యం గారి చిత్రపటనికి పాలభిశేకం





మల్యాల: మండలం నవంబర్ 27 (ప్రజావాణి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా నూకపల్లి గ్రామ సర్పంచ్ చెవులమద్ది శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు శుక్రవారం CM రెవంత్ రెడ్డి గారి మరియు MLA మేడిపెల్లి సత్యం గారి చిత్రపటనికి పాలభిశేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ మాట్లడుతు నూతన చేయూత పింఛన్లు మంజురు చెయడం అనందంగా ఉందని వారికి మా కృతజ్ఞతలు తేలిపారు. నూతనంగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు పింఛన్లు అందేలా కృషి చేసిన సర్పంచ్ చెవులమద్ది శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నూకపల్లి గ్రామ సర్పంచ్ చెవులమద్ది శ్రీనివాస్, ఉపసర్పంచ్ కనకట్ల ఉషారాణి నాంపెల్లి, కనకట్ల జలంధర్, మద్దం శ్రీనివాస్, తుంగపేలి మోహన్, భీనవేని గణేష్, తదితరులు పాల్గొన్నారు

మంచాల టీపీఎస్ పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం

● బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: సర్పంచ్ మానస వినయ్

మంచాల, నవంబర్ 27 (ప్రజావాణి):మంచాల మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)లో బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మానస వినయ్ హాజరై విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మానస వినయ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్యకు, ఆరోగ్యానికి, భవిష్యత్తుకు ఆటంకంగా మారుతాయని తెలిపారు. బాలికలందరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను



సాధించాలని, బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు కలిసి కృషి చేయాలని సూచించారు.

అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, నిర్వహణ



వివరాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగం, వార్డు సభ్యులు నీళ్ల పారిజాత కృష్ణ, గ్యార జంగయ్య, దూసరి కల్పనా కుమార్, అశ్వల మాధవి బాలరాజు, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌కు శ్రీపాదరావు పేరు పెట్టాలి

● గోదావరి ఒడ్డున భారీ శివుని విగ్రహం, డిపో మెయిన్‌రోడ్డు కూడలిలో నంది విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి





మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 27, ప్రజావాణి: గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని మంథని పట్టణంలోని గోదావరి పుష్కర ఘాట్‌కు దివంగత నేత శ్రీపాదరావు పేరు పెట్టాలని, గోదావరి నది ఒడ్డున భారీ శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మంథని మున్సిపల్ జనరల్ బాడీ సమావేశంలో వినతిపత్రం అందజేశారు.మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, కౌన్సిలర్ సభ్యులకు గౌతమేశ్వర దేవాలయ చైర్మన్ గుండా రాజు, సభ్యుడు రామకృష్ణ, విద్యార్థి నాయకులు బెజ్జంకి డిగంబర్, సమ్మయ్య వినతిపత్రాన్ని సమర్పించారు. అలాగే డిపో మెయిన్ రోడ్డు కూడలి వద్ద భారీ నంది విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఈ ప్రతిపాదనలను పరిశీలించి అమలు చేయాలని వారు కోరారు.

బంకు నిర్లక్ష్యానికి బలవుతున్న వాహనదారులు!

● లక్షలు పెట్టి కొన్న వాహనాలు రోడ్డెక్కక నిలిచిపోతే.. కుటుంబాల జీవనాధారం ఎలా సాగాలి?

● అమన్ ఫిల్లింగ్ స్టేషన్‌పై వాహనదారుల ఆగ్రహం.. ఇంధనం నింపడంలో తప్పిదాలతో ఉపాధికి గండి.. అధికారుల విచారణ ఏదీ?

కేసముద్రం, నవంబర్ 27, ప్రజావాణి.

వాహనదారుల నమ్మకమే పెట్టుబడిగా నడవాల్సిన పెట్రోల్ బంకుల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నో లక్షల రూపాయలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసి, వాటినే జీవనాధారంగా చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్న వాహనదారులకు పెట్రోల్ బంకుల్లో జరిగే చిన్నపాటి నిర్లక్ష్యం సైతం పెద్ద ఆర్థిక భారంగా మారుతోంది. ముఖ్యంగా కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి, అర్పణపల్లి గ్రామాల మధ్య ఉన్న అమన్ ఫిల్లింగ్ స్టేషన్‌పై వాహనదారుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.తాజాగా గంధసిరి సుధాకర్ అనే ఆటో యజమాని తన జచీ+ ఆటో (నంబర్ ు+26ు5436)కు పెట్రోల్ పోయించుకునేందుకు బంకుకు వెళ్లగా, సిబ్బంది పెట్రోల్‌కు బదులుగా డీజిల్ పోశారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. రోజూ ఆటో నడుపుకుంటూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ కుటుంబాన్ని పోషించుకునే తనకు ఈ ఘటనతో ఉపాధికి ఆటంకం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వాహనం నడపలేని పరిస్థితి వస్తే ఆ రోజు సంపాదన ఆగిపోవడమే కాకుండా, మరమ్మతుల ఖర్చులు కూడా భరించాల్సి వస్తుందని బాధితుడు వాపోతున్నాడు.

లక్షలు పెట్టి కొన్న వాహనాలు.. బంకు తప్పిదాలతో రోడ్లపైనే నిలిపివేత!

వాహనదారులు తమ కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. బ్యాంకు రుణాలు, వాయిదాలు, కుటుంబ ఖర్చులు, రోజువారీ జీవన అవసరాల మధ్య వాహనాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అలాంటి వాహనాలకు ఇంధనం నింపే సమయంలో బంకు సిబ్బంది చేసే నిర్లక్ష్యపు పొరపాట్లు వారి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇంధనం తప్పుగా నింపడం వల్ల వాహనం మరమ్మతులకు గురైతే పని గంటలు వృథా కావడం, ఆదాయం కోల్పోవడం, అదనపు ఖర్చులు భరించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని వాహనదారులు



ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒక వాహనం మరమ్మతుల కోసం గ్యారేజీలో ఉంటే కేవలం వాహనమే ఆగిపోదు.. దానిపై ఆధారపడి నడిచే కుటుంబం రోజువారీ ఆదాయం కూడా నిలిచిపోతుంది. ఆటో డ్రైవర్లు, కారు యజమానులు, ట్రాక్టర్లపై ఆధారపడే రైతులు, ఇతర వాహనదారులు తమ పనులను పక్కనపెట్టి వాహనాల మరమ్మతుల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బంకు సిబ్బంది నిర్లక్ష్యానికి వాహనదారులు తమ సమయాన్ని, సంపాదనను, శ్రమను ఎందుకు బలిచేయాలని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

మైలేజీ విషయంలోనూ అనుమానాలు.. నాణ్యతపై వాహనదారుల ప్రశ్నలు!

ఇంధనం నింపిన తర్వాత ఆశించిన మైలేజీ రావడం లేదని, పెట్రోల్, డీజిల్ నాణ్యత, సరఫరా పరిమాణంపై కూడా కొందరు వాహనదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ జరగాల్సి ఉంది. ఇంధనం నాణ్యత, పరిమాణం విషయంలో వినియోగదారులకు స్పష్టత కల్పించాల్సిన బాధ్యత సంబంధిత బంకు యాజమాన్యంపై ఉంది. వాహనదారుల అనుమానాలను నివృత్తి చేసేందుకు అధికారులు తగిన తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయా?

ఈ బంకులో గతంలోనూ స్కూల్ బస్సులు, కార్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు పెట్రోల్‌కు బదులుగా డీజిల్, డీజిల్‌కు బదులుగా పెట్రోల్ నింపిన ఘటనలు జరిగినట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలను అధికారులు విచారణ ద్వారా వెలికితీయాల్సిన అవసరం ఉంది. ఒకే బంకుపై ఇలాంటి ఫిర్యాదులు పదేపదే వస్తున్నాయంటే వాటిని తేలికగా తీసుకోకుండా సమగ్రంగా పరిశీలించాలని వాహనదారులు కోరుతున్నారు.

అధికారుల తనిఖీలు ఎప్పుడు?

ఈ వ్యవహారంపై సంబంధిత పౌర సరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖ, చమురు సంస్థ ఉన్నతాధికారులు తక్షణమే



స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అమన్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ఇంధన పంపిణీ విధానం, పెట్రోల్, డీజిల్ నాణ్యత, కొలతలు, సిబ్బంది విధి నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత వాహన యజమానులకు జరిగిన నష్టాన్ని బంకు యాజమాన్యం భర్తీ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇకపై ఏ వాహనదారుడూ ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా బంకుల్లో ఇంధనం నింపే సిబ్బందికి సరైన శిక్షణ, పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని కోరుతున్నారు.వినియోగదారులు డబ్బులు చెల్లించి ఇంధనం కొనుగోలు చేస్తున్నప్పుడు వారికి సరైన ఇంధనం, సరైన కొలత, నాణ్యమైన సేవ అందడం కనీస బాధ్యత. బంకు నిర్లక్ష్యానికి సామాన్యుడి జీవనాధారం బలికాకూడదని, వాహనదారుల నమ్మకాన్ని కాపాడేలా అధికారులు ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం పేరు లేని శిలాఫలకంపై ఎంపీ వంశీకృష్ణ అభ్యంతరం

● 24 గంటల్లో మరో శిలాఫలకం!

● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు చేర్చాలని ఎంపీ లేఖ

● అధికారుల స్పందనతో మారిన శిలాఫలకం



మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 27, ప్రజావాణి: ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రారంభోత్సవ శిలాఫలకం వివాదం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కళాశాల భవనాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు లేకపోవడం వివాదానికి దారితీసింది.ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఈ అంశంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పేరును శిలాఫలకంపై చేర్చాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు.ఎంపీ లేఖపై అధికారులు స్పందించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 24 గంటల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు చేర్చి మరో శిలాఫలకాన్ని సిద్ధం చేసినట్లు తెలిసింది.ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల హోదా, ప్రభుత్వ ప్రోటోకాల్ నిబంధనలు, రాజ్యాంగబద్ధమైన పదవులకు ఇవ్వాల్సిన గౌరవం పై ఈ ఘటన మరోసారి చర్చకు తెరలేపింది. శిలాఫలకంపై ముఖ్యమంత్రి పేరు లేకపోవడానికి గల కారణాలపై అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

సంఘాల రీపేమెంట్లన్నీ ఆన్‌లైన్‌లోనే.. నగదు లావాదేవీలకు స్వస్తి!

● డిజిటల్ చెల్లింపులపై సంఘాల ప్రతినిధులకు అవగాహన.. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ.





కొండాపూర్ నవంబర్ 27 (ప్రజావాణి):ద్వాక్రా సంఘాల్లో సభ్యులు చెల్లించే చెల్లింపులు ఇకపై నగదు రూపంలో కాకుండా పూర్తిగా ఆన్‌లైన్ లావాదేవీల ద్వారానే నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు, నగదు చెల్లింపుల వల్ల తలెత్తే సమస్యలను నివారించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘాల్లో జరిగే రీపేమెంట్లను ఆన్‌లైన్ ద్వారా ఎలా చెల్లించాలి, లావాదేవీల వివరాలను సాఫ్ట్‌వేర్‌లో ఎలా నమోదు చేయాలి, చెల్లింపుల వివరాలను ఎలా పరిశీలించాలి అనే అంశాలపై వివరించారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా ప్రతి లావాదేవీకి సంబంధించిన పూర్తి వివరాలు రికార్డుల్లో అందుబాటులో ఉంటాయని, తద్వారా ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి సెర్ప్ డైరెక్టర్ (ఐటీ) ఎస్.వి. కాశీ విశ్వేశ్వరరావు మరియు వారి బృంద సభ్యులు, వరల్డ్ ఉమెన్ బ్యాంకింగ్ ప్రతినిధులు, రైట్జపాయ్ సాఫ్ట్‌వేర్ బృంద సభ్యులు హాజరయ్యారు.సంఘాల కార్యకలాపాలను మరింత సులభతరం చేయడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆర్థిక లావాదేవీలను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు.ఈ విధానం అమల్లోకి వస్తే సంఘాల రీపేమెంట్ ప్రక్రియలో వేగం పెరగడంతో పాటు, నగదు నిర్వహణ భారం తగ్గి ప్రతి చెల్లింపునకు డిజిటల్ ఆధారం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

మంథనిలో దుద్దిళ్ల రాజ్యాంగమే నడుస్తోంది

● శిలాఫలకంపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర విమర్శలు





మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 27, ప్రజావాణి: మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర విమర్శలు చేశారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలను సందర్శించిన ఆయన, ఇటీవల కళాశాల భవన ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేరు మాత్రమే ఉండటాన్ని తప్పుబట్టారు.

ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. సంగీత, నృత్య కళాశాల భవనం దుద్దిళ్ల కుటుంబం సొంత నిధులతో నిర్మించింది కాదని, ప్రజలు చెల్లించిన పన్నులతో ప్రభుత్వ నిధుల ద్వారా నిర్మించిందని పేర్కొన్నారు. అలాంటప్పుడు ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్‌ను పాటిస్తూ సంబంధిత ప్రజాప్రతినిధులందరి పేర్లు శిలాఫలకంపై ఉండాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగ దినోత్సవానికి ఒక రోజు ముందు ప్రజాస్వామ్య విలువలను విస్మరించేలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. దుద్దిళ్ల కుటుంబం అధికారంలో ఉన్నప్పుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రాజ్యాంగానికి అవమానం జరుగుతోందని ఆరోపించారు. గతంలో సామాజికంగా అణగారిన వర్గాలపై అమలైన వివక్షాపూరిత ఆచారాలను ప్రస్తావిస్తూ, నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ బీసీ, ఎస్సీ వర్గాలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని విమర్శించారు.

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్నారని, మరి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగ విలువలు ఎందుకు పాటించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శిలాఫలకంపై స్పందించిన తర్వాత రాత్రికి రాత్రే మరో శిలాఫలకాన్ని భవనం లోపల ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అయితే భవనం ముందు ఉన్న పాత శిలాఫలకాన్ని తొలగించకుండా ఉంచడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. గతంలో అక్కడ మహిళా భవనం ఉండేదని, మహిళా చైతన్యానికి సత్యభామ, చంద్రకళ వంటి మహిళల పేర్లు గుర్తింపుగా నిలిచాయని పుట్ట మధూకర్ అన్నారు. మహిళా ఉద్యమాలకు వేదికగా నిలిచిన భవనం చరిత్రను పక్కనపెట్టి, ఆ పేర్లు కనబడకుండా చేసి కొత్తగా తన కుటుంబానికి సంబంధించిన పేర్లకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని విమర్శించారు. మంథని పట్టణంలోని పురాతన మున్సిపల్ కార్యాలయం, బాలికల వసతి గృహం వంటి చారిత్రక గుర్తింపులను తొలగించడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.మంథని ప్రాంత అభివృద్ధిలో స్థానికుల పాత్ర, చరిత్ర, సామాజిక వర్గాల భాగస్వామ్యానికి గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీలో బీసీ సామాజిక వర్గానికి చెందిన చైర్మన్ ఉన్నప్పటికీ, ప్రారంభోత్సవాల సందర్భంగా ఆయన పేరుకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. గతంలో మార్కెట్ కమిటీ ప్రారంభోత్సవ సమయంలో అప్పటి చైర్మన్ సత్యనారాయణరాజు పేరును శిలాఫలకంపై పొందుపరచలేదని గుర్తు చేశారు.

ప్రజాధనంతో నిర్మించే ప్రభుత్వ భవనాలకు వ్యక్తిగత లేదా కుటుంబ పేర్లకు ప్రాధాన్యత ఇవ్వడం ఏ మేరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ పేర్లు శిలాఫలకంపై ఎందుకు ఉండకూడదో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంథని ప్రాంత చరిత్రను, స్థానికుల గుర్తింపును కనుమరుగు చేస్తూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు.

రాజ్యాంగ విలువలను గౌరవించే పౌరులుగా ఇలాంటి అంశాలపై మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు స్పందించాలని పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. వివాదాస్పద శిలాఫలకాన్ని తక్షణమే తొలగించి, ప్రభుత్వ నిబంధనలు, ప్రోటోకాల్ ప్రకారం అర్హులైన ప్రజాప్రతినిధులందరి పేర్లతో కొత్త శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి మెగా కిసాన్ మేలను విజయవంతం చేయగలరు.

● ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్.



ఏటూరునాగారం నవంబర్ 27,ప్రజావాణి: కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆత్మ సౌజన్యంతో నిర్వహిస్తున్న జిల్లా మెగా కిసాన్ మేలాకు, 28-11-2026 ఉదయం 10 -30 నీ" లకు ఏం ఆర్ గార్డెన్ ఇంచర్ల లకు ముఖ్య అతిథులుగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క , జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు , అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ , గ్రంథాలయ జిల్లా చైర్మన్ భానోత్ రవి చందర్,, మార్కెట్ కమిటీ జిల్లా చైర్మన్ రేగ కళ్యాణ్, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, ములుగు జిల్లా రైతంగం హాజరుకానున్నారు.కనుక కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరై జిల్లా మెగా కిసాన్ మేలాను విజయవంతం చేయగలరని కోరుచున్నాము.

మోర్ సూపర్ మార్కెట్ లో దారుణం ఖర్జూర ప్యాకెట్‌లో కుప్పలు తెప్పలుగా పురుగులు!

● హుజురాబాద్ పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్‌లో ఆహార పదార్థాల నాణ్యతపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి.



హుజురాబాద్ ప్రజావాణి నవంబర్ :27 హుజురాబాద్ పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్‌లో ఆహార పదార్థాల నాణ్యతపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. గర్భిణీ మహిళ ఆరోగ్యం కోసం ఎంతో నమ్మకంతో కొనుగోలు చేసిన ఖర్జూరాల ప్యాకెట్‌లో పెద్ద సంఖ్యలో తెల్ల పురుగులు కనిపించడంతో కలకలం రేగింది. ఈ ఘటనతో సూపర్ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

హుజురాబాద్ మండలం సిరసపల్లి గ్రామానికి చెందిన దుగ్గిశెట్టి విక్రమ్ కుమార్ భార్య ప్రస్తుతం గర్భిణీ. ఆమె ఆరోగ్యం కోసం గత రెండు నెలలుగా హుజురాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్డులో ఉన్న మోర్ సూపర్ మార్కెట్‌లో ఖర్జూరాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కూడా మోర్ సొంత బ్రాండ్‌కు చెందిన 'మోర్ ఖీమా ఖర్జూర' బాక్స్‌ను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికి వెళ్లి బాక్స్ తెరిచి చూడగా ఖర్జూరాల మధ్య పదుల సంఖ్యలో తెల్ల పురుగులు కనిపించాయి. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన విక్రమ్ కుమార్ వెంటనే ఆ బాక్స్‌ను తీసుకుని సూపర్ మార్కెట్‌కు చేరుకున్నారు. అక్కడి సిబ్బందిని, మేనేజర్‌ను నిలదీశారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు.. విషయం తెలుసుకున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ సిబ్బందితో కలిసి మోర్ సూపర్ మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.పురుగులు ఉన్న ఖర్జూరాల ప్యాకెట్లను పరిశీలించారు. కాలం చెల్లిన, నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు తేలితే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని, భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

గర్భిణీ అయిన తన భార్య ఆరోగ్యం కోసం ఎంతో నమ్మకంతో ఖర్జూరాలు కొనుగోలు చేశానని బాధితుడు విక్రమ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవేళ ప్యాకెట్‌లోని పురుగులను గమనించకుండా వాటిని తిని ఉంటే తన భార్యతో పాటు కడుపులోని బిడ్డ పరిస్థితి ఏమయ్యేదని ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థ పేరుతో నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించడం దారుణమన్నారు. ఈ ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తక్షణమే స్పందించాలని, సూపర్ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఆహార పదార్థాలన్నింటినీ తనిఖీ చేయాలని బాధితుడు కోరారు. మోర్ సూపర్ మార్కెట్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి, స్టోర్‌ను వెంటనే సీజ్ చేయాలని దుగ్గిశెట్టి విక్రమ్ కుమార్ డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి

● స్మార్ట్ కార్డుతో అన్నీ సంక్షేమ పథకాలు : సర్పంచ్ రాజ్ కుమార్



జహీరాబాద్, నవంబర్ 27 (ప్రజావాణి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలను చేరవేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని సర్పంచ్ రాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం నాడు మనియర్ పల్లి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ సరుకులు పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని, మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణి చేయబోతున్నారని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తుందని, ఇల్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని సర్పంచ్ రాజ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యాధునిక వైద్య సదుపాయాలు

● గరిడేపల్లి పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం.. డాక్టర్ నరేష్, వైద్య సిబ్బందిని అభినందించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్



గరిడేపల్లి, నవంబర్ 27 (ప్రజావాణి):ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ సూచించారు. గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు విజయవంతంగా సాధారణ ప్రసవం నిర్వహించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ నరేష్‌తో పాటు ప్రసవం నిర్వహణలో పాల్గొన్న వైద్య సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా నేటి ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం ఉంచి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ప్రసూతి సేవలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం, సురక్షిత ప్రసవాలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని డాక్టర్ నరేష్ వెల్లడించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై....బెట్టింగ్ అప్పులు తీర్చేందుకు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ

● చోరీ చేసిన బంగారు గొలుసు , ఒక ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్ స్వాధీనం నిందితుడు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు.

● వివరాలు వెల్లడించిన వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు..



నవంబర్ 27 మన సమగ్ర ప్రజావాణి ప్రతినిధి కోనరావుపేట: కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన ముష్టం వెంకటేష్, తండ్రి పేరు: అంజయ్య, వయస్సు: 29 సంవత్సరాలు అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఐటీఐ పూర్తి చేసి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో వెంకటేష్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి మొదట కొంత డబ్బు గెలిచినప్పటికీ, అనంతరం పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. దాంతో హైదరాబాద్ నుండి స్వంత గ్రామానికి వచ్చి ఇక్కడే వుంటున్నాడు. ఇక్కడ కూడా బెట్టింగ్ కోసం తన భార్య బంగారు నగలను తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులు కూడా బెట్టింగ్ లో పెట్టి పోగొట్టుకున్నాడు, అంతేకాకుండా తెలిసిన వారి వద్ద అబద్ధాలు చెప్పి అప్పులు తీసుకొని ఆ డబ్బులను కూడా బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. ఈక్రమంలో పోగొట్టుకున్న డబ్బులను తిరిగి సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనానికి పథకం వేయగా తనకు బంధువులైన కోదురుపాక గ్రామానికి చెందిన బొంగొని రాజవ్వ (అమ్మమ్మ) ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలుసుకొని, ఆమె మెడలో బంగారు గొలుసు ఉండటాన్ని గమనించి దొంగలించాలనుకున్నాడు.తేదీ 18-11-2026న సాయంత్రం తన పల్సర్ బైక్‌పై కోదురుపాకకు చేరుకొని, ముందస్తు ప్రణాళిక ప్రకారం మంకీ క్యాప్ ధరించి రాజవ్వ ఇంట్లోకి ప్రవేశించి గుర్తు పట్టకుండా వెంటనే లైట్ ఆఫ్ చేసి అనంతరం ఆమె నోటికి తువ్వాలు అడ్డుపెట్టి బెదిరించి, మెడలో ఉన్న బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. రాజవ్వ కొడుకు లక్ష్మీనారాయణ ఇచ్చిన పిర్యాదు మేరకు బోయినపల్లి ఎస్.ఐ రమాకాంత్ కేసు నమోదు చేయడం జరిగింది. వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్ దర్యాప్తు ప్రారంభించగా సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందుతుని నవంబర్ 27 ఉదయం సుమారు 11 గంటల సమయంలో కోదురుపాక ఎక్స్ రోడ్ అదుపులోకి తీసుకొని అతని వద్ద చోరీ చేసిన 10 గ్రాముల బంగారు గొలుసు, ఒక బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్ కి తరలించినట్లు డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, అప్పుల ఊబిలో కూరుకుపోయి నేరాలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో తమ జీవితాలను నేరాల వైపు మళ్లించుకోవద్దని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నిధుతుణ్ణి పట్టుకోవడంలో కృషి చేసిన వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ధర్మతేజ, కాశిం, శ్రీధర్, యాకుబ్ లను డిఎస్పీ గారు అభినందించారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి: ఘట్‌కేసర్ సీఐ పి. కిరణ్





ఎదులాబాద్, నవంబర్ 27: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ సీఐ పి. కిరణ్ పిలుపునిచ్చారు. ఎదులాబాద్‌లోని మేఘా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ పి. కిరణ్ విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం, మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలకు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాల గురించి వివరించారు.విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించి, క్రమశిక్షణతో ముందుకు సాగినప్పుడే తమ జీవిత లక్ష్యాలను చేరుకోగలరని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసలైతే ఉజ్వల భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉంటూ సమాజంలో మంచి మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని, నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు అని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.కళాశాల పరిసరాల్లో లేదా ఇతర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు డయల్ 112 లేదా 1903 ద్వారా సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వైద్య భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి

- ప్రభుత్వ ఆశయాలు పేదల కోసం ఉండాలి : ఎమ్మెల్యే మాణిక్ రావు
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల ను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే





జహీరాబాద్, నవంబర్ 27 (ప్రజావాణి): నియోజకవర్గ పలు గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు గాను రూపాయలు 16,30,500 విలువగల చెక్కులను ఎమ్మెల్యే మాణిక్ రావు పంపిణి చేశారు.

1.జహీరాబాద్ పట్టణం 13 మంది లబ్ధిదారులకు గాను 3,68,000,
2.జహీరాబాద్ మండలం లబ్ధిదారులకు 4,57,000
3.న్యాల్కల్ మండలం లబ్ధిదారులకు 1,53,000
4.మొగుడంపల్లి మండలం లబ్ధిదారులకు 1,17,500
5.కోహీర్ మండలం లబ్ధిదారులకు 1,88,000
6. ఝరసంఘం మండలం లబ్ధిదారులకు 3,46,500 విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మాజి న్యాల్కల్ మండల పార్టీ అధ్యక్షులు నరసింహ రెడ్డి, గ్రామాల సర్పంచ్ లు, మాజి సర్పంచ్ లు, మాజి ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం...

- మార్కెట్ కమిటీ చైర్మన్ గా సుధగాని మల్లేష్ గౌడ్.
- వైస్ చైర్మన్ గా మహ్మద్ ఏజాజ్.
- 15 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం.
- హాజరైన రోడ్లు భవనాల సినిమాటోగ్రాఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.
- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆ లేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య.



మన ప్రజావాణి తుర్కపల్లి ప్రతినిధి నవంబర్ 27 యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర రోడ్లు భవనాల సినిమా ఆటోగ్రాఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలేరు పట్టణంలో నాయకులతో కార్య కర్తలతో స్థానిక పాల సీతలి కేంద్రం నుండి ఏఎన్ఆర్ ఫంక్షన్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలేరు మార్కెట్ కమిటీ పాలక వర్గం సభ్యులు మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఆలేరు అభివృద్ధికి 2 వేల కోట్ల అభివృద్ధి పనులు చేసుకుంటున్నాం. వచ్చే మరో 5 ఏళ్లు కూడా ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది.రాబోయే రోజుల్లో గంధమల్లని నింపి నియోజకవర్గం లోని అన్ని మండాలకు నీళ్లు అందించే మంత్రి కోమటి రెడ్డి సహకారంతో ముందుకు సాగుతోందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు కెటాయించే భాద్యత నాది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా అవినీతి ఆరోపణలు వెల్లు వెత్తాయన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన రోజు నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రజల సంక్షేమమే దిశగా ప్రభుత్వం ఆడుగులు వేస్తుందన్నారు. బీర్ల ఆయిలయ్యను మంత్రిని చేసే వరకు నేను నిద్రపోను.. బిసి వర్గానికి చెందిన ఆయిలయ్య పేరు ముఖ్యమంత్రి దృష్టిలో ఉందన్నారు.కానీ కోంత మంది ఆయిలయ్య విషయంలో వెనుకడుగు వేస్తున్నారు. నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ సుధగాని మల్లేష్ మాట్లాడుతూ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎలాంటి రాగ ద్వేశాలకు తావు లేకుండా మార్కెట్ కమిటీ అభి వృద్ధిదే దిశగా పని చేస్తానని చే పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్లు ఉప సర్పంచ్లు ప్రజాప్రతినిధులు పిఎస్సిఎస్ చైర్మన్లు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మాతృత్వానికి మమకారపు వేడుక.. గర్భిణీలకు 'అమ్మకు వందనం'

- గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీమంతాలు.. మహిళలకు ఘన సత్కారం





సిద్దిపేట్ రాయపోల్ నవంబర్27 (ప్రజావాణి)గజ్వేల్ పట్టణంలో మాతృత్వానికి గౌరవం పలుకుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ లిలి గజ్వేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అమ్మకు వందనం' కార్యక్రమం వైభవంగా జరిగింది. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. సంప్రదాయాలు, ఆప్యాయతలు, ఆనందోత్సాహాల మధ్య గర్భిణీ స్త్రీలకు ఘనంగా శ్రీమంతాలు నిర్వహించి సత్కరించారు. పసుపు, కుంకుమ, గాజులు, పూలు,పండ్లతో వారిని ఆశీర్వదిస్తూ మాతృత్వపు మధురానుభూతిని మరింత ప్రత్యేకంగా మార్చారు. మహిళ జీవితంలో అమ్మతనం అత్యంత అపురూపమైన ఘట్టమని చాటిచెప్పేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మాతృత్వం అనేది మాటల్లో వర్ణించలేని పవిత్రమైన అనుభూతి అని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలకు కుటుంబ సభ్యులతో పాటు సమాజం కూడా ప్రేమ, ఆదరణ, ఆత్మీయతను అందించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణీల ముఖాల్లో చిరునవ్వులు నింపడం, వారి మనోధైర్యాన్ని పెంపొందించడం, మాతృత్వానికి సముచిత గౌరవం కల్పించడమే 'అమ్మకు వందనం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతి వర్గం సంతోషం, సంక్షేమం కోసం లయన్స్ క్లబ్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. మానవీయ విలువలు, సామాజిక బాధ్యతను చాటిచెప్పే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.



సాధారణంగా కుటుంబాలకే పరిమితమయ్యే శ్రీమంతాల వేడుకను సామాజిక సేవలో భాగంగా నిర్వహించి గర్భిణీ స్త్రీలకు ఆత్మీయతను పంచడం పలువురిని ఆకట్టుకుంది. మహిళల పట్ల గౌరవం, మాతృత్వం పట్ల మమకారం, సమాజం పట్ల సేవాభావం కలగలిసిన ఈ వేడుక ఆహ్లాదకరంగా సాగింది. కార్యక్రమంలో అమర్నాథ్ రావు, బండారు రామ్ పనిధర్ రావు, జిల్లా రమేష్, మర్రి ప్రవీణ్, డాక్టర్ కుమారస్వామి, గుడాల రాధాకృష్ణ, సంజయ్ గుప్తా, మల్లేశం గౌడ్, టి. స్వామి, తాటి రాములు, అధికారి దేవసాని వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ట్రేడ్ సెల్ కన్వీనర్‌గా తాళ్లపల్లి మురళీధర్ గుప్త నియామకం

- నూతన కన్వీనర్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్, పూడూరు--కిష్టాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు



మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి మురళీధర్ గుప్త మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ట్రేడ్ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ డివిజన్, పూడూరు--కిష్టాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్న తాళ్లపల్లి మురళీధర్ గుప్తకు ట్రేడ్ సెల్ కన్వీనర్ బాధ్యతలు అప్పగించడంతో స్థానిక పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమైంది. ఆయనకు నూతన బాధ్యతలు అప్పగించిన సందర్భంగా నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ నియామకం పార్టీకి, వ్యాపార వర్గాలకు మధ్య మరింత సమన్వయం పెంపొందించేందుకు దోహదపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ 297వ డివిజన్ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్, పూడూరు--కిష్టాపూర్ 298వ డివిజన్ అధ్యక్షుడు వేముల సత్యనారాయణ రెడ్డి నూతన కన్వీనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యాపారులు, వాణిజ్య వర్గాల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యకర్తల సహకారం, నాయకుల సమన్వయంతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. మురళీధర్ గుప్తకు అప్పగించిన నూతన బాధ్యతలు పార్టీ బలోపేతానికి ఉపయోగపడతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, మైసరి రాజు వంజరి, దోసడి రామచంద్ర రెడ్డి, పోతుల హరిబాబు రెడ్డి, కానుకంటి వంశీ విజయ్ వంజరి, మామిళ్ల నర్సింగ్ రావు, జకట బాబు రాజు తదితర నాయకులు పాల్గొని తాళ్లపల్లి మురళీధర్ గుప్తకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలి

- చిలుకూరులో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులతో మండల అధ్యక్షుడు అక్కినపల్లి జానకిరామచారి సమావేశం



చిలుకూరు, నవంబర్ 27(ప్రజావాణి):: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో దీక్షా దివస్‌కు ప్రత్యేక స్థానం ఉందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 29న కోదాడలో గౌరవ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీక్షా దివస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అక్కినపల్లి జానకిరామచారి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కేసీఆర్ చేపట్టిన దీక్ష తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక మలుపుగా నిలిచిందని, ఆ చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సభకు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ అలసగాని జనార్ధన్,తాళ్ళూరి శ్రీను,పాషా,వాస్,లావూరి.శ్రీనివాస్,బుడిగెం కిషోర్,మాదారపు శ్రీను, లింగరాజు, నరేష్,రవిందర్, పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు

- విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి -- ఆర్డీవో సోమిరెడ్డి



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, నవంబర్ 27 (ప్రజావాణి): మంచాల కష్టపడి చదివితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్డీవో సోమిరెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండల కేంద్రంలోని కస్తూర్బా గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.50 వేల విలువైన పిండి కలిపే యంత్రంతో పాటు విద్యార్థుల వినియోగించుకునేందుకు టబ్బులు, జగ్‌లు, గ్రంథాలయానికి పుస్తకాలను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు.

విద్యుత్ సరఫరా అంతరాయం

ఘట్‌కేసర్, నవంబర్ 27: సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా నవంబర్ 28 (శనివారం) ఘట్‌కేసర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం. సైదా నాయక్ తెలిపారు.శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ అంతరాయ ప్రాంతాలు కొండాపూర్ గ్రామం, సింగరేణి కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, ఘట్‌కేసర్ బాలాజీనగర్, మెదపటినగర్, గాంధీనగర్, మజార్‌గూడ, అవుషాపూర్ గ్రామం, కెపాల్, వి.బి.ఐ.టి. కళాశాల, కళాశాల రోడ్డు ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు.విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది కృషి చేస్తారని, విద్యుత్ అంతరాయం వల్ల కలిగే అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ ఎం. సైదా నాయక్ కోరారు.

మద్యం షాపుకు కిక్కు కోసం వెళ్తే.. జబ్బులు కాయం

- ఆర్ఆర్ వైన్స్ సిట్టింగ్ స్థలం చెత్తకుప్పలా.. పట్టించుకోని నిర్వాహకులు





మేడ్చల్ (డీపుల్స్ డైలీ):- మేడ్చల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్ఆర్ వైన్స్ వద్ద మద్యం సేవించేందుకు ఏర్పాటు చేసిన సిట్టింగ్ స్థలం అపరిశుభ్రతకు నిలయంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం, అపరిశుభ్ర వాతావరణం కారణంగా మందుబాబులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. వైన్స్ నిర్వాహకులు సిట్టింగ్ ప్రాంతాన్ని క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవడంతో చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. మద్యం సేవించేందుకు వచ్చే వారు అదే అపరిశుభ్ర ప్రదేశంలో కూర్చోవాల్సి వస్తుండటంతో దోమలు, ఈగలు, దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పుట్టి మురళి



ఆర్మూర్ టౌన్, నవంబర్ 27 (మన సమగ్ర ప్రజావాణి):టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిజామాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా పుట్టి మురళి భారీ మెజార్టీతో విజయం సాధించారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని విజయలక్ష్మి గార్డెన్స్ లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే మహాసభలో ఎన్నికలు ఉత్కంఠభరితంగా జరిగాయి.ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు.ఇటీవల కాలంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉంటూ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో పుట్టి మురళి,ఎడ్ల సంజీవ్ పోటీ పడగా, పుట్టి మురళి 67 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. మొత్తం 507 ఓట్లకు గాను 308 ఓట్లు పోలయ్యాయి. వీటిలో మూడు ఓట్లు చెల్లకుండా పోయాయి. పుట్టి మురళికి 185 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి ఎడ్ల సంజీవ్‌కు 118 ఓట్లు లభించాయి.ప్రధాన కార్యదర్శి పదవికి అరవింద్ బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారి పదవికి మల్లెపూల నర్సయ్య, మండే మోహన్ పోటీ పడగా, 303 ఓట్లు పోలయ్యాయి. వీటిలో నాలుగు ఓట్లు చెల్లలేదు. మల్లెపూల నర్సయ్యకు 155 ఓట్లు రాగా, మండే మోహన్‌కు 144 ఓట్లు వచ్చాయి. దీంతో 11 ఓట్ల మెజార్టీతో నర్సయ్య విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ పడగా,జి. నాగరాజు, చరణ్ గౌడ్, నీల నాగరాజు విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీలు గా ఎస్. శ్రీనివాస్, టి. వినోద్, బి. అరవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు 14 మంది కార్యవర్గ సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అన్వేష్ ప్రకటించారు.

ప్రజా సమస్యలపై పోరాడిన మహానేత కామ్రేడ్ పోటు ప్రసాద్

● ఆయన ఆశయాలను కొనసాగించాలి: సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య



గరిడేపల్లి, నవంబర్ 27 (ప్రజావాణి) గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలో కామ్రేడ్ పోటు ప్రసాద్ రెండో వర్ధంతిని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ గరిడేపల్లి మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, పోటు ప్రసాద్ స్మారక స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ పోటు ప్రసాద్ పోరాట మార్గాన్ని ఎంచుకొని పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు, సమరశీల పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ, ప్రతి క్షణం ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.పార్టీలో అనేక హోదాల్లో బాధ్యతలు నిర్వహించిన పోటు ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా, ఖమ్మం జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి ప్రజలకు విశేష సేవలందించారని గుర్తుచేశారు. ఆయన మరణం సీపీఐ పార్టీకి, కార్మిక వర్గానికి, పేద ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కామ్రేడ్ పోటు ప్రసాద్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి, సీపీఐ గరిడేపల్లి మండల సహాయ కార్యదర్శి పోటు పూర్ణచంద్రరావు, రంగాపురం గ్రామ సర్పంచ్ కట్ట కళ్యాణ్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు ఎర్ర అంజన్ రెడ్డి, తిరగమల్ల కిరణ్, కుందూరు వెంకటరెడ్డి, పంగా గోవింద్, రంగాపురం గ్రామ శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు పోటు కృష్ణ, కట్ట అశోక్, పోటు చంటిబాబు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో ప్రజల ప్రాణాలకు ముప్పు!

● రోడ్డు వేసిన 15 రోజులకే మూడుసార్లు డ్రైనేజీ మూతలు మార్పు
● కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం నాణ్యత లేని పనులతో ప్రభుత్వ నిధులు వృథా.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?





మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్టేషన్‌కు వెళ్లే రహదారిపై చేపట్టిన అభివృద్ధి పనుల నాణ్యతపై స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయి 15 రోజులు కూడా గడవకముందే డ్రైనేజీ మూతలు పదేపదే పగిలిపోతుండటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడు రోజులకు ఒకసారి డ్రైనేజీ మూతలు పగిలిపోతున్న పరిస్థితి నెలకొనడంతో కాంట్రాక్టర్ పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

15 రోజుల్లోనే మూడుసార్లు మార్పు

రోడ్డు నిర్మాణం పూర్తయిన కొద్ది రోజులకే డ్రైనేజీ మూతలు పగిలిపోవడం, వాటిని తిరిగి మార్చడం, మళ్లీ కొద్ది రోజులకే విరిగిపోవడం పరిపాటిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటివరకు సుమారు మూడుసార్లు డ్రైనేజీ మూతలను మార్చాల్సి వచ్చిందని, అయినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. పనులు పూర్తయిన వెంటనే ఇలాంటి పరిస్థితి ఏర్పడటం నిర్మాణ నాణ్యతపై అనుమానాలకు తావిస్తోంది.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా.. అధికారుల పర్యవేక్షణ లోపమా?

ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సి ఉండగా, కాంట్రాక్టర్ నాసిరకం సామగ్రిని ఉపయోగించి ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనుల నాణ్యతను పరిశీలించి పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే డ్రైనేజీ మూతలు పగిలిపోతుంటే అధికారుల నాణ్యత తనిఖీలు ఏ మేరకు జరిగాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పగిలిన డ్రైనేజీ మూతల కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో పగిలిన మూతలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాద ముప్పు మరింత ఎక్కువగా ఉంటుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రజల ప్రాణాలకు హాని కలిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని డిమాండ్

ప్రజల సౌకర్యం, భద్రత కోసం చేపట్టే రోడ్లు, డ్రైనేజీ పనులు నాణ్యతతో ఉండాల్సిందేనని స్థానికులు పేర్కొంటున్నారు. పదిహేను రోజులకే మూడుసార్లు మూతలు మార్చాల్సిన పరిస్థితి రావడం కాంట్రాక్టర్ పనితీరుకు నిదర్శనమని విమర్శిస్తున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పగిలిన డ్రైనేజీ మూతలను నాణ్యమైన వాటితో ఏర్పాటు చేయాలని, పనుల నాణ్యతపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాధనం వెచ్చించి చేపట్టే అభివృద్ధి పనులు కొద్ది రోజులకే దెబ్బతింటే నిధుల వినియోగం ప్రశ్నార్థకంగా మారుతుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సుద్దులంలో ఉచిత కంటి వైద్య శిబిరం



కోటగిరి/ప్రజావాణి:-నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజక వర్గం కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో శుక్రవారం బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి,కోటగిరి లయన్స్ క్లబ్ డైమండ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి,కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించి.ఉచిత మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు బోధన్,కోటగిరి లయన్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగన్నాథ్ పటేల్,లయన్స్ క్లబ్ డైమండ్ కోటగిరి అధ్యక్షుడు తేల్ల రవికుమార్,కార్యదర్శి హనుమంతరావు పటేల్,మాజీ ఎంపీటీ సీ తోట బాబన్న,మాజీ సర్పంచ్ సాయిలు,పంచా యతీ కార్యదర్శి కే.నవీన్,గ్రామ పెద్ద దొండిబా మహారాజ్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

● బీసీ గురుకుల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ఁ ప్రోత్సహించాలి.. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి
● తూర్కపల్లిలో మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గురుకుల విద్యార్థుల రాష్ట్రస్థాయి ఆటలు, క్రీడా పోటీలు ప్రారంభం





మేడ్చల్: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి సరైన అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని నాయకులు పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.

మేడ్చల్ నియోజకవర్గంలోని ఆలియాబాద్ మున్సిపాలిటీ పరిధి తూర్కపల్లిలోని జ్యోతిప్మతి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు), జూబ్లీహిల్స్--నాంపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటలు, క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మంత్రి, డీసీసీ అధ్యక్షుడి చేతుల మీదుగా పోటీలు ప్రారంభం

క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతూ క్రీడా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ గురుకుల విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ, క్రీడలు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించడం, ప్రత్యర్థుల పట్ల గౌరవం కలిగి ఉండటం, జట్టుగా సమన్వయంతో పనిచేయడం వంటి విలువలు క్రీడల ద్వారా అలవడతాయని తెలిపారు.

క్రీడల్లో రాణించేలా విద్యార్థులకు ప్రోత్సాహం

బీసీ గురుకుల విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ ఉందని, వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలరని నాయకులు అభిప్రాయపడ్డారు. చదువులో రాణించడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, తమ విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.గ్రామీణ, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మంచి క్రీడాకారులను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు విద్యార్థులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తూర్కపల్లిలో నిర్వహించిన ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని, కష్టపడి సాధన చేస్తూ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని నాయకులు ఆకాంక్షించారు.

జాపాల గ్రామ అభివృద్ధి లక్ష్యంగా.. ప్రజా సంక్షేమమే ధ్యేయం

● ప్రజలఅవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతాం... సర్పంచ్ మంచాల రవి





ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నవంబర్ 27 (ప్రజావాణి): జాపాల్ ఈసందర్భంగా సర్పంచ్ రవి మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి హామీ పనుల అమలు, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బియ్యని ప్రభావతి సతీష్, వార్డు సభ్యులు భాస్కర్, ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్, ఉపాధి హామీ కూలీలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధిలో గ్రామసభలదే కీలక పాత్ర: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో





ఏటూరునాగారం నవంబర్ 27, ప్రజావాణి: పెద్దగొల్లగూడెంలో సాండ్ పేసా గ్రామసభ నిర్వహణ.. గ్రామస్థుల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చ పెద్దగొల్లగూడెం గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధి, స్థానిక ప్రజల భాగస్వామ్యం, గ్రామస్థాయిలో ప్రజాస్వామ్య పరిపాలనను బలోపేతం చేయడంలో గ్రామసభలు కీలక పాత్ర పోషిస్తాయని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో పేర్కొన్నారు. పీఓ సూచనలు, ఆదేశాల మేరకు శుక్రవారం వాజేడు మండలం పెద్దగొల్లగూడెం గ్రామంలో సాండ్ పేసా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజలతో చర్చిస్తూ, గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.గ్రామసభల ద్వారా ప్రజలకు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడంతో పాటు, స్థానిక అవసరాలు, సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించాలని పీఓ సూచించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.గ్రామసభల్లో ప్రజల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, వారి అభిప్రాయాలు, సూచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో స్పష్టం చేశారు. గిరిజన గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూ భారతి లక్ష్యం

■ భూ రికార్డుల్లో పారదర్శకతకు భూముల రీ-సర్వే.. ప్రతి అంగుళం భూమికి పక్కా హద్దుల నిర్ణయం
■ పడమటి సాయిగూడ లో భూ భారతి--భూ సర్వే ప్రత్యేక గ్రామసభ.. సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలి: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్, నవంబర్ 27: రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడం, భూముల హద్దులను పక్కాగా నిర్ధారించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం, భూముల రీ-సర్వే ప్రక్రియను చేపడుతోందని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి తెలిపారు. భూములకు సంబంధించిన వివాదాలు తగ్గించి, రైతులకు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా స్పష్టమైన భూ రికార్డులు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. శుక్రవారం ఘట్కేసర్ మండలం పడమటి సాయిగూడ గ్రామంలో నిర్వహించిన భూ భారతి--భూ సర్వే ప్రత్యేక గ్రామసభకు అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టనున్న భూముల రీ-సర్వే ప్రక్రియ, దాని విధానం, రైతులకు కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు, రైతులకు వివరించారు. భూముల వివరాల నమోదు, సర్వే, హద్దుల నిర్ధారణ వంటి అంశాల్లో పారదర్శకత పాటిస్తామని తెలిపారు.

ప్రతి అంగుళం భూమికి పక్కా హద్దులు

గ్రామంలోని ప్రతి అంగుళం భూమిని క్షుణ్ణంగా సర్వే చేసి, భూముల వాస్తవ విస్తీర్ణం,హద్దులను పక్కాగా గుర్తిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. భూముల కొలతల్లో స్పష్టత తీసుకురావడం ద్వారా ఒకరి భూమి మరొకరి భూమిలోకి కలిసిపోవడం, హద్దుల విషయంలో తలెత్తే వివాదాలు, ఇతర భూ సమస్యలకు అవకాశం లేకుండా చర్యలు చేపడతామని వివరించారు.

భూ రికార్డుల్లో తప్పులు, భూముల సరిహద్దులపై అనుమానాలు, వివిధ రకాల వివాదాలు రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో రీ-సర్వే ద్వారా భూముల వివరాలను పక్కాగా నమోదు చేయడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. భూ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు భూములపై స్పష్టత కల్పిస్తామని తెలిపారు.

క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

రీ-సర్వే పూర్తయిన అనంతరం క్యూఆర్ కోడ్, భూమి నక్షా (మ్యాప్), భూ ఆధార్ అనుసంధానంతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేస్తామని అదనపు కలెక్టర్ వివరించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి భూముల వివరాలను నమోదు చేయడం ద్వారా రికార్డుల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని,భూములకు సంబంధించిన సమాచారం పారదర్శకంగా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కొత్త పాస్ పుస్తకాల ద్వారా భూముల వివరాలకు సంబంధించి స్పష్టత పెరగడంతో పాటు రైతులకు భూ సంబంధిత సేవలు అందించడంలోనూ సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. భూ భారతి కార్యక్రమం రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

సర్వేకు రైతులు సహకరించాలి

భూముల రీ-సర్వే విషయంలో రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని అదనపు కలెక్టర్ సూచించారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర అవసరమైన పత్రాలను అధికారులకు అందజేసి సర్వే ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. సర్వే సమయంలో అధికారులు అడిగే వివరాలను అందించడం, భూముల హద్దుల గుర్తింపులో సహకరించడం ద్వారా ప్రక్రియ సజావుగా పూర్తవుతుందని తెలిపారు.భూ భారతి--భూ సర్వే కార్యక్రమం ద్వారా భూముల వివరాల్లో పారదర్శకత పెంపొందించి, రైతుల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా రెవెన్యూ శాఖ పనిచేస్తోందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో నల్ల వెంకటరెడ్డి, ఘట్కేసర్ మండల రెవెన్యూ అధికారి చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి కుమారుడి వివాహ వేడుకకు హాజరైన రాజకీయ ప్రముఖులు



మంచాల, నవంబర్ 27 (ప్రజావాణి):మంచాల మండల బీజేపీ అధ్యక్షుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి కుమారుడి వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరి వెంకటరెడ్డి, అనిరెడ్డి వెంకటరెడ్డి, మల్గ శ్రీశైలం, గడ్డం రాజేందర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు జంబుల శ్రీధర్ రెడ్డి, గ్యార శేఖర్, అశ్వాల బాలరాజు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులందరూ నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో నాయకులు, బంధుమిత్రుల సందడితో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

డప్పు చాటింపుతో దీక్షా దివస్ సభకు ఆహ్వానం

- 29న అలుగునూరులో భారీ సభ.. ముఖ్య అతిథిగా కేటీఆర్



బెజ్జంకి, నవంబర్ 27 (ప్రజావాణి) తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టమైన దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని కోరుతూ బెజ్జంకి మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డప్పు చాటింపు నిర్వహించి ప్రజలకు ఆహ్వానం పలికారు.ఒకప్పుడు గ్రామాల్లో శుభకార్యాలు, ముఖ్యమైన సమావేశాలు, ఇతర కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడానికి డప్పు చాటింపు ప్రధాన ప్రచార సాధనంగా ఉండేదని,ఆ సంప్రదాయాన్ని గుర్తుచేస్తూ దీక్షా దివస్ సభకు ప్రజలను ఆహ్వానిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. డప్పు చాటింపు వినిపిస్తే గ్రామ ప్రజలు ఏదో ముఖ్యమైన కార్యక్రమం జరుగుతోందని భావించి హాజరయ్యే సంప్రదాయం ఉండేదని గుర్తుచేశారు.దీక్షా దివస్ కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం మాత్రమే కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన చారిత్రక సందర్భమని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులు, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు, కవులు,మేధావులు, వారి కుటుంబాలను స్మరించుకుని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ నెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూరులో నిర్వహించనున్న దీక్షా దివస్ సభకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభం కానుండగా, వేలాది మంది ప్రజలతో భారీ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.
తెలంగాణ ఉద్యమ చరిత్రను గుర్తుచేసే దీక్షా దివస్ సభను ప్రతి ఒక్కరూ తమ సొంత కార్యక్రమంగా భావించి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి చింతం సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, రాష్ట్ర నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, చింతకింది శ్రీనివాస్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కచ్చు రాజయ్య, ముక్కిస తిరుపతి రెడ్డి, వంగల నరేశ్, కల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి రేషన్ కార్డుదారులకు ఇందిరమ్మ బీమా కల్పించాలి

- నామినీ సమస్యతో అర్హులను పథకానికి దూరం చేయడం అన్యాయం..
- నిబంధనలు సవరించాలి -- దొంతరవేణి మహేష్



బెజ్జంకి, నవంబర్ 27 (ప్రజావాణి)రేషన్ కార్డులో ఒక్కరి పేరు మాత్రమే ఉందనే కారణంతో ఒంటరి మహిళలు, పురుషులకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడం అన్యాయమని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు. అర్హులైన ఒంటరి వ్యక్తులకు సైతం రూ.5 లక్షల జీవిత బీమా కల్పించేలా ప్రభుత్వం నిబంధనలను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు.రేషన్ కార్డులో ఒక్కరే ఉండి, అదే కార్డులో ఇతర కుటుంబ సభ్యులు నామినీగా లేకపోవడంతో బీమా దరఖాస్తుల స్వీకరణలో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. భర్తను కోల్పోయిన మహిళలు, భార్యను కోల్పోయిన పురుషులు, కుటుంబ సభ్యులకు దూరంగా ఒంటరిగా జీవిస్తున్న వారికి కూడా ఆర్థిక భద్రత అవసరమని పేర్కొన్నారు.ఇతర రేషన్ కార్డుల్లోని కుటుంబ సభ్యులను లేదా చట్టబద్ధమైన నామినీలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని, నామినీ సమస్యతో తిరస్కరణకు గురైన దరఖాస్తులను తిరిగి పరిశీలించాలని కోరారు. ఒంటరి మహిళలు, వితంతువులు, ఒంటరి పురుషులకు ప్రత్యేక మినహాయింపులు కల్పించి గ్రామస్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సాంకేతిక నిబంధనల పేరుతో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా చేయొద్దని, ఒంటరి రేషన్ కార్డుదారులకు ఇందిరమ్మ బీమా వర్తింపజేసి న్యాయం చేయాలని దొంతరవేణి మహేష్ ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ రావు పటేల్ జన్మదిన వేడుకలు

- కాంగ్రెస్ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పోస్టర్ల ఆవిష్కరణ





నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో నవంబర్ 27:--
ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ముధోల్ తాలూకా ఇంచార్జ్ బోస్లే నారాయణ రావు పటేల్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నవంబర్ 27 సందర్భంగా కమలా జిన్నింగ్ ఫ్యాక్టరీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పట్టణ, మండల అధ్యక్షులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పేద కుటుంబాలకు అండగా నిలిచే ఇలాంటి పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.
ఈ సందర్భంగా తనూర్ మండల్ మాజీ ఎంపీపీ చంద్రకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. బోస్లే నారాయణ రావు పటేల్ రాజకీయ ప్రస్థానం ప్రజాసేవకు నిదర్శనమని కొనియాడారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవిలో ఉన్నా, లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం లభిస్తోందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.
బదగం గ్రామ సర్పంచ్ గోవిందరావు మాట్లాడుతూ.. బోస్లే నారాయణ రావు పటేల్ నాయకత్వం గ్రామీణ ప్రాంతాల కాంగ్రెస్ కార్యకర్తలకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆయన నిరంతరం ఆలోచించే నాయకుడని పేర్కొన్నారు. కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగడం ఆయన ప్రత్యేకత అని, ఆయన జన్మదినం సందర్భంగా ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంకర్ చంద్ర మాట్లాడుతూ.. బోస్లే నారాయణ రావు పటేల్‌కు పార్టీ పట్ల ఉన్న నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న అంకితభావం అభినందనీయమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతూ నాయకులు, కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలుస్తున్నారని తెలిపారు. పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, ముధోల్ తాలూకాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో భైంసా పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కే. అరవింద్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ యాదవ్, సర్పంచ్ గోవిందరావు, హఫీజ్ ఉల్లా ఖాన్, మొహమ్మద్ లతీఫ్, మక్సూద్ ఖాన్. సయ్యద్ షాహిద్. అల్మా ఖాన్, జఫర్, మతీన్ ఖాన్, పాషా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని బోస్లే నారాయణ రావు పటేల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మాచునూర్‌లో ఘనంగా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి.. సర్పంచ్ మాధవి వెంకటేశం



సంగారెడ్డి జిల్లా, ఝరాసంగం మండలం నవంబర్ 27 (ప్రజావాణి) మాచునూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాధవి వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవి వెంకటేశం మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత సౌకర్యవంతంగా సేవలు అందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ జీపీఓ అజాజ్, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, ఉప సర్పంచ్ దినాకర్, వార్డు సభ్యులు దేవపుత్ర, అశోక్ పటేల్, మైనుద్దీన్, సంగీత, రాయలమ్మ, రాణమ్మ తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవనాథపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కార్యవర్గానికి ఘనంగా సన్మానం

- జిల్లా అధ్యక్షుడు పుట్టి మురళి, ఉపాధ్యక్షుడు చరణ్ గౌడ్‌కు అభినందనలు
- సంయుక్త కార్యదర్శిగా వినోద్, ఈసీ మెంబర్‌గా ముఖేష్ ఏకగ్రీవ ఎన్నిక





ఆర్మూర్ టౌన్, నవంబర్ 27 (మన సమగ్ర ప్రజావాణి): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గానికి నవనాథపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పుట్టి మురళి, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన చరణ్ గౌడ్, జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వినోద్, ఈసీ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ముఖేష్‌లను శుక్రవారం ఆర్మూర్ ప్రెస్ క్లబ్ భవనంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుంకరి గంగా మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఆర్మూర్ ప్రాంత జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన నాయకులకు అభినందనలు తెలిపారు.జిల్లా అధ్యక్షుడు పుట్టి మురళి, ఉపాధ్యక్షుడు చరణ్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ, మండల స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అందుబాటులో ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించడంతో పాటు అనారోగ్యానికి గురైన వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన జిల్లా జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవనాథపురం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు సాత్ పుతే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మ్యాకల దినేష్, ఉపాధ్యక్షులు షికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి, సలహాదారులు నరేందర్, బారడ్ గణేష్, కార్యవర్గ సభ్యులు మహిపాల్‌తో పాటు జర్నలిస్టులు ఖోడే మనోహర్, గోలి పురుషోత్తం, విన్సెంట్, గటడి అశోక్, శ్రావణ్, గణేష్ గౌడ్, సామ సురేష్, లిక్కి శ్రావణ్, వెంకటేష్ గుప్తా, మహేష్, గటడి అరుణ్, పోహర్ కిరణ్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాపుల కనపర్తి నూతన డైరెక్టర్ గోలి రవీందర్‌కు ఘన సన్మానం



నవంబర్ 27.ప్రజావాణి న్యూస్ /సంగెం సంగెం మండలం కాపులకనపర్తి నూతనంగా ఎన్నుకోబడిన డైరెక్టర్ గోలి రవీందర్ ని గ్రామంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సదయ,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కందకట్ల నరహరి, మార్కెట్ డైరెక్టర్ అచ్చ నాగరాజు,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కోడూరి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల రామకృష్ణ, వార్డ్ మెంబర్లు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు .అందరూ కలిసి గోలి రవీందర్ కి శాలువాతో సత్కారం చేసి, పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గోలి రవీందర్ రైతుల సమస్యల పరిష్కారానికి,గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారని ఆకాంక్షించారు.గ్రామ ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఈ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి పేదల పెన్నిధి బండారి

- బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్



మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి నవంబర్ 27)చిల్కానగర్ డివిజన్ జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పిస్తా హౌస్ చౌరస్తా లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో శుక్రవారం కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పిస్తా హౌస్ చౌరస్తా కు చేరుకుని మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ ని కట్ చేశారు. అనంతరం కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ పేదల పెన్నిధి,, బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి ప్రజల సంక్షేమ కోసంశ్రమించే నిత్య శ్రామికుడు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆయన పుట్టినరోజు ని పురస్కరించుకొని పిస్తా హౌస్ చౌరస్తాలో ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ నాయకులతో కలిసి భారీ కేక కట్ చేయించి, అనంతరం బాణాసంచా కాల్చి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కి గజ మాలవేసి డప్పుల కోలాహలంతో బ్యాండ్ భజంత్రీలు భజయిస్తూ లాంగ్ లీవ్ లాంగ్ లీవ్ లక్ష్మారెడ్డి లాంగ్లివ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసి లక్ష్మారెడ్డి తో భారీ కేకును కట్ చేయించడం జరిగింది.అనంతరం శాసనసభ్యులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ బర్త్డే సంబరాలు బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి భారీ ఏర్పాట్లు చేశారని వారందరికీ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వారందరికీ మరొక్కసారి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు కాలనీ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టి బాలికల భవిష్యత్తుకు బాటలు వేయాలి

- బాల్య వివాహాల నివారణకు సమష్టి కృషి అవసరం
- సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి
- మోస్రాలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థినుల భారీ అవగాహన ర్యాలీ.



మోస్రా/ప్రజావాణి:–బాల్య వివాహాలను అరికట్టి,బాలికల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని మోస్రా గ్రామసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా మహిళా, శిశు,దివ్యాంగుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు బాన్సువాడ నియోజక వర్గం మోస్రా మండల కేంద్రంలో సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన,ఎంఈఓ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రతినిధుల పర్యవేక్షణ లో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థినులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.తొలుత పాఠశాల ఆవరణ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రజా ప్రతినిధులు,పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్లకార్డులు,బ్యానర్లు చేతబూని ర్యాలీగా వెళ్లారు.బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గ్రామస్థులకు అవగాహన కల్పించారు.అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.చిన్న వయసులో వివాహం చేయడం వల్ల బాలికలు ఎదుర్కొనే ఆరోగ్య,మానసిక సమస్యలను వివరించారు.చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన వయసులో పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని.బాలికలు తమ హక్కుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేష్ గౌడ్,వార్డు సభ్యులు ఇంతియాజ్,ఎన్జీవో ప్రతినిధులు గంగాధర్,పోతరెడ్డి,సుమలత,మండల అంగన్వాడీ టీచర్లు,జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net

జర్నలిస్టుల ఐక్యతకు వేదికగా టీయూడబ్ల్యూజే మహాసభలు

● డిసెంబర్ 1న నిర్మల్‌లో తృతీయ జిల్లా మహాసభలు..
విజయవంతం చేయాలని జర్నలిస్టులకు పిలుపు



నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, భైంసా, నవంబర్ 27:--జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) నిర్మల్ జిల్లా తృతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రమోద్ రెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబర్ 1న నిర్మల్ పట్టణంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్న జిల్లా మహాసభల ప్రచారంలో భాగంగా శుక్రవారం భైంసా పట్టణంలోని స్థానిక విశ్రాంతి భవనంలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యతను చాటడంతో పాటు వారి సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై చర్చించేందుకు మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని జర్నలిస్టులంతా సంఘటితంగా ముందుకు వచ్చి మహాసభల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టుల వృత్తిపరమైన భద్రత, సంక్షేమ పథకాల అమలు, అక్రిడిటేషన్, ఇతర సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాడుతోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడు కలిముద్దీన్ ఖలీద్, బషీర్, షకీల్ అహ్మద్, ఆర్. విజయ్, సతీష్, రామకృష్ణ, సురేష్, అఫ్రోజ్ ఖాన్, ఆహద్ సాహిల్, షేక్ అహ్మద్, కొజ్జాల మహేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, షేక్ ఇస్మాయిల్, రూపేష్, సయ్యద్ సాజిత్, రవి, వెంకట్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

● జిల్లావ్యాప్తంగా 1,737 మంది విద్యార్థులు హాజరు.. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష



నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో నవంబర్ 27:--జవహర్ నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో నవంబర్ 28న (శనివారం) నిర్వహించనున్న 2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,737 మంది విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు.పరీక్ష ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిర్మల్ పట్టణంలో విజయ హైస్కూల్ (మంజులాపూర్), వాసవి హైస్కూల్ (దివ్యనగర్), చాణక్య హైస్కూల్ (కమల్‌నగర్) కేంద్రాలను ఏర్పాటు చేశారు. భైంసాలో ఆల్‌ఫోర్స్ హైస్కూల్, వేదం హైస్కూల్, వాసవి హైస్కూల్‌లలో పరీక్ష నిర్వహించనున్నారు. ఖానాపూర్ ప్రాంత విద్యార్థుల కోసం నిర్మల్‌లోని సెయింట్ థామస్ హైస్కూల్ కొండాపూర్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాల వారీగా విద్యార్థుల వివరాలు

విజయ హైస్కూల్‌లో 223 మంది, వాసవి హైస్కూల్‌లో 192 మంది, చాణక్య హైస్కూల్‌లో 192 మంది, భైంసా ఆల్‌ఫోర్స్ హైస్కూల్‌లో 264 మంది, వేదం హైస్కూల్‌లో 264 మంది, భైంసా వాసవి హైస్కూల్‌లో 243 మంది, సెయింట్ థామస్ హైస్కూల్ ఏ కేంద్రంలో 192 మంది, బి కేంద్రంలో 167 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డు, హాల్‌టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్నులను వెంట తీసుకురావాలని డీఈఓ సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు నవోదయ విద్యాలయానికి చెందిన ఉపాధ్యాయులను సెంటర్ లెవల్ అబ్జర్వర్లుగా నియమించినట్లు తెలిపారు.

పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి కేంద్రంలో పోలీసు బందోబస్తు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల తహసీల్దార్లు ఫ్లయింగ్ స్క్వాడ్లుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుని ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని డీఈఓ దర్శనం భోజన్న సూచించారు.



సంగెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన డిఈఓ





నవంబర్ 27.ప్రజావాణి న్యూస్/ సంగెం వరంగల్ డీఈవో ఎన్ ప్రశాంత్ రెడ్డి జెడ్పిహెచ్ఎస్ సంగెం పాఠశాలను సందర్శించడం జరిగింది సంగేశీ పాఠశాలలో జరుగుతున్న జీవశాస్త్ర కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులు సూచనలు చేయడం జరిగింది మారుతున్న బోధనల పద్ధతులు అనుగుణంగా విద్యా బోధన చేసి నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించడం జరిగింది తదుపరి పదవ తరగతి తరగతి గదికి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేస్తూ పదవ తరగతిలో అధిక మార్కులు సాధించడానికి విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించడం జరిగింది పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహణ విద్యార్థుల దత్తత తీసుకొని ప్రతిరోజు ఉదయం విద్యార్థులకు ఫోన్ ద్వారా నిద్రలేపి చదివించాలని తెలియజేయడం జరిగింది మరియు మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని పరిసరాలు మరియు వంట నిర్వాహణ పరిశుభ్రత పాటించాలని సూచించడం జరిగింది మరియు ప్రాథమిక పాఠశాల సంఘం కస్తూర్బా గాంధీ పాఠశాలను కూడా సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సముద్రాల నరసింహాచార్యులు ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు

మల్యాల మండలములో అన్ని గ్రామంలో నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై హర్షం



మల్యాల: మండలం నవంబర్ 27 (ప్రజావాణి): మల్యాల మండలములో అన్ని గ్రామంలో నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై హర్షం -- సీఎం,రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం మల్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, యూవజన కాంగ్రెస్ అధ్యక్షులు శనిగరపు తిరుపతి ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం గారి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా పెన్షన్లు మంజూరు చేసి వారి ఖాతాల్లో నగదు జమ చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ అందడం వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితమైన ప్రభుత్వం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలో అమలు చేస్తూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో నిరంతరం కృషి చేస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మండలములో అన్ని గ్రామాల సర్పంచ్ నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులుతో కలిసి సీఎం ఎమ్మెల్యే గారి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో సర్పంచల ఫోరమ్ అధ్యక్షులు మిట్టీ శ్రీనివాస్,కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నక్క అనిల్,గుడిపేట సర్పపూర్,రాంపూర్,తాటిపల్లి,లంబాడిపల్లి మ్యాదంపల్లి, మనాల, పోతారం, రాజరాం,బల్వంతాపూర్, ఓగులాపూర్, గ్రామాల సర్పంచ్ లు ఇట్టిరెడ్డి శ్వేతా రెడ్డి, జంగలి హనుమంతు, బద్దం సంధ్య తిరుపతిరెడ్డి, మెట్టల్లి లత, మరాఠీ సంధ్యా సత్తయ్య, గాతం అంజయ్య, బల్మూరి పాపారావు, కొండపలకల గోదాదేవి, గుర్రం విజయ్, కరుణ, గాదం కుమార్ ఉపసర్పంచ్, కాటుకం వినయ్, పొన్నం మల్లేశం, కంచర్ల లక్ష్మణ చారి పరశురాం,





మహిళ నాయకులు లహరి, మంద తిరుపతి,దూస వెంకన్న, మురళి, ఇట్టే రమణ నాయకులు చేయూత పెన్షన్ లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్సాయిపల్లి గ్రామంలో భూముల రీ-సర్వే ప్రారంభం

● రైతులు, భూ యజమానులు అధికారులకు సహకరించాలి
● గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణ.



మద్దూరు నవంబర్27, ప్రజా వాణి,మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో భూముల రీ-సర్వే ప్రక్రియ శుక్రవారం అధికారికంగా ప్రారంభమైంది....గ్రామ సర్పంచ్ మరియు మద్దూరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శనిగరం సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సర్వేయర్ రమేష్, జీపీఓ రవి మరియు ఇతర గ్రామ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆధునిక సర్వే పరికరాలతో గ్రామ శివారు నుండి భూముల కొలతలను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శనిగరం సత్యనారాయణ మాట్లాడుతూ... వారం రోజుల క్రితం గ్రామసభలో తెలిపిన విధంగానే నేటి నుండి గ్రామంలో భూముల రీ-సర్వే నిరంతరాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ రీ-సర్వేకు గ్రామంలోని రైతులు, భూ యజమానులు తమ పత్రాలతో సిద్ధంగా ఉండి, రెవెన్యూ మరియు సర్వే అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీల భర్తీపై సమీక్ష సమావేశం

● పెండింగ్ ఖాళీలను గుర్తించి ప్రత్యేక నియామకాల ద్వారా భర్తీ చేయాలి..
అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు



మేడ్చల్: మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో దివ్యాంగులకు కేటాయించిన బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీల గుర్తింపు, భర్తీ ప్రక్రియపై జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు కేటాయించిన ఉద్యోగ ఖాళీల వివరాలను సమీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, యూనిట్ అధికారులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ ప్రకారం కేటాయించిన పోస్టులను భర్తీ చేయకుండా మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ ఖాళీలను గుర్తించి, ప్రత్యేక నియామక ప్రక్రియ ద్వారా భర్తీ చేసేందుకు అన్ని శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేయకుండా, పెండింగ్ ఖాళీల భర్తీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం G.O.Rt.No.19, తేదీ 18.08.2026 ద్వారా దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ గడువును 31.03.2028 వరకు పొడిగించిన నేపథ్యంలో, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు అక్టోబర్ 2016 నుంచి ఇప్పటివరకు భర్తీ చేయకుండా మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీల వివరాలను సమగ్రంగా సమర్పించాలని ఆదేశించారు. ఖాళీల గుర్తింపు, వాటి భర్తీకి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రోస్టర్ పాయింట్లు 6 (దృష్టి వైకల్యం), 31 (వినికిడి వైకల్యం), 56 (ఆర్థోపెడిక్/లోకోమోటర్ వైకల్యం), 82 (ఆటిజం, మేధో వైకల్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యం, మానసిక అనారోగ్యం, బహుళ వైకల్యాలు) ప్రకారం ఖాళీలను పరిశీలించి, ఆయా కేటగిరీల వారీగా వివరాలను అందించాలని అధికారులకు సూచించారు.దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సక్రమంగా అమలయ్యేలా, గుర్తించిన బ్యాక్‌లాగ్ ఖాళీలను ప్రత్యేక నియామకాల ద్వారా భర్తీ చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో ఆదేశించారు జిల్లా సంక్షేమ అధికారి,మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా.



కల్లూర్ పాఠశాలకు దాతల చేయూత.

● గ్రీన్ బోర్డులు,ఫ్లోర్ మ్యాట్ వితరణ. ● పూర్వ ప్రాథమిక తరగతి గది ప్రారంభం.



కోటగిరి/ప్రజావాణి:-నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలం కల్లూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు తమ ఉదారతను చాటుకున్నారు.శుక్రవారం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక పాఠశాల తరగతి గదిని గ్రామ ప్రముఖులు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా చందూర్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన రామావత్ కృష్ణ కుమార్ తన కుమార్తె ఖుషి విద్మయి మొదటి పుట్టిన రోజును పురస్కరించుకుని పాఠశాలకు రూ.10 వేల విలువైన గ్రీన్ బోర్డులను వితరణగా అందజేశారు.అలాగే గ్రామ పెద్ద ముప్ప నాగేశ్వర్ రావు పూర్వ ప్రాథమిక తరగతి గదిలో చిన్నారుల సౌకర్యార్థం ఫ్లోర్ మ్యాట్ కోసం రూ.3 వేల నగదును అందించారు.పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను గ్రామ సర్పంచ్,ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెన్నూర్ రామ్ రెడ్డి,ఉప సర్పంచ్ దశరథ్,అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు వడ్ల అనసూయ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగయ్య శ్యామ్,గ్రామ పెద్దలు రాంపురం సంజీవ రెడ్డి,ముప్ప నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

తీగలపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై హత్యాయత్నం..

■ నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
■ కాంగ్రెస్ నాయకులపై చర్యలుతీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి
■ ఏడు మండలాల బీఆర్ఎస్ మాజీ, తా జా ప్రజాప్రతినిధులు ,నాయకుల హాజరు



ప్రజావాణి నవంబర్ 27తీగలపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై హత్యాయత్నం జరిగిందని, ఈ ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. తీగలపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో వాకింగ్‌కు వెళ్లగా, బావాయిపల్లి గ్రామ సమీపంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు మారణాయుధాలతో ఆయనపై దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన బీరం హర్షవర్ధన్ రెడ్డి, దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలుతీసుకోవాలని కోరారు. ఈ మేరకు బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ, తాజా ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీకార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దాడికిసంబంధించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలుతీసుకోవాలని పోలీసుఅధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, తాజాప్రజాప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్‌ల ద్వారా విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన

● ఆరు పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులకు ట్రాఫిక్ శిక్షణ





మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి నవంబర్ 27)మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, ఐపీఎస్ నూతన చొరవతో, ట్రాఫిక్ జోన్–1 డీసీపీ రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో ట్రాఫిక్ భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం జరిగింది.

విద్యార్థుల ద్వారా వారి కుటుంబాలకు, తద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరికీ ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో కమిషనరేట్ పరిధిలోని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్నిశుక్రవారం ప్రారంభించామని తెలిపారు.

గత వారం రోజులుగా వివిధ పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో భాగంగా ఆరు పాఠశాలలకు చెందిన సుమారు 90 మంది ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్ విద్యార్థులకు బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ శిక్షణలో భాగంగా ట్రాఫిక్ పోలీసుల విధులు, ట్రాఫిక్ నియంత్రణ మరియు అమలులో ఉపయోగించే పరికరాల గురించి విద్యార్థులకు వివరించాం. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించడంతో పాటు, గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, ఫోటోలు, వీడియోలను ప్రదర్శించి ప్రమాదాల తీవ్రతను వివరించాం.

విద్యార్థులు తమ పాఠశాలలకు తిరిగి వెళ్లిన తర్వాత అక్కడి మిగతా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తారు. ప్రతి నెలా ఒకసారి ట్రాఫిక్ అధికారుల ద్వారా ఈ కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తాం.

విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు, రోడ్డు దాటేటప్పుడు, స్కూల్ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు, అలాగే కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు మరియు ఇతర వాహనాల్లో ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి పూర్తి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, బంధువులకు కూడా ఈ విషయాలను తెలియజేయడం ద్వారా సమాజంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, నివారించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆశిస్తున్నాం.

ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని,ట్రాఫిక్‌నిబంధనలపై అవగాహన పెంపొందించుకున్నారు. అనంతరం నిర్వహించిన క్విజ్‌లో అడిగిన ప్రశ్నలకు విద్యార్థులందరూ సరైన సమాధానాలు ఇవ్వడం విశేషం.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠశాలల యాజమాన్యాలకు, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బందికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లి, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మరియు నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరుతున్నాం.

ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహ, గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్ మరియు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.15 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మున్సిపల్ అధికారులు





మన సమగ్ర ప్రజావాణి సంగారెడ్డి :నవంబర్. 27రూ.4.50 లక్షల కాంట్రాక్టు బిల్లు మంజూరుకు లంచం డిమాండ్ సదాశివపేట మున్సిపాలిటీలో ఏసీబీ అధికారుల మెరుపు దాడి సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీలో అవినీత నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. రూ.15 వేల లంచం తీసుకుంటూ ఇద్దరు మున్సిపల్ అధికారులు ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు ఏసీబీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. సదాశివపేట మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఏ. రాజేష్ కుమార్, అవుట్‌సోర్సింగ్ విధానంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఏ. శివారెడ్డి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు సదాశివపేట పట్టణంలోని ఊబ చెరువులో 2026 గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన పూడికతీత పనులకు గాను రూ.4.50 లక్షల కాంట్రాక్టు బిల్లును ఇప్పటికే మంజూరు చేసి ప్రాసెస్ చేసినందుకు ప్రతిఫలంగా ఫిర్యాదుదారుడిని రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది ఈ క్రమంలో నవంబర్ 27న మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో ఏసీబీ అధికారులు వలపన్ని లంచం తీసుకుంటున్న అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్ కుమార్‌ను పట్టుకున్నారు. ఆయన లంచం మొత్తాన్ని వర్క్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డికి భద్రపరచడానికి అప్పగించగా, ఆ నగదును శివారెడ్డి వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు ఇద్దరు అధికారులు తమ విధులను నిజాయితీగా నిర్వహించకుండా అక్రమంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ పేర్కొంది. నిందితులను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉంది ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు సదాశివపేట మున్సిపాలిటీలో ఏసీబీ చర్యలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి

ఆపదలో ఆపద్బాంధవుడు పోచారం శ్రీనివాసరెడ్డి.

■ నిరుపేద బాలికకు రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు.

■ ఎమ్మెల్యే చొరవతో నిమ్స్‌లో ఉచిత న్యూరో సర్జరీ.

■ ఎమ్మెల్యే పోచారం,మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి బాలిక తల్లిదండ్రుల కృతజ్ఞతలు.









రుద్రూర్(బాన్సువాడ)/ప్రజావాణి:- ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు,బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోట అరుణ్ కుమార్ అండగా నిలిచి తమ ఉదారతను చాటుకున్నారు.సకాలంలో స్పందించి 13 ఏళ్ల బాలికకు అత్యవసర న్యూరో సర్జరీ చేయించి ప్రాణాలు కాపాడారు.వివరాలలోకి వెళితే.రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు ఎర్రోళ్ల సాయిలు, కల్పనల కుమార్తె సాత్విక (13) గత కొన్ని రోజులుగా తీవ్రమైన తల సంబంధిత సమస్యతో బాధపడుతోంది. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి లో పరీక్షలు నిర్వహించగా తక్షణమే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు.ఆపరేషన్‌కు లక్షల రూపాయలు ఖర్చవుతుండటంతో ఆ నిరుపేద తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.విషయం తెలుసుకున్న రాణంపల్లి గ్రామానికి చెందిన రుద్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట అరుణ్ కుమార్ వెంటనే స్పందించి.బాధిత కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాలికను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు.అంతేకాకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీని తక్షణమే మంజూరు చేయించారు.నిమ్స్ వైద్యులు సాత్విక కు విజయవంతంగా న్యూరో సర్జరీ నిర్వహించడంతో ప్రస్తు తం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.తమ కూతురు ప్రాణాలు నిలబెట్టడానికి సకాలం లో స్పందించి ఆదుకున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట అరుణ్ కుమార్‌కు సాత్విక తల్లిదండ్రులు సాయిలు,కల్పన కన్నీటి పర్యంత మవుతూ కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలి

● గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణ



మద్దూరు నవంబర్27, ప్రజా వాణి, నర్సాయపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో మద్దూరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు,సర్పంచ్ శనిగరం. సత్యనారాయణ ఆధ్వర్యంలో.... ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రారంభించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో మద్దూరు మండల ఎంపీడీఓ సి హెచ్ శ్రీనివాస్ పాల్గొని 18–59 వయస్సు గల వారందరూ భీమా చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు.ఈకార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు ముస్తాల.గీత మరియు తుమ్మల.శ్రీను మరియు పంచాయతీ కార్యదర్శి భాస్కర్,గ్రామ పరిపాలన అధికారి రవి మరియు గ్రామ ప్రజలు,సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సేవలో జవాబు దారీతనం..మెరుగైన సేవలే లక్ష్యం

● జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ వార్షిక తనిఖీ.





యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 27

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపిఎస్ శుక్రవారం రోజు బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ముందుగా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సూర్య నాయక్ స్టేషన్ సిబ్బందిని ఎస్పీకి పరిచయం చేశారు. అనంతరం ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి , వివిధ కేసుల్లో స్వాధీనం చేసు కున్న వాహనాలను తనిఖీ చేశారు. పెట్రో కారును పరిశీలించి , అందులో అందుబాటులో ఉన్న పోలీస్ విధులకు సంబంధించిన పరికరాలు, వస్తువులను తనిఖీ చేస్తూ వాటి వినియోగం , నిర్వ హణ పై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం లాకప్ గదులు , స్టేషన్ రైటర్ గదిని పరిశీలించి , వృద్ధులు , దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పిటిషన్ కౌంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ గదిలో వివిధ రికార్డులను పరిశీలించి జనరల్ డైరీ , క్రైమ్ రికార్డులు , సైబర్ క్రైమ్ కేసులు , బాధి తులకు నగదు రీఫండ్‌కు సంబంధించిన వివరాలు, ప్రమాద కేసులు , ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యా దులు , ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు , పెండింగ్ ట్రయల్ కేసులు , కోర్టు డిస్పోజల్స్ , నాన్ బెయిలబుల్ వారెంట్లు , సమన్ల జారీ , అమలుకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. విలేజ్ పోలీస్ అధికారులను ఒక్కొకరిగా పిలిచి గ్రామాల సందర్శన మరియు ప్రజలతో వారి సంభాషణ వంటి విష యాల పై విచారించారు. అలాగే డయల్ 112 కాల్స్‌కు స్పందిస్తున్న సమయం , డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు , వాటిపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందికి పలు సూచ నలు చేస్తూ , డయల్ 112కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి రిస్పాన్స్ టైమ్‌ను మరింత తగ్గించాలని , ప్రజలకు పోలీస్ సేవలు వేగంగా అందేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు , మహిళల భద్రత , పోక్సో చట్టం , ఆన్‌లైన్ గేమింగ్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేది కలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సైబర్ నేరాల పట్ల అప్ర మత్తత , మహిళలు , పిల్లల భద్రత , ఆన్‌లైన్ మోసాల నివారణ పై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వ హించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ , వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని , విధి నిర్వ హణలో క్రమశిక్షణ , జవాబుదారీతనం , పారదర్శకత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ వార్షిక తనిఖీలో భువనగిరి డిఎస్పీ బి.రవీందర్ , ఎస్‌హెచ్‌ఓ సూర్య నాయక్ , ఎస్‌ఐలు తేజం రెడ్డి , కృష్ణయ్య , పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ ఆరుతడి పంటల సాగుపై రైతులకు సూచనలు





ప్రజావాణి శాయంపేట మండల వ్యవసాయ అధికారి మార్కా ప్రియదర్శిని మండలంలోని ప్రగతి సింగారం మరియు నేరెడుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ధాన్యం కుప్పల తేమశాతాన్ని తేమ కొలిచే యంత్రం సహాయంతో పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల ప్రకారం తేమశాతంతో పాటు, తాలు, తప్పలు మరియు ఇతర నాణ్యతా లోపాలు లేని ధాన్యాన్ని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యానికి రైతులకు టోకెన్లు జారీ చేయాలని సంబంధిత ఏఈఓలకు సూచించారు.అనంతరం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులతో మాట్లాడి, గత ఖరీఫ్ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో భూగర్భ జలాల లభ్యత తగ్గుతున్నందున, రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే పంటలను ఎంచుకుని నీటి వనరులను సంరక్షించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతులు సుధాకర్ రెడ్డి, రాజేందర్, మల్లికార్జున్ తదితర రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఫిర్యాదుతో వీడీసీ అధ్యక్షుడిపై కేసు నమోదు

● జిల్లా ఎస్పీ ప్రజావాణిలో ఫిర్యాదు.. ఎస్పీ ఆదేశాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కుంటాల పోలీసులు





నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, భైంసా, నవంబర్ 27:--గ్రామ పంచాయతీ విధుల నిర్వహణలో జోక్యం చేసుకుంటూ, తనను దుర్భాషలాడి విధులకు ఆటంకం కలిగించారంటూ కల్లూరు గ్రామ సర్పంచ్ పెంటవార్ దశరథ్ చేసిన ఫిర్యాదుతో కుంటాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో కల్లూరు గ్రామానికి చెందిన వీడీసీ అధ్యక్షుడు ఎంగందుల భారత్ భూషణ్‌పై భారతీయ న్యాయ సంహిత (దీచీం) సెక్షన్లు 221, 296(ఎ) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసు రికార్డుల్లో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. నవంబర్ 24న కల్లూరు గ్రామంలో జాతీయ రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు నీటి ట్యాంకర్ అవసరం కావడంతో గ్రామ శ్మశానవాటికలోని బోర్‌వెల్ నుంచి నీటిని తీసుకెళ్లాలని సర్పంచ్ సూచించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పంచాయతీ కార్మికుడు పాసుల సంజీవ్ నీటిని ట్యాంకర్‌లో నింపుతుండగా అక్కడికి వచ్చిన వీడీసీ అధ్యక్షుడు భారత్ భూషణ్ అభ్యంతరం వ్యక్తం చేసి నీటిని నింపకుండా అడ్డుకున్నట్లు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ దశరథ్ అక్కడికి చేరుకుని ప్రశ్నించగా, తనను అసభ్య పదజాలంతో దూషించారని, పంచాయతీ కార్మికుడిని కూడా దుర్భాషలాడారని ఫిర్యాదులో వివరించారు. సదరు బోర్‌వెల్ మోటారు గ్రామ పంచాయతీకి సంబంధించినదని, విద్యుత్ బిల్లులు సైతం పంచాయతీ నుంచే చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలోనూ తన విధుల నిర్వహణకు ఆటంకాలు కలిగించినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో నవంబర్ 25న భైంసాలో జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్పంచ్ దశరథ్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై ఎస్పీ ఆదేశాల మేరకు కుంటాల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 121/2026గా కేసు నమోదు చేశారు. ఎస్సై గుగ్లోత్ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రామ పంచాయతీ ఆస్తుల వినియోగం, ప్రజాప్రతినిధుల విధుల నిర్వహణకు సంబంధించిన ఈ వ్యవహారంపై పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణపై అవగాహన పెరగాలి

● దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో మెగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కార్యక్రమం

● ముఖ్య అతిథిగా జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ



మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి నవంబర్ 27)

హైదరాబాద్ దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో శుక్రవారం బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో మెగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలిండియా రిటైర్డ్ రైల్వే ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ పి. యుగంధర్, రైల్ నిలయం బ్రాంచ్ మాజీ వైస్ చైర్మన్, మజ్దూర్ యూనియన్ నాయకులు నూర్ జనరల్ మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఫెడరేషన్ తరపున బాబూరావు, ఉదయ్ రాయ్, భాగ్యవతి తదితరులు హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మతో పాటు ఇతర అధికారులను సన్మానించి, పలు సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే విశ్రాంత ఉద్యోగులు, ఫెడరేషన్ ప్రతినిధులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు. డిజిటల్ విధానంలో లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణపై అవగాహన కల్పించడం, పెన్షనర్లకు అవసరమైన సేవలను సులభతరం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు.

యడవల్లి గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి

- కార్యక్రమంలో సంఘ సేవకులు పాస్టర్ ఊటుకూరి జాన్ సుధాకర్ రావు పాస్టర్ అమ్మగారు ఊటుకూరి సామ్రాజ్యం యడవల్లి సంఘ పెద్ద గుంజులూరి మోషే





మన ప్రజావాణి మధిర ఆర్ సి నవంబర్ 27ముదిగొండ మండల యడవల్లి గ్రామంలో సెవెంత్ డే అడ్వెంటిస్ట్ చర్చి వారి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనముగా జరిగాయి దైవ సేవకులు పాస్టర్ జాన్ సుధాకర్ రావు వాక్యము బోధించారు క్రీస్తు బోధలు శాంతి సమాధానము మార్పు గురించి ఆయన బోధించారు లోకమంతుడికి ఆయన వెలుగై యున్నాడని బోధించారు సంఘ పెద్దలు గుంజులూరి మోషే వేస్తేరు జయమ్మ జానకమ్మ మరియమ్మ రాణి ఎల్లమ్మ సునీత లక్ష్మి పాల్గొన్నారు

జల్లాపల్లి ఆబాదిలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

- ఘనంగా భూమి పూజ నిర్వహించిన సర్పంచ్ బర్మావత్ వివేక్.
- ప్రభుత్వానికి,సర్పంచ్,కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు.



కోటగిరి/ప్రజావాణి:-నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాదిలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఘనంగా శ్రీకారం చుట్టారు.గ్రామ సర్పంచ్ బర్మావత్ వివేక్,ఉప సర్పంచ్ ఖాజా గౌసుద్దిన్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో రెండో విడత ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బర్మ వత్ వివేక్ మాట్లాడుతూ.పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్రామంలో మొదటి విడత కింద 15 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా అవి వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయని.వాటిలో ఇప్పటికే పలు ఇళ్లు పూర్తయి గృహ ప్రవేశాలు కూడా జరిగాయన్నారు.ప్రస్తుతం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గ్రామానికి మరో 5 ఇళ్లు మంజూరయ్యాయని.అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండగా ఉంటుందని.మంజూరైన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం త్వరితగతిన నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు.తమ సొంతింటి కలను సాకారం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డికి అలాగే సహకరిస్తు న్న సర్పంచ్ కు ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఖాజా గౌసుద్దిన్,జి.పి.కార్యదర్శి వినోద్ కుమార్,సొసైటీ డైరెక్టర్ యశ్వం త్,వార్డు మెంబర్స్ శేషారావు,గణేష్, జల్లాపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడావత్ ధనరాజ్,ఉపాధ్యక్షులు మతీన్, సోషల్ మీడియా కన్వీనర్ మహమ్మద్ ఖాన్ పఠాన్,లబ్ధిదారులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వేడి నీరు, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

- 150 మందికి సరిపడే వసతి.. ప్రస్తుతం 550 మంది విద్యార్థులు
- జూనియర్ కళాశాల భవనాన్ని గురుకులానికి అనుసంధానం చేయాలని తల్లిదండ్రుల కమిటీ వినతి



ముస్తాబాద్, ప్రజావాణి ముస్తాబాద్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం కల్పించడంతో పాటు, పాఠశాల ప్రాంగణం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, అదనపు వసతి మరియు తరగతి గదుల సదుపాయాలు కల్పించాలని గురుకుల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ జిల్లా కలెక్టర్‌కు వినతి సమర్పించింది. ప్రస్తుతం చలికాలం నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని హాస్టల్‌లో గీజర్లు ఏర్పాటు చేసి వేడి నీటి సౌకర్యం కల్పించాలని కమిటీ కోరింది. అదేవిధంగా పాఠశాల పరిసరాల్లో కోతుల బెడద పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు ముప్పు కలగకుండా పాఠశాల ప్రాంగణం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం గురుకుల హాస్టల్ భవనం సుమారు 150 మంది విద్యార్థులకు సరిపడే విధంగా నిర్మించబడినప్పటికీ, పాఠశాలలో సుమారు 550 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని కమిటీ పేర్కొంది.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతి,తరగతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపింది.ఈ సమస్యకు పరిష్కారంగా పక్కనే ఉన్న జూనియర్ కళాశాల భవనంలోని తరగతి గదులను గురుకుల పాఠశాలకు అనుసంధానం చేయాలని కోరింది.ప్రభుత్వం ఇంటర్మీడియట్ బోర్డును పదవ తరగతి బోర్డుతో విలీనం చేయాలనే నిర్ణయం నేపథ్యంలో జూనియర్ కళాశాల భవనాన్ని గురుకుల పాఠశాలకు అనుసంధానం చేస్తే సమగ్ర మినీ క్యాంపస్‌గా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని కమిటీ అభిప్రాయపడింది. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా అభివృద్ధి దృష్ట్యా పై సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల కమిటీ జిల్లా కలెక్టర్‌ను కోరింది.

ప్రారంభానికి ముస్తాబైన రాయనిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామానికి రూ.40 లక్షల అభివృద్ధి నిధులు



గరిడేపల్లి, నవంబర్ 27 (ప్రజావాణి):గరిడేపల్లి మండలంలోని రాయనిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.40 లక్షల నిధులు మంజూరైనట్లు గ్రామ సర్పంచ్ గుండు రామాంజి గౌడ్ తెలిపారు.గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి రెండు భవనాలకు ఒక్కొక్కటికి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షలు మంజూరైనట్లు వివరించారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామానికి అభివృద్ధి నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన ఈ భవనాలు గ్రామ ప్రజలకు, మహిళా సంఘాల సభ్యులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.త్వరలోనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా నూతన భవనాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ గుండు రామాంజి గౌడ్ వెల్లడించారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

జన హృదయ నేత బందారి లక్ష్మారెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు

● ఎస్ ఏ రహీం

మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి నవంబర్ 27) ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జన్మదిన సందర్భంగా ఆ పార్టీ పార్టీ సినియర్ నాయకులు ఎస్ ఏ రహీం శుక్రవారం శుభాకాంక్షలు తెలియచేసారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
బండారి లక్ష్మారెడ్డి ఒక ఎమ్మెల్యే మాత్రమే కాదు, ప్రజల మనిషి అని,ప్రజల సమస్యే తన సమస్యగా భావించే గొప్ప వ్యక్తిత్వం ఉన్న నాయకుడని అభివృద్ధినే తన లక్ష్యంగా చేసుకున్న ప్రజాసేవకుడని అన్నారు.రాజకీయాల్లో పదవులు రావడం గొప్ప విషయం కాదు. ఆ పదవికి ప్రజల విశ్వాసాన్ని, గౌరవాన్ని తీసుకురావడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనం. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తన సమస్యలుగా భావించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకులు అరుదుగా కనిపిస్తారు. అలాంటి నాయకుల్లో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఒకరన్నారు ఆయనను కేవలం ఒక ఎమ్మెల్యేగా మాత్రమే చూడలేం. ప్రజల మధ్య ఉంటూ, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండే వ్యక్తిగా ఆయన తనదైన గుర్తింపును సంపాదించుకున్నారు.
రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవే లక్ష్యం!
ప్రజాసేవకు పార్టీలు, రాజకీయ భేదాలు అడ్డుకాకూడదనే ఆలోచన ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది. తన పార్టీకి చెందిన వారైనా, ఇతర పార్టీలకు చెందిన వారైనా, ఎవరైనా తమ సమస్యను పరిష్కరించుకోవాలనే ఆశతో ఆయన దగ్గరకు వస్తే వారికి సహాయం చేయడానికి ముందుంటారు.
ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చినప్పుడు కేవలం వినడమే కాకుండా, సంబంధిత అధికారులను వారి సమక్షంలోనే సంప్రదించి, సమస్య తీవ్రతను వివరించి, పరిష్కారానికి కృషి చేయడం ఆయన పనితీరులోని ప్రత్యేకతని అన్నారు.ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గించి, వారి సమస్యలకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపించాలనే తపన ఆయనలో కనిపిస్తుంది.
విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా... BLR ట్రస్ట్ ద్వారా సేవ!
ఒక కుటుంబం ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ పిల్లల కలలను వదులుకోవాల్సిన పరిస్థితి రాకూడదనే గొప్ప ఆలోచనతో BLR ట్రస్ట్ ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు.
ఎవరికైనా మెడికల్ ఎమర్జెన్సీ ఉంటే ఫీజు ఇప్పించడం, అధికారులతో మాట్లాడి అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఫండ్ తొందరగా ఇప్పించడం
ముఖ్యంగా వీడీడీఓ వంటి ఖరీదైన వైద్య విద్యను అభ్యసించాలనే ఆశ ఉన్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును కొనసాగించలేని విద్యార్థులకు తన సొంత నిధులతో సహాయం అందిస్తూ, వారి చదువు పూర్తయ్యే వరకు అండగా నిలవడం



ఎంతో అభినందనీయం.
ఒక విద్యార్థికి ఆర్థిక సహాయం అందించడం అంటే కేవలం ఒక వ్యక్తికి తోడ్పడటం మాత్రమే కాదు... ఒక కుటుంబానికి భరోసా కల్పించడం, భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యుడిని తయారు చేయడం కూడా!
ఆర్భాటాలకు, ఆడంబరాలకు దూరం... సామాన్యుడికి దగ్గర!
నేటి రాజకీయాల్లో నాయకులు ప్రజల్లోకి వెళ్లేటప్పుడు భారీ హంగులు, ఆర్భాటాలు, ప్రత్యేక వేషధారణలు, పెద్ద కాన్వాయ్‌లు కనిపిస్తుంటాయి. కానీ బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేకత అందుకు భిన్నంగా ఉంటుంది.
ప్రజల మధ్యకు వెళ్లేటప్పుడు ఒక సామాన్య వ్యక్తిలా వెళ్లడం, వారితో కలిసిపోవడం, వారి బాధలను వినడం, వారి కుటుంబ సభ్యుడిలా మమేకం కావడం ఆయన నిరాడంబరతకు నిదర్శనంగా నిలుస్తుంది.
అంతేకాకుండా, తన రక్షణ కోసం ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌ను కూడా వెనక్కి పంపించి, గన్‌మెన్ లేకుండా సాధారణ జీవితం గడపాలని నిర్ణయించుకోవడం ఆయన వ్యక్తిగత నిరాడంబరతను తెలియజేస్తుంది.
నాయకుడికి ప్రజలే నిజమైన బలం, ప్రజల ప్రేమే నిజమైన రక్షణ అనే భావనకు ఇది ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.
మూడేళ్లలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు!
ప్రజాసేవతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం ఆయన నాయకత్వంలోని మరో ముఖ్యమైన అంశం.
ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలి మూడు సంవత్సరాల కాలంలోనే ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు కలిపి సుమారు రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు పేర్కొనబడుతోంది.
ఇది కేవలం నిధుల ఖర్చు మాత్రమే కాదు... నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందాలనే సంకల్పానికి ప్రతిబింబం.
ప్రతి కాలనీ... ప్రతి బస్తీ అభివృద్ధి చెందాలనే సంకల్పం!
ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్, ప్రతి కాలనీ, ప్రతి బస్తీలో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు.
కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం.
ప్రజలకు మెరుగైన వెలుతురు అందించేందుకు స్ట్రీట్ లైట్ల ఏర్పాటు.
మురుగునీటి సమస్యలకు పరిష్కారంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి.
ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కుల అభివృద్ధి.
యువత ఆరోగ్యానికి, వ్యాయామానికి జిమ్‌ల ఏర్పాటు.
ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి.
ఈ కార్యక్రమాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఒక్కటే... అభివృద్ధి అనేది కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా, నియోజకవర్గంలోనిప్రతి సామాన్య కుటుంబానికి చేరాలనే సంకల్పం
చెరువుల సుందరీకరణ... పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత!
నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కాప్రా, ఉప్పల్, రామంతాపూర్ చెరువుల సుందరీకరణకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.చెరువులు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు... అవి పర్యావరణానికి, భూగర్భ జలాల పరిరక్షణకు, స్థానిక ప్రజల జీవన విధానానికి ఎంతో కీలకం. వాటిని సుందరీకరించడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను కాపాడే అవకాశం ఉంటుంది.
పదవి కోసం కాదు... ప్రజల కోసం పనిచేసే నాయకత్వం ఉన్న నాయకుడు
ఒక నాయకుడి గొప్పతనం ఆయన మాట్లాడే మాటల్లో కాదు... ఆయన చేసే పనుల్లో కనిపించాలి. ప్రజల సమస్యల పట్ల స్పందించే విధానం, విద్యార్థుల భవిష్యత్తు పట్ల చూపించే బాధ్యత, రాజకీయాలకు అతీతంగా అందించే సహాయం, ప్రజల మధ్య ఉండే నిరాడంబర జీవనశైలి, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసే కృషి... ఇవన్నీ ఒక ప్రజాప్రతినిధి నాయకత్వాన్ని అంచనా వేయడానికి ముఖ్యమైన ప్రమాణాలు.
ఈ అంశాలన్నింటినీ పరిశీలించినప్పుడు బండారి లక్ష్మారెడ్డి ని కేవలం ఒక ఎమ్మెల్యేగా కాకుండా, ప్రజలతో మమేకమై పనిచేసే ప్రజాసేవకుడిగా అభివర్ణించవచ్చు.
ప్రజల సమస్యలను వినే మనసు... పరిష్కరించాలనే పట్టుదల... పేద విద్యార్థులకు అండగా నిలిచే ఔదార్యం... నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పం... ఇవే ఆయన ప్రజాజీవితానికి ప్రత్యేక గుర్తింపు.
ప్రజల మధ్య ఉండే నాయకుడే ప్రజల మనసుల్లో నిలిచిపోతాడు. పదవులు మారవచ్చు... రాజకీయ పరిస్థితులు మారవచ్చు... కానీ ప్రజలకు చేసిన మంచి, అందించిన సహాయం, అభివృద్ధి రూపంలో కనిపించే సేవ చిరస్థాయిగా నిలిచిపోతాయి.
బండారి లక్ష్మారెడ్డి పదవిలో ఎమ్మెల్యే, ప్రజల మధ్య ఒక సామాన్యుడు, సేవలో ఒక ఆదర్శప్రాయమైన ప్రజాప్రతినిధి
ప్రజలతో మమేకం... ప్రజల కోసం నిరంతర ప్రయాణం... అదే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేకత అని అన్నారు.

దివ్యాంగుల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యమెందుకు?

- బ్యాక్‌లాగ్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి
- కమిటీ హాల్ స్థలంపై సమగ్ర విచారణ జరపాలి



ప్రజావాణి శాయంపేట: దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని తల్లి దివ్యాంగుల సేవా సమితి శాయంపేట మండల ప్రధాన కార్యదర్శి తడక సంతోష్ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగ దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.పెద్దకొడపాక గ్రామంలో దివ్యాంగుల సేవా సమితి కమిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన స్థల వివాదాన్ని పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్‌కు గ్రీవెన్స్ ద్వారా వినతిపత్రం అందించినట్లు తెలిపారు. సర్వే నంబరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, కమిటీ సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టాలని కోరారు. కమిటీ సభ్యులను సంప్రదించకుండా, క్షేత్రస్థాయి విచారణ చేయకుండానే ప్రభుత్వ భూమి కాదంటూ పట్వారీ నివేదిక ఇచ్చారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లకేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలి
ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం దివ్యాంగులకు 17 శాతం రిజర్వేషన్ అమలు చేసి, ప్రతి గ్రామం నుంచి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని తల్లి దివ్యాంగుల సేవా సమితి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీకాంత్ కోరారు. దివ్యాంగులకు పెన్షన్లు ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో, స్థానిక ఎమ్మెల్యే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు పట్టించుకోకపోతే మండలంలోని దివ్యాంగులందరితో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో పెద్దకొడపాక గ్రామ అధ్యక్షుడు చింతల రమేష్, మండల సమితి కార్యదర్శి చింతల శీను, గ్రామ ప్రధాన కార్యదర్శి ఉమారాణి, గోవిందాపురం గ్రామ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి, పెద్దకొడపాక గౌరవాధ్యక్షుడు శంకర్‌లింగం గోవిందాపురం వైస్ ప్రెసిడెంట్ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్యకు ఘన సన్మానం



రాయికల్, నవంబర్ 27 (ప్రజావాణి):లూసియానా యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న రాయికల్ మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్యను రాయికల్, మేడిపల్లి, భీమారం మండలాల ఉపాధ్యాయులు శుక్రవారం కల్వకోట స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ లో ఘనంగా సన్మానించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమానికి మూడు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాంప్లెక్స్ ప్రాంగణం ఉపాధ్యాయుల సందడితో, అభినందనలతో కళకళలాడింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, డాక్టర్ బొల్లె చిన్నయ్య విద్యారంగంలో చేసిన విశేష సేవలను గుర్తించి లూసియానా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సన్మానించడం ఎంతో అభినందనీయమన్నారు. ఒక గ్రామీణ ప్రాంత పాఠశాలలో పనిచేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయుడికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం మొత్తం ఉపాధ్యాయ లోకానికే గర్వకారణమని పేర్కొన్నారు.ఆయన సేవలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భౌతిక శాస్త్రం అంటే విద్యార్థుల్లో భయం ఉండే సబ్జెక్టు అనే అభిప్రాయాన్ని పోగొట్టి, ప్రయోగాల ద్వారా, సులభమైన బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడంలో చిన్నయ్య చూపిన అంకితభావం అందరికీ ఆదర్శమని తెలిపారు. విద్యార్థుల పట్ల ఆయన చూపే శ్రద్ధ, క్రమశిక్షణ, విలువలతో కూడిన బోధనే ఈ గౌరవానికి కారణమని అభిప్రాయపడ్డారు.అనంతరం చిన్నయ్యను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు రావాలని, ఆయన సేవలు ఇలాగే కొనసాగాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు గాజంగి రాజేశం, ముక్కెర శేఖర్, దాసరి కృష్ణహరి, రిసోర్స్ పర్సన్లు రాజమల్లయ్య, చిప్ప మల్లేశం,చిలువేరి విజయ్ కుమార్,లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఆకు రమేష్, మనోహర్, గిరిధర్, తోట శంకరయ్య, నరసింహారెడ్డి, సతీష్, చంద్రప్రకాష్, ఇంచార్జీ హెచ్ఎం రవీందర్, రమాదేవి, వేణుమాధవ్, శంకర్ సురేష్, అయిత పద్మ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏ ఐ ఎల్ యు సూర్యాపేట జిల్లా మహాసభలను జయప్రదం చేయండి...

- జిల్లా మహాసభల పోస్టర్ అవిష్కరణ.





కోదాడ నవంబర్ 27,ప్రజావాణి :- నవంబర్ 29 ఆదివారం ఉదయం10.30 గంటలకు కోదాడ పెన్షనర్స్ భవన్ లో జరిగే ఏ ఐ ఎల్ యు జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐ ఎల్ యు జిల్లా అధ్యక్షులు వేజల్ల రంగారావు అన్నారు.శుక్రవారం నాడు కోదాడ కోర్టులో ఏ ఐ ఎల్ యు జిల్లా మహాసభల పోస్టర్ ను న్యాయవాదులతో కలిసి ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వేజల్ల రంగారావు, ఉయ్యాల నర్సయ్య లు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై ఆలిండియా లాయర్స్ యూనియన్(ఏ ఐ ఎల్ యు) అనేక పోరాటాలు చేసిందని, న్యాయవాదులకు హెల్త్ కార్డులు, రక్షణ చట్టం, జూనియర్ న్యాయవాదులకు స్టయిఫండ్ కోసం,న్యాయవాదుల సంక్షేమం కోసం ఏ ఐ ఎల్ యు సంఘం పనిచేసిందన్నారు ,న్యాయవ్యవస్థ లో వస్తున్న మార్పులను, నూతన చట్టాలపై నిరంతరం న్యాయవాదులకు అవగాహన కల్పిస్తూ,వారి వృత్తి పరమైన సమస్యల పరిష్కారం లో మా సంఘం ముందుంది అన్నారు.గత రెండు సంవత్సరాలుగా జిల్లాలో న్యాయవాదుల సమస్యలపై నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకుని,భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవడానికి ఈ నెల 29న కోదాడ పెన్షనర్స్ భవన్ లో మహాసభలను నిర్వహిస్తున్నట్లుగా వారు తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కొల్లి సత్యనారాయణ, పార్థసారధి,ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి,బార్ కౌన్సిల్ మెంబెర్ మందడపు శ్రీనివాసరావు లు హాజరై ప్రసంగిస్తారని,మహాసభల ప్రతినిధులుగా జిల్లాలోని నాలుగు కోర్టుల నుండి 100మంది న్యాయవాదులు హాజరవుతారన్నారు. మహాసభల జయప్రదానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ జిల్లా మహాసభల ఆవిష్కరణ కార్యక్రమంలో ఏ ఐ ఎల్ యు జిల్లా నాయకులు ఉయ్యాల నర్సయ్య, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఈదుల కృష్ణయ్య,న్యాయవాదులు ఎస్ జెపాషా,దావీదు,శరత్ కుమార్, కాటి రేణు,బాలనర్సయ్య,నాగుల్ పాషా,మంద వెంకటేశ్వర్లు, బి రవీందర్,బొడ్డుపల్లి శ్రీనివాస్, బి ఎస్ వి ప్రసాద్, చిన్నబ్బాయ్, సంతోష్ నాయక్,ఆనందం సుదర్శన్,కొండ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవితకాల జైలు శిక్ష

● 11 వేల రూపాయలు జరిమానా



మద్దూరు నవంబర్27, ప్రజా వాణి,మద్దూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు కొయ్యడ శ్రావణ్ అనే వ్యక్తికి న్యాయస్థానం జీవిత జైలు శిక్షతో పాటు రూ.11,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయ ప్రసాద్ తీర్పు వెల్లడించారు.వివరాలోకి వెళ్తే మద్దూరు పోలీస్ స్టేషన్లో మార్చి 2020లో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై అందిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎ.సంపత్ పోక్సో కేసు నమోదు చేశారు.ఈ కేసులో దర్యాప్తు అధికారి అప్పటి హుస్నాబాద్ ఏసిపి ఎస్.మహేందర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేయడమైనది. విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మరాములు వాదనలు వినిపించగా, ప్రస్తుత హుస్నాబాద్ ఏసిపి సదానందం, చేర్యాల సిఐ రమేష్ ,మద్దూరు ఎస్ఐ ఆసిఫ్,సాక్షాలు నమోదు చేసిన ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓలు కిష్టయ్య & లింగారెడ్డి, భరోసా లీగల్ అధికారి సౌమ్య సమన్వయంతో కేసు విచారణలో సహకారం అందించారు.

సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన ఒకటవ అదనపు సిద్దిపేట జిల్లా న్యాయస్తాన న్యాయమూర్తి వై. జయ ప్రసాద్ నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవిత జైలు శిక్షతో పాటు రూ.11,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సిద్దిపేట సిపి రష్మి పెరుమాళ్, ఐపిఎస్ గారు అభినందించారు.మైనర్ బాలికలపై నేరాలకు పాల్పడే వారిని చట్టం ఉపేక్షించదని, ఇలాంటి కేసుల్లో శాస్త్రీయ దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలతో నిందితులకు కఠిన శిక్షలు పడేలా సిద్దిపేట పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని సిపి తెలిపారు. అలాగే పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని,పిల్లలతో నిరంతరం సంభాషిస్తూ వారి కదలికలపై తగిన పర్యవేక్షణ ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

తీర్పు అనంతరం నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మరాములు,చేర్యాల సిఐ రమేష్, ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, మద్దూరు ఎస్ఐ ఆసిఫ్ శాలువాతో సన్మానించి అభినందించారు.

రచయిత్రి డా.పి.లలిత వాణికి 'కీర్తి'పురస్కారం



మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి నవంబర్ 27) హైద్రాబాద్ రచయిత్రి, ఆధ్యాత్మికవేత్త డా.పి. లలితవాణి శుక్రవారం కీర్తిపురస్కారాన్ని అందుకున్నారు. ప్రాచీన సాహిత్యం విభాగంలో ఆమె చేసిన సాహితీకృషికి ఈ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేసారు. సాహితీజిగీష -కళాసంస్థ ద్వారా సాహితీసేవ చేస్తున్నారు ఆమె. డా.పి.లలిత వాణికి కీర్తిపురస్కారం రావడంపై పలువురు సాహితీవేత్తలు-రఘుశ్రీ, బండారుశ్రీరామచంద్రారావు, ఉమాశశి, పెద్దూరి వెంకటదాసు, తంగెళ్ళపల్లి తదితర ఆమెను అభినందించారు. ఈ పురస్కారాన్ని తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డా. వెలుదండ నిత్యానందరావు ప్రదానం చేసారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వీసీ పద్మశ్రీ కొలకలూరి ఇనాక్,చాకలి ఐలమ్మ మహిళావిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య సూర్యాధనుంజయ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తడ్కల్ లో అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన

● యువజన సంఘం ఆధ్వర్యంలో
● సామాజిక సమానత్వం, విద్య, ఆత్మగౌరవానికి నిలయంగా అంబేద్కర్ భవనం





కంగ్టి,నవంబర్ 27, (ప్రజావాణి)రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు అందించడంతోపాటు, సామాజిక చైతన్యానికి కేంద్రంగా నిలిచే దిశగా కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం అంబేద్కర్ భావజాలంపై గ్రామ యువతకు ఉన్న నిబద్ధతను చాటిచెప్పింది.ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా భూమిపూజ చేసి భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అంబటి సాయిలు ఉపాధ్యక్షుడు చిలక గంగారం మాట్లాడుతూ..అంబేద్కర్ ఆశయాలు కేవలం చిత్రపటాలకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి ఆలోచనల్లో, ఆచరణలో ప్రతిబింబించాలని పేర్కొన్నారు.విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మించనున్న అంబేద్కర్ భవనం గ్రామ ప్రజలకు, యువతకు సామాజిక చైతన్య వేదికగా ఉపయోగపడుతుందని, సమావేశాలు, విద్యా కార్యక్రమాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలకు కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు యువత ఐక్యంగా కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుగుణ మల్లారెడ్డి, కార్యదర్శి గైని జైపాల్, ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల అంజి, కోశాధికారి సాయిలు, వార్డు సభ్యులు ఎర్రోళ్ల డేవిడ్, గైని భూమయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్, గ్రామ పెద్దలు బాబూసాబ్, సాయిలు స్వామి, ఎర్రోళ్ల సాయిలు, జఫ్ఫార్ సాబ్, యువజన సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల పేరుతో రూ.50 లక్షల మోసం.. ప్రధాన నిందితుడు అరెస్ట్

● రూ.25.02 లక్షల నగదు, బంగారం, వెండి, సెల్‌ఫోన్లు స్వాధీనం



కీసర, నవంబర్ 27:ప్రత్యేక పూజలు, తాంత్రిక ఆచారాలతో సమస్యలు పరిష్కరిస్తామని నమ్మించి ఓ వ్యక్తి నుంచి సుమారు రూ.50 లక్షలు వసూలు చేసిన కేసులో ప్రధాన నిందితుడు కాళం క్రాంతి కుమార్ అలియాస్ క్రాంతిని కీసర పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. కుందన్‌పల్లికి చెందిన మణికంఠ రాము కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడంతో మనోవేదనకు గురైన ఆయన కీసర కాళీమాత ఆలయాన్ని సందర్శించాడు. అక్కడ పరిచయమైన క్రాంతి, అతని భార్య రత్న ప్రత్యేక పూజలతో కుమార్తెను తిరిగి తీసుకువస్తామని నమ్మించి విడతలవారీగా భారీగా నగదు వసూలు చేశారు. ఈ వ్యవహారంలో పుట్టి సాయి కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ నెల 26న క్రాంతిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని వద్ద, రాంపల్లిలోని నివాసంలో కలిపి రూ.25,02,500 నగదు, బంగారు ఉంగరం, సుమారు 50 తులాల వెండి బిస్కెట్లు, రెండు సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు రత్న, పుట్టి సాయి పరారీలో ఉండగా వారి కోసం గాలిస్తున్నారు.మల్కాజిగిరి సీపీ, డీసీపీల ఆదేశాల మేరకు జవహర్‌నగర్ ఏసీపీ మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ ఎన్. ఎలక్షన్ రెడ్డి, ఎస్సైలు వి. వెంకట్ రెడ్డి, జి. రఘురాముడు కేసును ఛేదించినట్లు ఏసీపీ ఎన్. చక్రపాణి తెలిపారు. తాంత్రిక పూజలు, మంత్రతంత్రాల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

బాల్యవివాహాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దేవి మానస
● బాల్యవివాహాలు బాలల భవిష్యత్తును దెబ్బతీస్తాయి.. మాదకద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేస్తాయి





కూసుమంచి నవంబర్ 27 (మన ప్రజావాణి) ప్రతినిధి:బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి దేవి మానస సూచించారు. బాల్యవివాహాల నిర్మూలన, మాదకద్రవ్యాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించి సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 27 అంతర్జాతీయ బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఐడీఎన్జీవో, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఖమ్మం ఆధ్వర్యంలో గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవి మానస మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల ముఖ్యంగా బాలికలు విద్యకు దూరమవడంతో పాటు శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. బాల్యవివాహాల నిషేధ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, తల్లిదండ్రులు సైతం పిల్లల భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ వినియోగానికి ప్రేరేపిస్తే ధైర్యంగా తిరస్కరించాలని విద్యార్థులకు సూచించారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, బాల్యవివాహాలు లేని సమాజం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండే యువత దేశ అభివృద్ధికి పునాదిగా నిలుస్తారని అధికారులు పేర్కొన్నారు. బాల్యవివాహాల నిర్మూలన, మాదకద్రవ్యాల నివారణకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, సీడీపీఓ కవిత, తహసీల్దార్ సైదులు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయి కుమార్, మండల విద్యాశాఖ అధికారి రాయల వీరస్వామి, ఉమెన్ హబ్ జిల్లా కోఆర్డినేటర్ సప్రీన్, కే. సతీష్, ఏఐడీఎన్జీవో కోఆర్డినేటర్ కే. శ్రీనివాస్, బృంద సభ్యులు రాందాస్, రవీంద్రబాబు, భాస్కర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెన్నారావుపేట నవంబర్ 27 ప్రజావాణి దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హయాంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు మంజూరయ్యాయి. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న ఈ చెక్కులను పంపిణీ చేశారు.చెరువుకొమ్ము తండాకు చెందిన బోడ రమేష్‌కు రూ. 12 వేలు, వాంకుడోత్ బాలుకు రూ. 9 వేలు, 16 చింతల్ తండాకు చెందిన బానోత్ సుగుణకు రూ. 18 వేలు, బానోత్ శిరీషకు రూ. 13,500 చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాల్నే వెంకన్న మాట్లాడుతూ.. ప్రజల కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, మండల నాయకులు బోడ బద్దు నాయక్, బానోత్ లక్ష్మణ్ నాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జి బోడ మురళి నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోతు నరసింహ, మాజీ ఉపసర్పంచ్ మాలోత్ నంద నాయక్, వార్డు సభ్యులు ఆకరి దంజీ, గుగులోతు రవి, నాయకులు బోడ రవి నాయక్, బానోతు హరిలాల్, బోడ మంగీలాల్, బోడ దంజ్య, వాంకుడోత్ కిషన్, బానోత్ గణేష్, జూమ్ లాల్, మోతిలాల్, కోర్ర స్వామి, బోడ వెంకన్న, శ్రీను, జరుపుల ఈర్య, లావుడియా శ్రీకాంత్, అజ్మీర మోహన్, వాంకుడోత్ లక్ష్మణ్, బోడ రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం నేరం... పిల్లల భవిష్యత్తుకు శాపం





రాయికల్, నవంబర్ 27 (ప్రజావాణి):బాల్య వివాహాలు లేని భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని సర్పంచ్ కొత్తకొండ రోజా నవీన్ అన్నారు.శుక్రవారం రాయికల్ మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.గ్రామ ప్రజలు, పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన శిక్షలు, పిల్లల భవిష్యత్తుపై పడే దుష్ప్రభావాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ రోజా నవీన్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు లేని భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ గ్రామంలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా చూడాలని, అందుకు గ్రామస్తులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు.చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ కడారి శ్రవణ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు, గ్రామ పెద్దలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు మరియు వాటి నివారణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు.బాల్య వివాహాల నిరోధక చట్టం – 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు బాలికకు, 21 సంవత్సరాల లోపు బాలుడికి వివాహం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.1 లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.బాల్య వివాహాల వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. చిన్న వయస్సులోనే వివాహం కావడం వల్ల వారి విద్య మధ్యలోనే ఆగిపోతుందని, ఆరోగ్యం దెబ్బతింటుందని, భవిష్యత్తు అంధకారమవుతుందని వివరించారు. అలాగే బాల్య వివాహాల కారణంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో నిబంధనల ప్రకారం అర్హత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసినా మౌనంగా ఉండటం కూడా తప్పేనని, వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు బాలబాలికలకు రక్షణ మరియు సంరక్షణ అవసరమైనప్పుడు 24 గంటల పాటు అందుబాటులో ఉండే ఉచిత అత్యవసర సేవ అయిన చైల్డ్ హెల్ప్ లైన్ 1098ను సంప్రదించాలని కోరారు. అదేవిధంగా పోలీస్ అత్యవసర సేవలు 100, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ 112, మహిళల సహాయం కోసం 181 హెల్ప్‌లైన్ సేవలను అవసరమైన సమయంలో సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, ఏఎన్ఎం, జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యులు స్వప్న,గౌతమి,అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్, గ్రామ ప్రజలు, పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



రాయికల్, నవంబర్ 27 (ప్రజావాణి):ఏళ్ల తరబడి పెన్షన్ కోసం ఎదురుచూసిన నిరుపేదలకు న్యాయం జరిగిందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.శుక్రవారం రాయికల్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండపల్లి రవిందర్ రావు, పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్, సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి అర్హులైన నిరుపేద వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు పెన్షన్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమం దిశగానే పనిచేస్తుందని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు ఉచిత కరెంట్, పావలా వడ్డీ రుణాలతో మహిళా అభివృద్ధి దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి అనేక మంది పేదల సొంత ఇంటి కలను నిజం చేశారని, ప్రతి కుటుంబానికి ఇందిరా జీవిత భీమా పథకం తో పాటు అనేక అభివృద్ధి పథకాలు చేపట్టి ప్రజలకు మరింత మేలు చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, పాక్స్ చైర్మన్లు మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, తంగెళ్ల రమేష్, ఏనుగు మల్లారెడ్డి, నిమ్మల శేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుజ్జుల మోహన్ రెడ్డి, నాగారం హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, సర్పంచ్ అంజయ్య, నీరటి శ్రీనివాస్, మాలావత్ ప్రసాద్, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే రాజారెడ్డి, నాయకులు బాపురపు నర్సయ్య, మ్యాకల కాంతారావు, కొత్తపల్లి ప్రసాద్, ముస్కు, జలపతి,గోపాల్, బొద్దుల శివకుమార్,పడిగెల నరసింహ, కాషవేణి రాజేష్, కటుకం సాయి, మచ్చ శేఖర్, గట్టుపెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివాస్‌ను విజయవంతం చేయండి

● చెన్నారావుపేట తెలంగాణ ఉద్యమకారుల పిలుపు



చెన్నారావుపేట నవంబర్ 27 ప్రజావాణి నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'దీక్షా దివాస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెన్నారావుపేట మండల తెలంగాణ ఉద్యమకారులు పిలుపునిచ్చారు.శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ సాధనలో కీలక ఘట్టమైన దీక్షా దివాస్ స్ఫూర్తిని కొనసాగించాలని, ఈ కార్యక్రమానికి మండలంలోని ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల గౌరవాధ్యక్షులు మహమ్మద్ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి వీరారెడ్డి, మండల అధ్యక్షులు కౌడగానీ రాజీరు, ప్రధాన కార్యదర్శి మెరుగు శంకర్ లింగం, ఉపాధ్యక్షులు మూడు రమేష్, నాయకులు శీలం రాజు, చత్రు నాయక్, ఎర్ర మల్లయ్య, గట్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం పెట్రోల్ బంకు బకాయిల తనిఖీకి సహకరించాలి: సీపీఐ

● డిసిఓ కార్యాలయంలో సమాచారం కోరుతూ దరఖాస్తు



చెన్నారావుపేటబినవంబర్ 27 ప్రజావాణి చెన్నారావుపేట సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు బకాయిల వివరాలను తనిఖీ చేసేందుకు అవకాశం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి పత్తి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జిల్లా సహకార అధికారి (డిసిఓ) కార్యాలయంలో సమాచారం కోరుతూ వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘం పెట్రోల్ బంకులో పేరుకుపోయిన బకాయిల లెక్కలను పరిశీలించేందుకు అధికారులు సహకరించాలన్నారు. ఇందుకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరం ఆడిట్ నివేదిక ప్రతులను అందజేయాలని కోరారు. సహకార సంఘంపై సెక్షన్-51 విచారణ పూర్తయినందున, బాధ్యులకు రెవెన్యూ రికవరీ (ఆర్.ఆర్) నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. ఆ ఆర్.ఆర్ నోటీసుల నకళ్లతో పాటు, గతంలో డిసిఓ విచారణ జరిపిన నివేదిక (పేజీ నంబర్ 42 ప్రకారం) ప్రతులను కూడా ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మురికి నీటి బాధకు ముగింపు... ఇటిక్యాల బైపాస్‌లో డ్రైనేజీకి శ్రీకారం !

● రూ.2 లక్షల పంచాయతీ నిధులతో పనులు ప్రారంభించిన సర్పంచ్ శ్రీనివాస్



రాయికల్, నవంబర్ 27 (ప్రజావాణి):ఏళ్లుగా కాలనీవాసులను వేధిస్తున్న మురికి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఇటిక్యాల గ్రామంలో కీలక అడుగు పడింది.రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో 4, 5 వార్డులలో గ్రామ రెండవ బైపాస్ అని పిలిచే అత్యంత కీలకమైన రహదారిలో రూ.2 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రహదారిలో డ్రైనేజీ సరిగా లేక మురికి నీరు అంతా రోడ్డుపైకి రావడంతో కాలనీవాసులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు. నడవడానికి కూడా వీలు లేకుండా, దుర్వాసనతో, దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను గుర్తించి శాశ్వత పరిష్కారం కోసమే ఈ డ్రైనేజీ నిర్మాణం చేపట్టామని స్పష్టం చేశారు.గ్రామంలోని డ్రైనేజీ ఇబ్బందులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తొందరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి, పరిశుభ్రతకే తమ ప్రాధాన్యత అని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయిరెడ్డి, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, స్థానిక వార్డు సభ్యులు నిగ భూమేశ్వర్, కార్యదర్శి తోట రాజేష్, వార్డు సభ్యులు రాజేంద్ర యాదవ్, గ్రామ సేవా సమితి అధ్యక్షులు ప్రతాపరెడ్డి, నాయిని రమేష్ గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామ పంచాయతీల అధికారాలు, విధులు టీజీపీఎస్‌ఐకి బదలాయింపు.

● పంచాయతీ పార్కుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు.. ఆదాయంలో 65 శాతం సంస్థకు, 35 శాతం పంచాయతీలకు.

కొండాపూర్ నవంబర్ 27 (ప్రజావాణి):మండలంలోని తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామ పంచాయతీలకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం--2018 ప్రకారం కల్పించిన అధికారాలు, విధులను రాష్ట్ర ప్రభుత్వం బదలాయించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ మౌలిక సదుపాయాల సంస్థ (టీజీపీఎస్ఐ)కి ఆయా గ్రామ పంచాయతీల అధికారాలు, విధులను బదలాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ రెండు గ్రామాల పరిధిలో పంచాయతీ పార్కులను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ కోసం ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఎల్ఏ) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ పార్కుల ఏర్పాటుతో పాటు వాటి నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టేందుకు సంబంధిత గ్రామ పంచాయతీల అధికారాలు, విధులను బదలాయించాలని టీజీపీఎస్ఐ ఎండీ పంచాయతీరాజ్ శాఖకు విజ్ఞప్తి చేశారు.ఈ విజ్ఞప్తిని పరిశీలించిన పంచాయతీరాజ్ శాఖ అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామ పంచాయతీల పరిధిలో పంచాయతీ పార్కుల ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

ఆదాయంలో 65:35 నిష్పత్తి.

పంచాయతీ పార్కుల ద్వారా సమకూరే ఆదాయం, వివిధ రకాల వసూళ్లు, ఇతర ఆర్థిక ఆదాయాలను టీజీపీఎస్ఐ, సంబంధిత గ్రామ పంచాయతీలు 65:35 నిష్పత్తిలో పంచుకోనున్నాయి. అంటే మొత్తం ఆదాయంలో 65 శాతం టీజీపీఎస్ఐకి, మిగిలిన 35 శాతం గ్రామ పంచాయతీలకు కేటాయించనున్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ఈ రెండు గ్రామాల పరిధిలో పార్కుల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగనుంది.

వడ్లూరు గ్రామంలో పోలీసుల కార్డన్ సెర్చ్

● మాదకద్రవ్యాలు సమాజానికి చేటు..యువత వాటికి దూరంగా ఉండాలి

● సిద్ధిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి



బెజ్జంకి,నవంబర్ 27 (ప్రజావాణి)సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని వడ్లూరు గ్రామంలో శుక్రవారం ఏసీపీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు.పోలీసు అధికారులు, సిబ్బంది ఇంటింటా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సమాజానికి తీవ్ర చేటు చేస్తాయని, వాటి ప్రభావంతో కుటుంబాలు విచ్ఛిన్నమై యువత జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనించాలని సూచించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డీఎస్పీ భరత్ కుమార్ మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గుర్తింపు, విద్యే అత్యంత విలువైన సంపద అని పేర్కొన్నారు. యువత అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించాలనే ఆశతో పెడదారి పట్టకుండా చదువుపై ఏకాగ్రత పెట్టి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 56 ద్విచక్ర వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నాలుగు గోలుసు దుకాణాల్లో మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. సుమారు 50 మంది వాహనదారుల పత్రాలను పరిశీలించి, సరైన ధ్రువపత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ప్రజల సుఖదుఃఖాల్లో పాలుపంచుకుంటూ.. ఆపదలో అండగా నిలుస్తున్న డా. పగడాల కాళీ ప్రసాద్ రావు

● పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు ఆర్థిక సహాయం.. నూతన వధూవరులకు ఆశీర్వాదాలు

ప్రజావాణి ఆత్మకూరు నవంబర్ 27పరకాల: ప్రజా సేవే లక్ష్యంగా ప్రజల మధ్య ఉంటూ, వారి సుఖదుఃఖాల్లో పాలుపంచుకుంటూ, కష్టకాలంలో అండగా నిలవడమే తన ధ్యేయమని పరకాల నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు అన్నారు. ఈ క్రమంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలుసుకున్నారు.

ముందుగా పరకాల పట్టణ బీజేపీ అధ్యక్షులు గాజుల నిరంజన్ జన్మదిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం పరకాల పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే బైపాస్ శస్త్రచికిత్స చేయించుకున్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబాలకు సైతం ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల



గ్రామంలో జరిగిన వెంకటేష్ -- మౌనిష వివాహ వేడుకకు ఆత్మకూరు మండల బీజేపీ అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. నూతన వధూవరులకు నూతన వస్త్రాలను బహుకరించి, పుష్పగుచ్ఛం అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పార్టీ నాయకులు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా



ముందుకు సాగుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో పరకాల మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి. జయంతిలాల్, పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘు పురుషోత్తం, మార్త రాజభద్రయ్య, ముత్యాల దేవేందర్, మెంతుల సురేష్, అరెపల్లి రాజు, రేవంత్, సిద్ధు, యువజన విభాగం పరకాల పట్టణ అధ్యక్షులు దాసరి ప్రణీత్, వెనుకబడిన తరగతుల జిల్లా అధ్యక్షులు బలవంతుల రాజు, సముద్రాల రవి, బలవంతుల శ్రీకాంత్, చందు, నాగరాజు, సుధాకర్, మహేందర్, విజయ్, రాజు, రాకేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలపై విద్యార్థులకు చైతన్యం

● ముస్లాపూర్ పాఠశాలలో ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ముస్లాపూర్ । నవంబర్ 27 । మన ప్రజావాణి । జిల్లా ప్రతినిధి ఆందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, పౌరుల బాధ్యతలు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం వ్యవస్థాపకులు, జాతీయ చైర్మన్ కాసల కోనయ్య ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా చైర్మన్ బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సంగమేశ్వర్, జిల్లా విద్యార్థి విభాగం చైర్మన్ కె. సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అధ్యక్షత వహించారు.

ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భారత రాజ్యాంగ



గొప్పతనం, రాజ్యాంగం కల్పించిన హక్కులు, పౌరుల బాధ్యతలపై తమ ఆలోచనలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ బైండ్ల కృష్ణ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలను అందించిన గొప్ప గ్రంథమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకొని కులమతాలకు అతీతంగా సమాజంలో సమానత్వ భావనతో



మెలగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, రచనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ..విద్యతో పాటు దేశ చరిత్ర, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన ఉండటం ఎంతో అవసరమన్నారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని, రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాజ్యాంగ విలువలు, మానవ హక్కులపై విద్యార్థుల్లో చైతన్యం నింపేలా కార్యక్రమం సాగింది.

ఐపీఈలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

● రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివిన విద్యార్థులు -- యువతలో రాజ్యాంగ అవగాహన పెంపొందించాలన్న నల్సార్ వీసీ

హైదరాబాద్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ) ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో భారత రాజ్యాంగంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలోని విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు ఐపీఈలోని అన్ని తరగతి గదుల్లో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి డిజిటల్ బోర్డులపై ప్రదర్శించిన భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివారు. రాజ్యాంగంలోని విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, దేశ పౌరుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు సంస్థ ఆడిటోరియంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2028 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు, డీన్ అకడమిక్స్ ప్రొఫెసర్ ఎం. మెహర్ కరుణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి అతిథులను, అధ్యాపకులను, విద్యార్థులను స్వాగతిస్తూ రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు



పునాది అని, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించి, ఆచరించాలని పేర్కొన్నారు. ముఖ్య ప్రసంగం చేసిన నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం వెనుక ఉన్న ఉద్దేశాలను వివరించారు. ముఖ్యంగా యువ విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే యువత రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువలు, పౌర బాధ్యతలను అర్థం చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగంపై అవగాహన కలిగిన యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

కార్యక్రమం అనంతరం ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి ముఖ్య ప్రసంగకర్త ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావును ఘనంగా





సత్కరించారు. అనంతరం అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి గ్రూప్ ఫోటో దిగారు. చివరగా డీన్ అకడమిక్స్ ప్రొఫెసర్ ఎం. మెహర్ కరుణ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని ఐపీఈ విద్యార్థి వ్యవహారాల సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్ పిళ్లై ఆధ్వర్యంలో నిర్వహించి, సమన్వయం చేశారు. రాజ్యాంగ దినోత్సవ వేడుకల ద్వారా విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, దేశ పౌరులుగా బాధ్యతలపై అవగాహన పెంపొందించేందుకు సంస్థ కృషి చేసింది.

కోహెడ పోలీస్ స్టేషన్ తనిఖీ

● పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ● క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేయాలి ● పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంచాలి ● వర్టికల్ ఇంచార్జ్ లు ● బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి ● నేరాల నియంత్రణకు ● సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి





సిద్ధిపేట ప్రతినిధి నవంబర్ 27(ప్రజావాణి) వార్షిక తనిఖీ లలో భాగంగా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ శుక్రవారం రోజున జిల్లాలోని కోహెడ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు కోహెడ ఎస్ఐ అభిలాష్ ముందుగా సిబ్బందితో రిపోర్ట్ చేశారు . ఎస్ఐ నిర్వహించిన పరేడ్ ను సిపి పరిశీలించారు. అనంతరం సిబ్బంది యొక్క కిట్ ఆర్టికల్స్‌ను, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ కేసులకు సంబంధించిన వాహనాలను సిపి తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులు మరియు అన్ని వర్టికల్స్ పనితీరును సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ:ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యలను ఓపికగా విని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి అని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల నిఘాను పెంచేలా ఎస్ఐ చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. అనంతరం సిబ్బంది యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వర్టికల్ ఇన్‌చార్జ్ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో హుస్నాబాద్ ఏసిపి సదానందం, ట్రైనీ డీఎస్పీలు సుమా శ్రీ, భారత్ రెడ్డి, ముషరఫ్ , హుస్నాబాద్ సీఐ శ్రీధర్, ఎస్ఐ అభిలాష్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రెండు బిల్లులతో.. బిజెపి వేస్తున్న బిగ్ స్కెచ్ ఇదే...?

● భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్.



యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 27

పార్లమెంటరీ సమావేశాల నిర్వహణలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ గిజిజు , లోక్సభ స్పీకర్ హోమ్ బిర్లాకు చేసిన ట్వీట్ ప్రస్తావిస్తూ పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ అవసరాలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు.

ఆ బిల్లుకు మద్దతు...?

డిలిమిటేషన్ ను బిజెపి తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా చేసుకునేందుకే శీతాకాల సమావేశాలను ఆలస్యం చేస్తుందని ఆరోపించారు. ఇతర రాజకీయ పార్టీలతో చర్చించకుండా తమకు అనుకూలంగా ఉన్న పార్టీలతో మాత్రమే సంప్రదింపులు జరుపుతూ విభేదించే పార్టీలపై ఒత్తిడిని తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగు తున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని , 2023 లోనే 17వ లోక్సభలో 543 మంది సభ్యులతో 540 మంది ఆ బిల్లుకు మద్దతు తెలి పారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్సభ స్థానాలలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే , మహిళా రిజర్వేషన్ తో పాటు డిలిమినేషన్ ముడిపెట్టి రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు భారతీయ జనతా పార్టీ ప్రయత్నించడం సరైంది కాదన్నారు.

అంతా మీ ఇష్టా రాజ్యం...

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పార్లమెంటును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించు కోవడం ప్రజాస్వామ్యానికి విఘాతమని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. లోక్ సభ, రాజ్య సభ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికలను కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా నిర్వహించడం బాధా కరమన్నారు. పార్లమెంటు సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించకుండా , ప్రశ్నోత్తరాలు లేకుండా , తమకు అనుకూలమైన బిల్లును ఆమోదించుకునే విధంగా సభను నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తెలంగాణకు సంబంధించిన కీలక అంశాలు , భువనగిరి నియోజకవర్గ ప్రజల సమస్యలను పార్లమెంట్లో ప్రస్తావించేందుకు అవకాశం లేకుండా చేయ డానికి ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్చగా అభివర్ణించారు.

సమావేశాల వెనుక ఉద్దేశం ఏమిటి...?

సాధారణంగా నవంబర్ చివరి వారంలో ప్రారంభమయ్యే క్రిస్మస్ కు ముందు ముగిసే సీత కళా సమావేశాలపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళనకరమన్నారు. సమావేశాల ముగింపు నకు సంబంధించి రాష్ట్రపతికి సిఫారసు చేయకుండా 100 రోజులకు పైగా పార్లమెంట్ ను ప్రోరోగ్ చేయకపోవడం వెనుక ఉద్దేశం ఏమిటి అని ప్రశ్నించారు. పార్ల మెంట్ సభ్యులకు కనీసం 15 రోజుల ముందుగా సమావేశాల నోటిఫికేషన్ అందితేనే తమ నియోజకవర్గాలు , రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను ప్రశ్నోత్తరాల ద్వారా సభలో ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు ఈసారి అటు వంటి అవకాశం కల్పించక పోవడం తెలంగాణకు , తన భువనగిరి నియోజక వర్గానికి సంబంధించిన సమస్యలను పార్లమెంట్ లో ప్రస్తావించకుండా అడ్డు కోవడమేమిటని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాయికల్, నవంబర్ 27 (ప్రజావాణి): రైతులు చెమటోడ్చి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందాలన్నదే లక్ష్యంగా రాయికల్ మండలం లోని బోర్నపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శు క్రవారం ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ కొడిపెల్లి రాజవ్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భూపతిపూర్ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మల శేఖర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా, తమ పంటను ప్రభుత్వ మద్దతు ధరకే కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని సూచించారు. ధాన్యం తేమ శాతం, తూకంలో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రంలో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి తీసుకువస్తే త్వరగా కొనుగోలు జరిగి,చెల్లింపులు కూడా సకాలంలో అందుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రాజేశం, నరేందర్, మాజీ డైరెక్టర్ కోల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్, సీఈఓ మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఘనపూర్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా డీఆర్డీఏ పీడీ

● కూలీలతో మాట్లాడి వసతులపై ఆరా తీసిన అధికారులు





పరిగి /?కులకచర్ల, నవంబర్ 27 (ప్రజావాణి):కులకచర్ల మండలం ఘనపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను జిల్లా డీఆర్డీఏ పీడీ నర్సింగ్ రావు శు క్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని చెరువులో వివిజి రాంజీ (VBG Ramji) పథకం కింద చేపడుతున్న చేపలగుంత పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న 130 మంది కూలీలతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న కనీస సౌకర్యాలు, పథకం అమలు తీరుతెన్నులను కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వర్మీ షెడ్, బోర్‌వెల్ రీచార్జ్ పనులను అధికారులు పరిశీలించి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఏ సత్తయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో చంద్రశేఖర్, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, సీసీ ఇందిర, గ్రామ సర్పంచ్ రవిందర్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, వివోఏ చంద్రయ్య, వివిజి రాంజీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల విశ్వాసమే కీలకం

● ఆవిష్కరణలు, పోటీని ప్రోత్సహిస్తూ సమర్థవంతమైన నియంత్రణ
● గీతంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు





పటాన్‌చెరువు, నవంబర్ 27 (ప్రజావాణి):బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని కాపాడటంలో భారతీయ రిజర్వు బ్యాంకు కీలక పాత్ర పోషిస్తోందని ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. ఆవిష్కరణలు, పోటీకి ప్రోత్సాహం అందిస్తూనే బ్యాంకింగ్ రంగంపై సమర్థవంతమైన నియంత్రణ కొనసాగిస్తోం దని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో 'రిజర్వు బ్యాంకు – దైనందిన జీవితంలో మార్పు' అనే అంశంపై నిర్వహించిన ఆతిథ్య ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు.ద్రవ్య స్థిరత్వాన్ని కాపాడటం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, బ్యాంకుల పనితీరును పర్యవేక్షించడం, కరెన్సీ నిర్వహణతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని నిర్ధారించడంలో ఆర్బీఐ బాధ్యతలను వివరించారు. ఆర్థిక వృద్ధి, ధరల స్థిరత్వం మధ్య సమతుల్యత సాధించడం, ద్రవ్య విధానం, మారకపు రేట్లలో హెచ్చుతగ్గులు, నకిలీ కరెన్సీ నియంత్రణ, డిజిటల్ రూపాయి వంటి అభివృద్ధి చెందుతున్న డిజిటల్ కరెన్సీల సవాళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.2008 నుంచి 2013 వరకు భారతీయ రిజర్వు బ్యాంకు 22వ గవర్నర్‌గా పనిచేసిన తన అనుభవాలను వివరిస్తూ.. ద్రవ్య విధానం, స్థూల ఆర్థిక నిర్వహణకు సంబంధించిన అంశాలను ప్రస్తుత ఆర్థిక పరిస్థితులతో అనుసంధానించి వివరించారు. వంద మందికి పైగా ఎంబీఏ విద్యార్థులు ఈ ఉపన్యాసంలో పాల్గొని పలు అంశాలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమంలో బిజినెస్ ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ సోఫియా, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సాయి ఆశిష్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు పరిశ్రమ రంగ అనుభవంతో కూడిన ఆచరణాత్మక జ్ఞానాన్ని అందిస్తాయని గీతం బిజినెస్ స్కూల్ ప్రతినిధులు పేర్కొన్నారు.

సంక్షేమ,అభివృద్ధి పథకాల అమలులో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలి...

● అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలి.
● బ్యాంకర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.



యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి నవంబర్ 27

ప్రభుత్వ సంక్షేమ , అభి వృద్ధి పథకాల అమలులో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని , సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం రోజు జిల్లా కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ , జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెప్టెంబర్ 2026తో ముగిసిన త్రై మాసికానికి సంబంధించి జిల్లాలో బ్యాంకింగ్ రంగ ప్రగతి , వార్షిక రుణ ప్రణాళిక అమలు , వ్యవసాయం , స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీ , ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు , కరువు సహాయ చర్యలు తదితర అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వీరన్న జిల్లాలో బ్యాంకింగ్ రంగ ప్రగతిని వివరిస్తూ , సెప్టెంబర్ 2026 నాటికి జిల్లాలో 23 బ్యాంకులకు చెందిన 121 శాఖలు పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం బ్యాంకింగ్ వ్యాపారం రూ.16,089.71 కోట్లకు చేరిందని , ఇందులో రూ. 5,245.08 కోట్ల డిపా జిట్లు , రూ. 10,844.63 కోట్ల రుణాలు ఉన్నాయని వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 2026 నాటికి ప్రాధాన్యతా రంగాలకు రూ. 3,010.77 కోట్ల రుణాలు పంపిణీ చేసి నట్లు తెలిపారు. వ్యవ సాయ రంగంలో వార్షిక రుణ లక్ష్యంలో 49.92 శాతం , ఎంఎస్ ఎంఇ రంగంలో 44.31 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఎస్ ఇ ఆర్ పి ద్వారా రూ. 346.63 కోట్లు , ఎంఈపిఎంఏ ద్వారా రూ. 63.20 కోట్ల రుణాలు పంపిణీ చేసి నట్లు వివరించారు. స్వయం సహాయక సంఘాల రుణాలకు సంబంధించి నిరర్థక ఆస్తుల శాతం పెరుగు తున్న నేపథ్యంలో బ్యాంకులు , ఎస్ ఇ ఆర్ పి అధికారులు సమన్వయం తో ప్రత్యేక రుణ వసూళ్ల కార్య క్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి స్వనిధి , పీఎం విశ్వకర్మ , పిఎంయఫ్ఎంఈ , పిఎంఈజీపి పథకాల అమలును సమీక్షిస్తూ , ఆయా పథకాల కింద బ్యాంకుల వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్క రించాలని ఆదేశించారు. పిఎంయఫ్ఎంఈ పథకం కింద రుణాల మంజూరు లో జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందని , ఈ పథకం ద్వారా మరింత మంది అర్హులైన లబ్ధి దారులకు రుణాలు అందించాలని సూచించారు. ముఖ్యంగా కూరగాయల సాగు , అగ్రి ప్రాసెసింగ్ , సోలార్ డ్రైయర్స్ , మునగ ప్రాసెసింగ్ , ఉద్యాన పంటలు , పూల సాగు , వ్యవసాయ డ్రోన్లు తదితర వినూత్న స్వయం ఉపాధి ప్రాజెక్టులను ప్రోత్స హించాలని బ్యాంకర్లకు సూచించారు. కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన మండలాల్లో అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం పంట రుణాలు , వ్యవసాయ అనుబంధ రంగాల రుణా లను పునర్వ్యవస్థీక రించడంతో పాటు , అవసరమైన కొత్త పంట రుణాలను కూడా సకాలంలో అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం , ఎంఎస్ఎంఈ రంగాల అభివృద్ధి , మహిళా సాధికారత , యువతకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో బ్యాంకులు , ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి , రుణ దరఖాస్తుల పరిశీలన , మంజూరు , పంపిణీ ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని , ప్రభుత్వ పథకాల లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధి , ఉపాధి కల్పనకు ప్రాధాన్యత నిస్తూ ఆర్‌ఎస్ఈఐటి ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ కార్య క్రమాలను సమర్థవంతం గా నిర్వహించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి , స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు అవసరమైన సహకారం కల్పించాలని పేర్కొన్నారు.పి ఎం జె జె బి వై , పి ఎం ఎస్ బి వై , ఏ పి వ్ వంటి సామాజిక భద్రతా పథ కాల అమలును మరింత విస్తృతం చేయాలని , బ్యాంకు శాఖలు , బిజినెస్ కరస్పాండెంట్లు , ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రత్యేక అవగాహన కార్య క్రమాలు నిర్వహించి , అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసు కోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి , డిఆర్డిఓ జంగారెడ్డి , ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్ , ఆర్బిఐ ఏజీఎం హేమలత , ఎన్ ఏ బి ఏ ఆర్ డి , డిడిఎం ఝాన్సీ , పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీధర్ , ఎంఈ పిఎంఏ డి ఎం సి రమేష్ , ఎల్ డి ఎం వీరన్న , వివిధ బ్యాంకుల ప్రతినిధులు , సంబంధిత జిల్లా అధి కారులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల మెరుపు దాడులు

● 102 ప్రామిసరీ నోట్లు స్వాధీనం ● 63 ఖాళీ చెక్‌బుక్‌లు సీజ్
● 57 మంది వడ్డీ, చిట్టీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు
● అక్రమ వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవన్న ఎస్పీ



కొమురంభీం, (ప్రజావాణి): అధిక వడ్డీలు వసూలు చేస్తూ రైతులు, సామాన్య ప్రజలను ఆర్థికంగా వేధిస్తున్న వడ్డీ వ్యాపారులపై కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు కొరడా ఝళిపించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 57 మంది అధిక వడ్డీ, చిట్టీ నిర్వాహకుల ఇళ్లలో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఆసిఫాబాద్ డీఎస్పీ బి.అశోక్, కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో వడ్డీ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. మొత్తం 16 కేసులు నమోదు చేసి, 102 ప్రామిసరీ నోట్లు, 63 ఖాళీ చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారాలకు పాల్పడినా, అప్పుల పేరుతో ప్రజలను వేధించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. బాధితులు భయపడకుండా సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మడిపల్లి మాజీ సర్పంచ్ స్వర్గీయ వజ్ర కృష్ణమూర్తి సేవలు మరువలేనివి

● మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు



జమ్మికుంట నవంబర్ 27 (ప్రజావాణి) జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ వజ్ర కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి కార్యక్రమం జమ్మికుంట మున్సిపల్ పరిధి దుర్గ కాలనీ లోని వారి నివాసంలో శు క్రవారం రోజున వారి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు మడిపల్లి గ్రామ ప్రజలతో పాటు వారి అభిమానులు బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ సందర్భంగా జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు హాజరై స్వర్గీయ వజ్ర కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు ఈ సందర్భంగా జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి రాష్ట్ర మంత్రివర్యులు ముద్దసాని దామోదర్ రెడ్డి సహకారంతో వజ్ర కృష్ణమూర్తి మడిపల్లి గ్రామ సర్పంచ్ గా గెలుపొంది గ్రామంలో సిసి రోడ్లు మంచినీటి సదుపాయం నిరుపేద కుటుంబాలకు పెన్షన్లు తో పాటు నివాస గృహాలు ఏర్పాటు చేసి వారి కుటుంబాలలో వెలుగులు నింపారు గ్రామంలోని కులాలకు మతాలకతీతంగా ఏ సమస్య వచ్చినా తన కుటుంబ సమస్య భావించి వారి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేసి మడిపల్లి గ్రామ ప్రజల ఆదరభిమానాలు పొందిన ఘనత స్వర్గీయ వజ్ర కృష్ణమూర్తి కే దక్కిందని ఈ సందర్భంగా అంబాల రాజు కొనియాడారు ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సప్పి రజనీకార్ తదితరులు పాల్గొన్నారు

మహిళలకు స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా

● ఎంబ్రాయిడరీ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి: మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు



రామాయంపేట, నవంబర్ 27 (ప్రజావాణి ప్రతినిధి: నరేష్ నాయక్):మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ఆర్యవైశ్య భవన్‌లో ఎస్‌బీఐ సహకారంతో స్వయం ఉపాధి ఎంబ్రాయిడరీ వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని తమలోని నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. కొత్త నైపుణ్యాలను నేర్చుకొని వాటిని ఉపాధి అవకాశాలుగా మలుచుకుంటే స్వయంగా ఆదాయం సంపాదించడంతో పాటు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవవచ్చని పేర్కొన్నారు.శిక్షణ పొందిన మహిళలు భవిష్యత్తులో స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి, ఇతర మహిళలకు కూడా స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు బైరం స్వప్న కుమార్, దేవుని రంజిత్, డాకి శ్యామల స్వామి, కోఆప్షన్ సభ్యులు ఆసియా సుల్తానా, చింతల రాధా భవాని యాదగిరి, మైనారిటీ అధ్యక్షుడు తాహిర్, సంబంధిత అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మఠంపల్లి లో కొత్తగా పశువుల సంత

● డిసెంబర్ 3న పశువుల సంత ప్రారంభం.





హుజూర్నగర్ నవంబర్ 27 (ప్రజావాణి) పశు పోషకులు, వ్యాపారుల ప్రయోజనాల కోసం సూర్యాపేట జిల్లా మఠంపల్లి సబ్‌యార్డులో డిసెంబర్ 3 నుంచి నూతన పశువుల సంతను ప్రారంభించనున్నట్లు హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ డి.రాధిక అరుణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ ఎ.ప్రవంతి కిషోర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి బుధవారం సంత నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పశువుల కొనుగోలు, విక్రయాల కోసం కోదాడ, అవంతిపురం, గురజాల, క్రోసూరు తదితర దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని నూతన సంతతో రైతులకు ప్రయాణ ఖర్చుల భారం తగ్గుతాయని తెలిపారు. ఈ ప్రాంతం తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంత రైతులు, వ్యాపారులకు ఈ సంత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సంతకు వచ్చే రైతులు, వ్యాపారులకు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారం అందిస్తామని అదే విధంగా పశువులకు త్రాగు నీరు, నీడ కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఉన్నత శ్రేణి కార్యదర్శి వి.నరసింహ పాల్గొన్నారు.

బొమ్మల గుడి శివాలయంలో శివనామస్మరణతో నగర సంకీర్తన కార్యక్రమం

● అన్నపూర్ణ సేవా సమితి భవాని భజన మండలి సత్యసాయి సేవా సమితి శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో





జమ్మికుంట నవంబర్ 27 (ప్రజావాణి)జమ్మికుంట పట్టణంలోనిశ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం బొమ్మల గుడి జమ్మికుంటలో లక్ష్మీవారం రోజున నగర సంకీర్తన కార్యక్రమము అన్నపూర్ణ సేవా సమితి భవాని భజన మండలి సత్యసాయి సేవా సమితి శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో జమ్మికుంట భక్తులచే జమ్మికుంట పురవీధుల మీదుగా శివనామస్మరణతో నగర సంకీర్తన కార్యక్రమము ఆ మహాదేవుని జన్మ నక్షత్రము ఆరుద్ర నక్షత్రము సంకటహరి చతుర్థి సందర్భంగా ఈ కార్యక్రమము ఆలయ ప్రధాన అర్చకులు మండలేముల వేణుగోపాల్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినాము ఈ కార్యక్రమానికి భక్తులు& అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు తదనంతరము గుడి ఆవరణలో కార్తీక మాసం సందర్భంగా కార్తీక పురాణం అన్నపూర్ణ సేవా మహిళ మహిళ బృందం వారు పురాణం చదివారు తదనంతరము ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు తీర్థప్రసాధారణ వితరణ చేశారు

కాట్రియాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం

● పేదల సొంతింటి కల సాకారం.. గుడిసెలు లేని గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సర్పంచ్



రామాయంపేట, నవంబర్ 27 (ప్రజావాణి ప్రతినిధి: నరేష్ నాయక్):పేద, బడుగు, బలహీన వర్గాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలో శుక్రవారం ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ స్థలాల్లో ముగ్గు పోసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో కాట్రియాల్ గ్రామాన్ని గుడిసెలు లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్త స్రవంతి, రాజేందర్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి ధనలక్ష్మి, ఆత్మ కమిటీ డైరెక్టర్ ద్యాగాల కుమార్, ద్యాగాల బాలయ్య, రమేష్, కాట్రియాల్ శ్రీను, శేఖర్, సిద్ధారాములు, శంకర్, వార్డు సభ్యులు రిబ్కా శ్యామ్, స్వరూప, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఝాన్సీ లింగాపూర్‌లో పశు వైద్య శిబిరం

● 68 పశువులకు వైద్య పరీక్షలు.. మందులు, మినరల్ మిక్చర్ పంపిణీ



రామాయంపేట, నవంబర్ 27 (ప్రజావాణి ప్రతినిధి: నరేష్ నాయక్):మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 68 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులతో పాటు మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పశుపోషకులకు పశువుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నివారణ, టీకాల ప్రాముఖ్యత, నట్టల నివారణ మందుల వినియోగంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. పశువులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించవచ్చని సూచించారు.
ఈ సందర్భంగా పశువైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమానికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని పశుపోషకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గ్రామ సర్పంచ్ మానేగాళ్ల రామకిష్టయ్య, ఉపసర్పంచ్ మహేష్, గ్రామ పెద్దలు రాజు, సుధాకర్ రెడ్డి, లింబాద్రి, నర్సింలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వంశిక ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభం

● పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్





జమ్మికుంట నవంబర్ 27 (ప్రజావాణి) జమ్మికుంట మున్సిపల్. పరిధిలోనికొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలను వంశిక ట్రస్ట్ సాయి చరణ్ బహుమతిగా ఇచ్చినటువంటి వాటర్ ప్యూరిఫైర్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ మన పాఠశాలకి మంచినీటి వాటర్ ప్యూరిఫైయర్ బహుమతిగా ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈరోజు తమ్ముడు సాయి నిఖిల్ కి, సన్నీకి, సాయి చరణ్ కి నా యొక్క అనేకమైనటువంటి శుభాకాంక్షలు ఎందుకంటే చరణ్ కి చాలా చిన్న వయసు కానీ ఆలోచన చాలా పెద్దది అని ఈ రోజు మనం ఏం గిఫ్ట్ ఇస్తున్నాము ఏం మంచి పనులు చేస్తున్నాము అది చిన్నదా పెద్దదా అని కాదు ఈరోజు చరణ్ కి వచ్చిన ఆలోచన వల్ల నాకు తెలిసి భవిష్యత్తులో మన ముందున్నటువంటి విద్యార్థులు అందరూ కూడా చాలామంది కూడా అనేకమైనటువంటి సేవా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు అందరూ కూడా మేము మధ్యలో ఇంత సేపు కూర్చున్నాము అంటే కారణము అందరిలో కూడా సేవాభావం ఉన్నది సేవాభావం అంటే ఒక లక్ష రూపాయలు ఇవ్వడం లేకపోతే ఇంకేదో పెద్ద పెద్ద పనులు చేయడం కాదు, చిన్న పనులు ఈ రోజు ఒక మంచి వాటర్ ప్యూరిఫైయర్ వల్ల శరత్ మన అందరికి కూడా ప్యూరిఫైయర్ వాటర్ తాగడానికి కారణమైంది అలాగే మీ అందరూ కూడా భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలోకి వెళ్ళి మనం చదువుకున్నటువంటి స్కూల్ పుట్టినగ్రామంచదువుకున్నటువంటి స్కూల్ కి ఎంతో కొంత తోడ్పాటుగా మనందరం మీరందరూ కూడా ఉండాలని చెప్పి మనస్ఫూర్తిగా కోరుకుంటూశరత్ కి కూడా ఇంతకుముందు ఎక్కడో మనం గుడిలోకి వెళ్ళి అయ్యగారి ఆశీర్వచనం తీసుకోవడము, అక్కడికి వెళ్ళి ఆశీర్వచనం తీసుకోవడము ఇవన్నీ జరుగుతుంటాయి కానీ ఒక మంచి ఉపాధ్యాయుడు లేక ఒక మంచి ఆశీర్వచనం, ఇంత మంది పిల్లలు వారందరి ఆశీర్వచనం తో పాటు మా అందరి కూడా ఆశీర్వచనం మీకు ఎప్పుడూ ఉంటాయి ఇలాంటి మంచి పని కార్యక్రమం చేస్తున్న మీకు మీరందరూ కూడా స్ఫూర్తిగా ఈ ముందు కూర్చున్న పిల్లలు గాని ఈ కార్యక్రమంలో ఉన్నటువంటి అన్నదమ్ములు మనం అందరూ కూడా పాటిస్తారని ఆశిస్తూ ఇలాంటి మంచి కార్యక్రమాలు మన అందరూ కూడా ముందుండి ప్రతి కార్యక్రమంలో చెయ్యాలని తెలియజేస్తూ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి మీకు ఆహ్వానించినందుకు మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, కౌన్సిలర్ బత్తుల లక్ష్మణ్,వినయ్ రవిజేజ తదితరులు పాల్గొన్నారు

ఊరు కన్న తల్లి లాంటిది.. ఊరి బిడ్డగా అభివృద్ధికి అండగా నిలుస్తున్న వేం నరేందర్ రెడ్డి!

● సొంత గ్రామం అర్పణపల్లి నుంచి చుట్టుపక్కల పల్లెల వరకు అభివృద్ధి పట్ల ప్రత్యేక చొరవ.. విద్యార్థుల భవిష్యత్తుపై అపారమైన ప్రేమ.. కేసముద్రం ప్రాంత అభివృద్ధిలో కీలక సహకారం! వేం సార్!





కేసముద్రం నవంబర్ 27,ప్రజావాణి.పుట్టిన ఊరును మరచిపోకుండా, పెరిగిన నేలపై మమకారాన్ని గుండెల్లో పదిలపరుచుకుని, తన స్థాయిని తన ఊరి అభివృద్ధికి ఉపయోగించడం అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ తన మూలాలను మరచిపోకుండా, తన సొంత గ్రామమైన అర్పణపల్లితో పాటు కేసముద్రం మండలంలోని పలు గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న వేం నరేందర్ రెడ్డి చొరవ ప్రత్యేకంగా ప్రస్తావించదగినది.సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో అర్పణపల్లిలో ఆధునిక పాఠశాల భవన నిర్మాణానికి సహకరించడం, ఏదో తరగతి వరకు ఉన్న పాఠశాలను ఎనిమిదో తరగతి వరకు ఉన్నతీకరించడంలో చూపిన చొరవ ఆయనకు విద్యార్థుల భవిష్యత్తుపై ఉన్న శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తోంది. తన గ్రామంలోని పిల్లలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు సైతం మెరుగైన విద్యావకాశాలు అందుబాటులోకి రావాలనే ఆలోచన అభినందనీయం.అభివృద్ధి అంటే కేవలం సొంత గ్రామానికే పరిమితం కావడం కాదు.. చుట్టుపక్కల ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి, ప్రతి పల్లెలో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలి, ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉండాలనే విశాల దృక్పథంతో ఆయన అందిస్తున్న సహకారం ప్రజల్లో ఆశలు నింపుతోంది. బ్రిడ్జిల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, విద్యారంగానికి తోడ్పాటు వంటి కార్యక్రమాల్లో ఆయన చొరవ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతోంది.ఒక వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదగడం గొప్ప విషయం.. కానీ తాను ఎదిగిన తర్వాత తన ప్రాంతం కూడా ఎదగాలని కోరుకోవడం అంతకంటే గొప్ప విషయం. తనకు జన్మనిచ్చిన ఊరిపైనే కాకుండా, తన చుట్టూ ఉన్న పల్లెలు, అక్కడి ప్రజలు, చదువుకునే చిన్నారుల భవిష్యత్తుపై చూపుతున్న శ్రద్ధ వేం నరేందర్ రెడ్డి గ్రామీణ అభివృద్ధి పట్ల ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది.పదవులు తాత్కాలికం.. కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలుస్తాయి. ఒక పాఠశాల భవనం నిర్మితమైతే అది కేవలం నాలుగు గోడలు కాదు.. ఎన్నో పేద కుటుంబాల పిల్లల కలలకు చిరునామా. ఒక బ్రిడ్జి నిర్మితమైతే అది కేవలం రహదారి అనుసంధానం కాదు.. ఎన్నో గ్రామాల మధ్య అభివృద్ధికి వారధి. ఒక గ్రామం అభివృద్ధి చెందితే అది ఒక్క కుటుంబానికి కాదు.. మొత్తం సమాజానికి మేలు చేసినట్లే.సొంతూరి బిడ్డగా ప్రారంభమైన ఆయన అభివృద్ధి ఆలోచనలు చుట్టుపక్కల గ్రామాలకూ విస్తరించాలని, కేసముద్రం మండలంలోని ప్రతి పల్లె ప్రగతి బాటలో పయనించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.ఊరిని ప్రేమించే మనసు.. పల్లెలను అభివృద్ధి చేసే ఆలోచన.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలనే తపన.. ఇవే ఒక వ్యక్తి తన ప్రాంతానికి అందించగల విలువైన కానుకలు. అర్పణపల్లి నుంచి కేసముద్రం ప్రాంత అభివృద్ధి వరకు వేం నరేందర్ రెడ్డి సహకారం ప్రజల మదిలో నిలవాలని ఆశిద్దాం.తాను ఎదిగిన నేల ఎదగాలి.. తన ఊరి పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.. చుట్టుపక్కల ప్రతి పల్లె ప్రగతి పథంలో నడవాలి.. ఇదే నిజమైన ఊరి బిడ్డకు ఉండాల్సిన గొప్ప మనసు!

విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య



మన ప్రజావాణి మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలం వెంకట్రావుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి, వారి చదువు, అవగాహన స్థాయి, నేర్చుకునే సామర్థ్యాలు, వారికి కల్పిస్తున్న సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను మరింత పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.గ్రామంలో భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించడం, వర్షపు నీటిని సంరక్షించడం లక్ష్యంగా చేపడుతున్న వాటర్ రీఛార్జ్ స్ట్రక్చర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇటువంటి నిర్మాణాలు ఎంతగానో ఉపయోగపడతాయని, పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు అందే ప్రయోజనాలను వివరించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, ఎపిఓ బాలయ్య, ఎపిఎం సంతోష్, గ్రామ సర్పంచ్ జాడి లక్ష్మి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

బాల్య వివాహాల రహిత దేశంగా తీర్చిదిద్దాలి

● జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య





మన ప్రజావాణి మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-బాల్య వివాహాల రహిత భారత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సౌజన్యంతో బాల్య వివాహాలు నిరోధంపై ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనప కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో బాల్యవివాహాలు చేయరాదని, ఒకవేళ చేసినట్లయితే బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం శిక్షకు అర్హులు అవుతారని తెలిపారు. బాల్య వివాహం చేసిన వారికి, వివాహానికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి చట్టపరంగా శిక్షించపడుతుందని తెలిపారు. బాల్య వివాహం చేసినట్లయితే 1 లక్ష రూపాయలు జరిమానా, 2 సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనపై డ్రీమ్ ప్రాజెక్టు సొసైటీ కృషి అభినందనీయమని తెలిపారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ బాల్యవివాహానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, జిల్లా సంక్షేమ, కార్మిక, వైద్య ఆరోగ్య, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు, పోషణ అభియాన్, చైల్డ్ హెల్ప్ లైన్, బాలల పరిరక్షణ శాఖ, మహిళా సాధికారిత శాఖ, డ్రీమ్ సొసైటీ ప్రతినిధి సంతోష్ , డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్వర్లు, సమన్వయకర్తలు సుజాత, నాగేష్ లు పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షకు పటిష్ట పోలీసు బందోబస్తు

- జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలు..
  13,765 మంది అభ్యర్థులు హాజరు
- పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్
  163 బీఎన్ఎస్ఎస్ అమలు
- అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు
  చేరుకుని ప్రశాంత వాతావరణంలో పరీక్ష
  రాయాలి : జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్



నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణితెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రూప్స్=దీ) ఆధ్వర్యంలో ఈ నెల 29 వ తేదీ ఆదివారం నిర్వహించనున్న ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షకు సంబంధించి నల్లగొండ జిల్లాలో పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 13,765 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని ఎస్పీ వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, నార్కట్‌పల్లి మండలాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకుని బస్సుల సౌకర్యం పెంచే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుంది.అభ్యర్థులకు ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఈ ప్రక్రియకు సమయం పట్టే అవకాశం ఉన్నందున అభ్యర్థులు వీలైనంత ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎస్పీ సూచించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తగినంత పోలీసు సిబ్బందిని నియమించడంతో పాటు, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయనున్నారు. పరీక్షా కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.

లిపరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక ఆంక్షలులి

పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందుగా మాత్రమే అభ్యర్థులను పరీక్షా హాలులోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరు. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎస్పీ సూచించారు. పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలను తెరవడానికి అనుమతి ఉండదు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుంది. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమిగూడడం, అనవసరంగా సంచరించడం, పరీక్షకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించడం నిషేధమని తెలిపారు.

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని, అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పోలీసులకు సహకరించాలని కోరారు.

అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాల్సిన ముఖ్య సూచనలులి :

అభ్యర్థులు తమ హాల్ టికెట్‌పై ఫోటోకు కేటాయించిన స్థలంలో పాస్‌పోర్ట్ సైజు ఫోటోను అతికించి, అవసరమైన సంతకం చేయాలి.

పరీక్షకు ఒక రోజు ముందుగానే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం చిరునామా, వెళ్లే మార్గం తదితర వివరాలను నిర్ధారించుకోవాలి.

పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది.

పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందుగా మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. కాబట్టి సమయపాలన తప్పనిసరిగా పాటించాలి.

మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ట్యాబ్లెట్లు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, నోట్స్, బ్యాగులు, పర్సులు, నగలు తదితర వస్తువులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద వస్తువులను భద్రపరిచే సదుపాయం ఉండదు. కాబట్టి అభ్యర్థులు వాటిని తమ వెంట తీసుకురాకూడదు.

అభ్యర్థులు నలుపు లేదా నీలం రంగు బాల్ పాయింట్ పెన్, హాల్ టికెట్ మాత్రమే పరీక్షా హాలులోకి తీసుకెళ్లాలి. పెన్సిళ్లు, జెల్ పెన్నులు, ఇతర రంగుల పెన్నులకు అనుమతి లేదు.

పరీక్ష సమయంలో అభ్యర్థుల ఫోటోలు, వేలిముద్రలు, సంతకాలు సేకరించడంతో పాటు ఆధార్ ఫేస్ అథెంటికేషన్ నిర్వహిస్తారు. కాబట్టి బయోమెట్రిక్ నమోదు సక్రమంగా జరిగేందుకు వేళ్లపై మెహందీ, తాత్కాలిక టాటూలు లేదా వేలిముద్రల గుర్తింపునకు ఆటంకం కలిగించే పదార్థాలు లేకుండా చూసుకోవాలి.

ప్రశ్నపత్రం అందుకున్న వెంటనే మొత్తం 200 ప్రశ్నలు, అన్ని పేజీలు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించాలి. ఏవైనా లోపాలు లేదా సమస్యలు ఉంటే వెంటనే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లాలి.

ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష 200 మార్కులకు 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలతో నిర్వహించబడుతుంది. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. కాబట్టి ప్రశ్నలను జాగ్రత్తగా చదివి సమాధానాలను గుర్తించాలి.

హాల్ టికెట్‌పై పొందుపరిచిన సూచనలు, నిబంధనలను అభ్యర్థులు ముందుగానే పూర్తిగా చదివి, పరీక్ష సమయంలో వాటిని తప్పనిసరిగా పాటించాలి.

లిఅభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లులి

ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని జిల్లా ఎస్పీ సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించకుండా సహకరించాలని కోరారు.పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నామని, పరీక్షా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అభ్యర్థులందరూ సమయపాలన పాటిస్తూ, అవసరమైన పత్రాలతో ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆకాంక్షించారు.

సాయి మానసిక వికలాంగుల కేంద్రానికి అండగా సబ్బని వెంకట్ చిన్నారుల ఆకలి తీర్చేందుకు జీవితకాల భరోసా



జమ్మికుంట నవంబర్ 27 (ప్రజావాణి) జమ్మికుంట పట్టణంలోని సేవ అంటే కేవలం మాటల్లో కాదు ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించడం లోనే నిజమైన మానవత్వం ఉందని చాటిచెప్పారు సబ్బనివెంకట్. జమ్మికుంట లోని సాయి మానసిక వికలాంగుల కేంద్రాన్ని సందర్శించిన సబ్బని వెంకట్ అక్కడి చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సదుపాయాలు పోషకాహారం భోజన వసతులపై కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి వివరాలుతెలుసుకున్నారుచిన్నారుల పరిస్థితులను తెలుసుకున్న ఆయన చలించిపోయారువారి ఆకలి తీర్చడం భోజన అవసరాలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తూతాను ప్రాణాలతో ఉన్నంతకాలం ప్రతి నెలా 50 కిలోల బియ్యం అందిస్తానని హామీ ఇచ్చారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుఈ చిన్నారులకు సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నేను ప్రాణాలతో ఉన్నంతకాలం వీరి భోజనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా నా వంతు సహకారం అందిస్తాను. వీరి ముఖాల్లో చిరునవ్వు చూడటమే నాకు నిజమైన సంతృప్తి అని భరోసా ఇచ్చారుసమాజంలో ఆపన్నులకు అండగా నిలవడం, అవసరంలో ఉన్నవారికి తోడుగా ఉండటమే నిజమైన మానవత్వమని తన సేవా దృక్పథంతో మరోసారి చాటిచెప్పారుసబ్బనివెంకట్.పేరు కోసం చేసే సేవ కాదు ఓ పూట అన్నం పెట్టి ఆకలి తీర్చే ఆత్మీయతే అసలైన మానవత్వం

ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలి

- కూలీలు సమయపాలన పాటించాలి.. ఏపీవో ధనుంజయ రాజు



చిన్నంబావి, ప్రజావాణి నవంబర్ 27 ఉపాధి హామీ కల్పించడమే వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ రామ్‌జీ) పథకం ప్రధాన లక్ష్యమని ఏపీవో ధనుంజయ రాజు పేర్కొన్నారు. శుక్రవారంచిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నిర్వహణ, కూలీల హాజరు, పని ప్రదేశంలో అమలు చేస్తున్న నిబంధనలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఏపీవోమాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని ప్రతి ఒక్కరూసద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కూలీలకుసూచించారు. పథకానికి సంబంధించి ఏవైనా సందేహాలు, సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. కూలీలు ప్రతిరోజూ నిర్ణీత సమయానికి పనులకు హాజరై సమయపాలన పాటించాలని, పని ప్రదేశంలోతప్పనిసరిగా ఫొటోలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటిఅవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కూలీలకు ఎలాంటి ఇబ్బందులుకలగకుండా చూడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా చాడ భాస్కర్ రెడ్డి నియామకం



తుర్కపల్లి మండల్ ప్రతినిధి ప్రజావాణి నవంబర్ 27.తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా చాడ భాస్కర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా దేవరుప్పుల ఐలయ్య నియమితులయ్యారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారి సహకారంతో, తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మరియు ఆర్ అండ్ బి, రోడ్లు – భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని చాడ భాస్కర్ రెడ్డి గారికి అందజేయడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారికి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అందరితో కలిసి పనిచేస్తానని, కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ నియామకం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ట్రూజూ చైర్మన్ ధనవత్ శంకర్ నాయక్ గారు ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, ట్రూజూ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లగొండ లో బీజేపీ బలోపేతం పై నేతల దృష్టి



నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి నల్లగొండలో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత నిర్మాణంపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సహ సంఘటన మంత్రి దశరథ్ జీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి తోటపల్లి రవి, జిల్లా ఇన్‌చార్జి ఉదయ ప్రతాప్ పాల్గొనగా, సమావేశానికి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని నేతలు పిలుపునిచ్చారు. గ్రామగ్రామాన పార్టీకి బలమైన పునాది వేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమష్టి కృషితో నల్లగొండ జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

వ్యక్తిగత కారణాలతో వివాహిత మహిళ ఆత్మహత్య

- కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న చిరాగ్ పల్లి పోలీసులు



జహీరాబాద్, నవంబర్ 27 (ప్రజావాణి): మండలంలోని చిరాగ్ పల్లి గ్రామా నివాసురాలు వివాహిత మహిళ జంగిలి శ్రీవాణి ఏ సుప్రియ భర్త కి.శే. జగన్నాథ్, వయ్యసు: 24 సం రాలు, వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జంగిలి శ్రీవాణి అలియాస్ సుప్రియ భర్త కి శే జగన్నాథ్, వయ్యసు: 24 సం రాలు, వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. మృతురాలి తల్లి ఏర్పుల ముత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి విచారణ ప్రారంభించినట్లు తెలిపినారు. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

రైతుల అవసరాల కోసం అచ్చు యంత్రం బహుకరణ

- వంగపల్లి గ్రామంలో సేవాభావంతో ముందడుగు



ప్రజావాణి నవంబర్ 27 కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామానికి చెందిన మోర్తాల మౌనకర్ తన తండ్రి మోర్తాల వెంకటేశ్వర రెడ్డి జ్ఞాపకార్థం రైతులకు ఉపయోగపడే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వంగపల్లి రైతు వేదికలో వినియోగించేందుకు అచ్చు యంత్రాన్ని బహుకరించారు ఈ యంత్రాన్ని ఏఈఓ జయప్రకాష్ రెడ్డికి అందజేశారుతన తండ్రి జ్ఞాపకార్థం రైతులకు ఉపయోగపడే విధంగా అచ్చు యంత్రాన్ని అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు రైతుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు

"శ్రీధర్-కవితల"కళ్యాణ రోజు స్వాములకు బిక్ష





ప్రజావాణి,ఇనుగుర్తి:మండల కేంద్రం ఇనుగుర్తి కి చెందిన వజనేపల్లి శ్రీధర్ కవిత దంపతుల మ్యారేజ్ డే పురస్కరించుకుని ఇనుగుర్తి,అయ్యగారి పల్లి గ్రామాలకు చెందిన 70 మంది అయ్యప్ప దీక్ష స్వాములకు శుక్రవారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మణికంఠ స్వామి ఆశీస్సులతో తమ కళ్యాణ రోజు అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురు స్వాములు జర్నలిస్ట్ గంజి వీరేందర్ రెడ్డి,లింగాల నరసయ్య, కమటం కృష్ణమూర్తి,సందీప్,మలిశెట్టి శోభన్, మట్టపల్లి అశోక్,శ్రీరామ్ శ్రీరాములు,బూర రాజేష్, నాళ్ల రఘువీర్ లతోపాటు పలువురు కత్తి,గదా తదితరస్వాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో హారిక కు రూ.10 లక్షల ఎల్ఓసి



ప్రజావాణి,నెల్లికుదురు: మండలంలోని రత్తిరాం తండా కు చెందిన గుగులోతు లే వెంకన్న తుప్సింగు కుమార్తె హారిక అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.స్థానిక కాంగ్రెస్ నాయకులు హారిక పరిస్థితిని మానుకోట ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక్ దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే బాధితురాలికి రూ.10లక్షల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే డా.మురళి నాయక్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో హారిక కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచి మెరుగైన చికిత్స అందించేందుకు తక్షణమే ఎల్ఓసి మంజూరు చేయించడంతో కుటుంబంతో పాటు రత్తిరామ్ తండా వాసులు ఎమ్మెల్యే మురళి నాయక్ కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నేత సత్యాపాల్ రెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు 637 క్యాండిల్స్‌తో భారీ క్యాండిల్ లైట్ ర్యాలీ

- బాలికల భవిష్యత్తుకు బాల్య వివాహాలు అడ్డంకి.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



ఆందోల్ । నవంబర్ 27 । మన ప్రజావాణి । జిల్లా ప్రతినిధి బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఆందోల్‌లో స్కోప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సహకారంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా 637 క్యాండిల్స్‌తో క్యాండిల్ లైట్ ర్యాలీ చేపట్టారు ఈ సందర్భంగా బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. బాలికలకు బాల్య వివాహాలు చేయడం వల్ల వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ప్రతి బాలికకు విద్యను అందించి, ఉన్నత లక్ష్యాలను సాధించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సవిత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సద్గుణ మేరి గ్రేస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని 637 క్యాండిల్స్‌తో ర్యాలీ నిర్వహించి బాల్య వివాహాల నిర్మూలనపై తమ సందేశాన్ని చాటారు.

కరువు ప్రభావిత పత్తి పొలాలను సందర్శించిన - జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్





నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వి. వినోద్ కుమార్ చండూరు మండలం, దోనిపాముల గ్రామంలో కరువు ప్రభావిత పత్తి పొలాలను సందర్శించారు. కరువు కారణంగా పంట నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఈ పర్యటన జరిగింది. అదేవిధంగా నీలకంఠం నరసింహకు చెందిన మినుములు, వేరుశనగ పొలాలను కూడా సందర్శించారు. వ్యవసాయ శాఖ ఎల్ నినో, పంటల వైవిధ్యీకరణ ప్రచారం కారణంగా ఆయన వరి పంటకు బదులుగా పప్పుధాన్యాలు, నూనె గింజల పంటల వైపు మళ్లారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి, ఇతర రైతులు కూడా ఆయనను అనుసరించాలని సూచించారు. ఆరుతడి పంటలు వేయడం వల్ల నీటి వాడకం తగ్గుతుందని, పప్పు ధాన్యాల వల్ల భూసారం పెరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి. వేణుగోపాల్ ఏడీఏ, పి. మల్లేష్ మండల వ్యవసాయ అధికారి, సంబంధిత ఏఈఓ లు పద్మజ & పవన్, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మండల మొదటి స్థానం సాధించిన సన్ షైన్ విద్యార్థులకు ఘన సన్మానం



నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి ఇటీవల చండూరు మండల స్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్ లో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి మొదటి స్థానం పొంది జిల్లాస్థాయి లో పాల్గొనడానికి అర్హత సాధించిన సన్ షైన్ హై స్కూల్ విద్యార్థులైన శ్రీనిధి, సిరి, శాశ్వత్ లను శుక్రవారం పాఠశాలలో కరస్పాండెంట్ కోడి వెంకన్న శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెకుముకి ప్రతిభ పరీక్ష యందు వరుసగా రెండో సంవత్సరం మొదటి స్థానం సంపాదించడం ద్వారా సన్ షైన్ విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలతో పాటు పాఠశాల పేరును కూడా ఉన్నత స్థాయిలో ఉంచారని అదేవిధంగా విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు రవికాంత్, వినయ్, ప్రవీణ్, ఆదిత్య, దేవేందర్, నాగమణి లను కోడి వెంకన్న అభినందించారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు ఇటువంటి పోటీ పరీక్షల యందు కూడా ప్రతిభ కనబరుస్తూ సమాజంలో జరిగే అన్ని రకాల విషయాలపై విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ముందుకు సాగడం ద్వారా భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించవచ్చు అని అన్నారు.

అంబులెన్స్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఈఎంఈ బి.రఘురాం

ప్రజా వాణి, వికారాబాద్ జిల్లా, నవంబర్27 :వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ పీహెచ్ సి పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ 108 అంబులెన్స్‌ను ఈఎంఈ బి. రఘురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో విధుల్లో ఉన్న ఈఏంటీ ఏ. తరుణ్, పైలట్ యూసుఫ్ సమక్షంలో అంబులెన్స్‌లోని అత్యవసర మందులు వైద్య పరికరాలు, రికార్డులు,వాహన పరిస్థితిని పరిశీలించారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు.



పలాస మున్సిపాలిటీ పరిధిలో

- ఎన్నికలు ముగిసిన తర్వాత పెరిగిన మద్యము ధరలు
- ఎన్నికల ముందు ఎమ్మార్పి ధరకు మద్యము అమ్మకాలు చేసిన ఎక్సక్లైజ్ శాఖ అధికారులు
- ఎన్నికలు ముగిశాక బాటిల్ లో పది రూపాయలు వరకు పెంచారు.
- ఆగ్రహము వ్యక్తము చేస్తున్న మద్యము ప్రియులు









పలాస ప్రజావాణి ప్రతినిధి శ్రీకాకుళం జిల్లాలోనీ పలాస మున్సిపాలిటీ పరిధిలోనీ మద్యము అధిక ధరలు అమ్మకాలు పై అధికారులు మౌనం ఎందుకో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు . ఎన్నికలు సందర్భంగా పెంచినా బాటిల్ పై అధిక ధరలు తగ్గించారు. తర్వాత ఎన్నికల ముందు పలాస మున్సిపాలిటీ పరిధిలో బాటిల్.మద్యము ధరలు ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మకాలు చేశారు. ఇటీవల వచ్చిన మున్సిపాలిటీ లో జరిగిన ఎన్నికల తర్వాత మళ్ళీ మద్యము వ్యాపారము అక్రమ అమ్మకాలు చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని మద్యము షాపులు ఏకమై నినందనకులుకు బిన్నంగా మద్యము అమ్మకాలు జరుగుతున్నాయని ఇక్కడ చర్చ జరుగుతుంది. ఇప్పటి కైన ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని మద్యము అమ్మకాలు నిబంధనలు అమలు చేయాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.

డీఎస్సీ--2002 హిందీ పండిట్ అభ్యర్థులకు ఎట్టకేలకు న్యాయం దక్కేనా?

- ఏడుగురి నియామకాలకు ప్రభుత్వ అనుమతి..
  తక్షణ చర్యలకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు
- హైకోర్టు తీర్పులు, ప్రభుత్వ ఉత్తర్వులు అమలులో జాప్యమెందుకు? నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని అభ్యర్థుల విజ్ఞప్తి

కరీంనగర్: దాదాపు రెండు దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న డీఎస్సీ--2002 హిందీ పండిట్ మెరిటోరియస్ అభ్యర్థులకు ఎట్టకేలకు న్యాయం జరిగే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. న్యాయస్థానాల ఆదేశాలు, అభ్యర్థుల నిరంతర పోరాటం నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఏడుగురు మెరిటోరియస్ అభ్యర్థులకు హిందీ పండిట్ పోస్టుల్లో నియామకాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. అయితే ప్రభుత్వ అనుమతి వచ్చినప్పటికీ నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థుల్లో ఆందోళన కొనసాగుతోంది.

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన జి.ఓ.ఆర్.టి.నెం.189, తేదీ 14-10-2026 ద్వారా ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. డీఎస్సీ--2002 కింద ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హిందీ భాషా పండిట్ పోస్టులకు సంబంధించి మెరిటోరియస్ అభ్యర్థుల నియామక అంశంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంది.

2008 సంవత్సరానికి సంబంధించిన డబ్ల్యూ.పి.నెం.25803తో పాటు సంబంధిత బ్యాచ్ కేసులు, 2010 నాటి డబ్ల్యూ.పి.నెం.22241, అలాగే 2025 నాటి డబ్ల్యూ.పి.నెం.39320లో 20-01-2026న వెలువడిన హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ కేసులకు సంబంధించిన గత న్యాయపరమైన పరిణామాలు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమర్పించిన నివేదికలు, అధికారుల నుంచి అందిన వివరాలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఏడుగురు అభ్యర్థుల నియామకానికి అనుమతి ఇచ్చింది.

నియామకానికి అనుమతి పొందిన ఏడుగురు అభ్యర్థులు

ప్రభుత్వ జి.ఓ.లో పేర్కొన్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి:

1. ఎస్.డి. ఖాజా మొహియుద్దీన్ -- హాల్‌టికెట్ నెం. 20390005
2. సర్దార్ అమోలక్ సింగ్ -- హాల్‌టికెట్ నెం. 20394537
3. ఎస్.డి. ముజాహిద్ -- హాల్‌టికెట్ నెం. 20394764
4. పోల్కం విద్య -- హాల్‌టికెట్ నెం. 20390289
5. నీరేటి శ్రీనివాస్ -- హాల్‌టికెట్ నెం. 20390533
6. గంభీరపేట శేఖర్ -- హాల్‌టికెట్ నెం. 20390339
7. మట్ల కుమార్ -- హాల్‌టికెట్ నెం. 20390799

వీరు డీఎస్సీ--2002 నోటిఫికేషన్‌లో నిర్దేశించిన అర్హతలు, విద్యార్హతలు, ఇతర నిబంధనలకు అనుగుణంగా ఉన్నారో లేదో సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతలను నిర్ధారించిన అనంతరం నియామక ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సంబంధిత ఖాళీలకు అనుగుణంగా ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. డీఈఓకు అత్యవసర ఆదేశాలు.. తక్షణమే నివేదిక సమర్పించాలని సూచన

ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ను అనుసరించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం కూడా చర్యలకు ఉపక్రమించింది. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం నుంచి 15-10-2026న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారికి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రొసీడింగ్స్ రెఫరెన్స్ నెం.71/=జ-1/2024లో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అవసరమైన చర్యలు వెంటనే చేపట్టి, తీసుకున్న చర్యలకు సంబంధించిన అనుసరణ నివేదికను (Compliance Report) ఎలాంటి జాప్యం లేకుండా కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని అత్యంత అత్యవసరమైనదిగా పరిగణించాలని కూడా స్పష్టంగా పేర్కొన్నారు.

అంతకుముందు 02-10-2026న ప్రభుత్వానికి పంపిన లేఖతో పాటు 14-10-2026న జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వులను కూడా ఈ ప్రొసీడింగ్స్‌లో ప్రస్తావించారు. తద్వారా అభ్యర్థుల నియామకఅంశం ప్రభుత్వ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల పరిశీలన,తదుపరి చర్యల దశకు చేరినట్లు స్పష్టమవుతోంది.

ఏళ్ల తరబడి నిరీక్షణ.. అభ్యర్థుల్లో ఇంకా వీడని ఆందోళన

డీఎస్సీ--2002లో మెరిట్ సాధించినప్పటికీ వివిధ న్యాయపరమైన, పరిపాలనా కారణాలతో నియామకాలకు దూరమైన అభ్యర్థులు సుదీర్ఘకాలంగా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించడం, ప్రభుత్వానికి పలుమార్లు వినతులు సమర్పించడం ద్వారా తమ హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తున్నారు.

ఇటీవల కూడా అభ్యర్థులు ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యను వివరించి, ప్రభుత్వ ఉత్తర్వుల అమలుకు సహకరించాలని కోరినట్లు ప్రచురితమైన వార్తలో పేర్కొన్నారు. ముఖ్యంగా నియామక ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించి తమకు న్యాయబద్ధంగా ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ అనుమతితోనే సమస్య పరిష్కారమైనట్లా?

ప్రభుత్వం ఏడుగురి నియామకాలకు అనుమతి ఇవ్వడం అభ్యర్థులకు ఆశాజనక పరిణామమే అయినప్పటికీ, కేవలం అనుమతి ఉత్తర్వులతోనే నియామక ప్రక్రియ పూర్తయినట్లు భావించలేం. అభ్యర్థుల అర్హతల నిర్ధారణ, సంబంధిత ఖాళీల పరిశీలన, నియామక ఉత్తర్వుల జారీ వంటి తదుపరి చర్యలు పూర్తికావాల్సి ఉంది.

ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు మరింత జాప్యం చేయకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. అర్హులైన అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా, న్యాయస్థానాల ఆదేశాలు మరియు ప్రభుత్వ ఉత్తర్వుల స్ఫూర్తిని గౌరవిస్తూ నియామకాలు చేపట్టాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను అభ్యర్థులు కోరుతున్నారు.

ఇరవై ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలికేది ఎప్పుడు?

ఒకవైపు న్యాయం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అభ్యర్థులు.. మరోవైపు వారి నియామకాలకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు.. ఇంకోవైపు తక్షణ చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ కార్యాలయం ఇచ్చిన అత్యవసర ఆదేశాలు.. ఈ పరిణామాలన్నీ పరిశీలిస్తే ఇప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారుల తదుపరి చర్యలపైనే అభ్యర్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హతల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేసి నియామక ప్రక్రియకు ముగింపు పలకాలని, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న డీఎస్సీ--2002 హిందీ పండిట్ మెరిటోరియస్ అభ్యర్థులకు న్యాయం చేయాలని విద్యావర్గాలు కోరుతున్నాయి.


GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Establishment - School Education Department - DSC-2002 - Appointment of seven (07) meritorious candidates for the posts of Language Pandit (Hindi) in erstwhile Karimnagar District under DSC-2002, in compliance with the orders of the Hon'ble High Court in W.P.No.25803 of 2008 & batch and W.P.No.22241 of 2010, Dt.08.04.2024 and W.P.No.39320 of 2025, dated:20.01.2026 - Permission - Accorded - Orders - Issued.

SCHOOL EDUCATION (SER.II) DEPARTMENT

G.O.Rt.No.189 Dated: 14.10.2026
Read:

From the DSE, Hyderabad, Letter Rc.No.71/RC-1/2024, Dated:28.02.2025, 09.05.2025, 29.07.2026 and 25.08.2026

ORDER:

In the circumstances reported by the Director of School Education, Telangana, Hyderabad vide reference read above, and after careful examination of the matter, Government hereby accord permission for appointment of the following seven (07) meritorious candidates, who fall within the zone of consideration for the posts of Language Pandit (Hindi) in erstwhile Karimnagar District under DSC-2002 against the existing vacancies, in compliance with the orders of the Hon'ble High Court in W.P.No.25803 of 2008 & batch and W.P.No. 22241 of 2010, Dt.08.04.2024and W.P.No.39320 of 2025, dated:20.01.2026, subject to verification and confirmation of the eligibility of each of the seven (07) candidates strictly in accordance with the eligibility criteria, qualifications and other conditions prescribed in the DSC- 2002 notification.

Sl. No.	Name	H.T.No.
1	Sri Sd.Khaja Mohiuddin	20390005
2	Sri Sardar Amolok Singh	20394537
3	Sri Sd. Muzahid	20394764
4	Smt Polkam Vidya	20390289
5	Sri Neereti Srinivas	20390533
6	Sri Gambiraopet Shekar	20390339
7	Sri Matla Kumar	20390799

2. The Director of School Education, Telangana, Hyderabad shall take necessary further action in the matter, accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

Dr.YOGITA RANA
SECRETARY TO GOVERNMENT

To
The Director of School Education, Telangana, Hyderabad
Copy to:
The Director of Treasuries & Accounts, Telangana State, Hyderabad.
The Pay and Accounts Officer, Hyderabad.
The Finance (EBS.IV) Department, Dr.B.R.Ambedkar Telangana Secretariat, Hyderabad.
SC/SF.

//FORWARDED : BY ORDER//

SECTION OFFICER


-2-

18. This office Lr.No.71/RC-1/2024, Dt.02.10.2026 addressed to Govt.
19. G.O.Rt.No.189 School Education (Ser.II) Department, Dated 14.10.2026.

@@@@@@@@

While communicating a copy of the Government orders received in the reference 19th read above, the Erstwhile District Educational Officer, Karimnagar is requested to take necessary action in the matter as directed by the Government and submit compliance report to this office immediately without fail.

This should be treated as MOST URGENT.

Encl: As above.

for Director, School Education

To:
The Erstwhile District Educational Officer, Karimnagar.
Copy submitted to the Secretary to Government, School Education Department, Government of Telangana, Hyderabad for favour of information.
Copy to the Government Pleader for Services-I, High Court Buildings, Telangana, Hyderabad.
Copy to the LMC Section of this office for favour of information.


Contempt Case//
Most Urgent//

PROCEEDINGS OF THE DIRECTOR, SCHOOL EDUCATION, TELANGANA :: HYDERABAD

Rc.No.71/RC-1/2024 Dated:15.10.2026.

Sub:- School Education Department - DSC-2002 - Appointment of (07) meritorious candidates for the posts of Language Pandit (Hindi) in erstwhile Karimnagar District under DSC-2002, in compliance with the orders of the Hon'ble High Court in W.P.No.25803 of 2008 & batch and W.P.No.22241 of 2010, Dt.08.04.2024 and W.P.No.39320 of 2025, dated:20.01.2026 - Permission accorded - Government orders communicated - Reg

Read:
1. The Hon'ble Division Bench of the Hon'ble High Court common orders Dt.08.04.2024 in W.P.Nos. 25803, 23454, 25794, 26327 of 2008 and 22241 of 2010 filed by Smt. Y.Andalu, W/o. Rami Reddy SGT O/o P S Kalvacherla Karimnagar District and others.
2. Representation Dt:26.06.2024 of Sri. Naini Prabhakar, S/o. Hanumathu and (04) others.
3. Representations Dt:12.06.2024 & Dt.24.06.2024 of Sri. Mohd Hussain and others.
4. This office Proc.Rc.No.71/RC-1/2024, Dt.05.07.2024.
5. Lr.No.182/A5/2024, Dt.01.10.2024 of the DEO, Karimnagar.
6. This office Proc.Rc.No.71/RC-1/2024, Dt.09.10.2024.
7. Lr.No.182/A5/2024, Dt.29.12.2024 of the DEO, Karimnagar.
8. This office Lr.Rc.No.71/RC-1/202, Dt.28.02.2025 addressed to Government.
9. Govt. Memo.No.1688/Ser II/A1/2025, Dt.19.04.2025.
10. This office Lr.Rc.No.71/RC-1/202, Dt.09.05.2025 addressed to Government.
11. The Hon'ble High Court orders Dt.20.01.2026 in W.P.No.39320 of 2025 filed by Sri. Matla Kumar and (03) others.
12. C.C.No.1757 of 2026 in W.P.No.39320 of 2025 filed by Sri. Matla Kumar and (03) others.
13. This office Lr.Rc.No.71/RC-1/2024, Dt.29.07.2026 addressed to Government.
14. Govt.Memo.No.1688/Ser II/A1/2025, Dt.24.08.2026.
15. Information obtained from the DEO, Karimnagar through whatsapp Dated 24.08.2026.
16. This office Lr.Rc.No.71/RC-1/2024, Dt. 25.08.2026 addressed to Government.
17. Lr.No.C.C.No.625/2025/Services.I/HC, Dt.23.09.2026 of the Government Pleader for Services.I, Hon'ble High Court Buildings, Telangana, Hyderabad.

ఎన్నికల వేళ.. అక్రమ మద్యం పట్టివేత !

- హెచ్.మురవాణి శివారులో నాలుగు సంచుల కర్ణాటక మద్యం స్వాధీనం
- విలువ రూ.1.05 లక్షలు..
  గ్రామాల్లో పోలీసుల ప్రత్యేక నిఘా

పెద్దకడబూరు:నవంబర్ 28 ప్రజావాణి స్థానిక గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని హెచ్.మురవాణి గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను శుక్రవారం సీఐ మంజునాథ్, ఎస్ఐ మారుతి వెల్లడించారు.తెలిపిన వివరాల మేరకు.. గురువారం గ్రామస్తుల నుంచి అందిన విశ్వసనీయ సమాచారంతో గ్రామ శివారులోని నల్లనయ్య కొండ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు.



పోలీసుల రాకను గమనించిన బోయ ఆంజనేయులు తన వద్ద ఉన్న నాలుగు సంచుల కర్ణాటక మద్యాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. వాటిని పరిశీలించగా ఒక్కో సంచిలో ఐదు బాక్సుల చొప్పున టెట్రా మద్యం ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.1,05,000 ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల వేళ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, నిల్వ చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ, ఎస్ఐ హెచ్చరించారు. మద్యం సేవించి గొడవలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చట్టం ముందు ఎవరూ అతీతులు కారని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ చంద్ర, రామయ్య, శరణప్పగౌడ్, గోపాల్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ.. దీక్ష నియమాలపై అవగాహన

- మాలధారణ కార్యక్రమంలో పాల్గొన్న గురుస్వాములు, భక్తులు

తుర్కపల్లి, మండల్ నవంబర్ 27 (మన ప్రజావాణి): తుర్కపల్లి మండల కేంద్రంలోని అయ్యప్ప కొండపై శుక్రవారం అయ్యప్ప స్వాముల మాలధారణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా తిప్పారం నగేష్ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, దీక్షలో ఉండే స్వాములు ఆచరించాల్సిన విధులు, పూజా విధానాలు, నిత్య జీవితంలో పాటించాల్సిన నియమాల గురించి కన్యస్వాములకు, ఇతర స్వాములకు వివరించారు. అయ్యప్ప దీక్షను భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఆచరించి స్వామివారి అనుగ్రహం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తిప్పారం బ్రహ్మచారి గురుస్వామి,



బోయిన కుమార్ గురుస్వామి, సిద్ధయ్య స్వామి, రాజు నాయక్ స్వామి, జి. రాజు స్వామి, శ్రీనివాస్ స్వామి, వినోద్ స్వామి, కార్తీక్ స్వామి, శివ కన్నె స్వామి, రవి కన్నె స్వామి, రామచంద్రయ్య కన్నె స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అకాలీదళ్‌తో దోస్తీ.. కమలం వికసించేనా?

● పంజాబ్‌లో పట్టు పెంచుకునేందుకు బీజేపీ వ్యూహం.. ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ జతకట్టిన పాత మిత్రులు.. ఓట్ల బదిలీ, రైతుల విశ్వాసమే కూటమికి అసలైన పరీక్ష!



దేశ రాజకీయాల్లో ఎన్నికల సమీకరణాలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. అధికారమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఒకప్పుడు మిత్రులుగా ఉన్న పార్టీలు అవసరాన్ని బట్టి విడిపోవడం, తిరిగి కలవడం సాధారణ రాజకీయ పరిణామంగా మారింది. తాజాగా పంజాబ్ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), శిరోమణి అకాలీదళ్ మళ్లీ చేతులు కలపడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత ఈ రెండు పార్టీలు తిరిగి కూటమిగా ఏర్పడటం 2027లో జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపనుంది. అయితే ఈ పొత్తుతో కమలం వికసిస్తుందా? అకాలీదళ్ పూర్వ వైభవాన్ని సాధిస్తుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. **మూడు దశాబ్దాల అనుబంధం.. ఆరేళ్ల ఎడబాటు** బీజేపీ, అకాలీదళ్ మధ్య రాజకీయ అనుబంధం దశాబ్దాలుగా కొనసాగింది. 1990వ దశకం నుంచి ఈ రెండు పార్టీలు కలిసి పంజాబ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాయి. గ్రామీణ ప్రాంతాల్లో అకాలీదళ్‌కు ఉన్న పట్టును, పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి ఉన్న మద్దతును సమన్వయం చేసుకుంటూ ఎన్నికల్లో విజయాలు సాధించాయి. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో 2020లో అకాలీదళ్ ఎన్డీఏ కూటమి నుంచి బయటకు వచ్చింది. దీంతో రెండు పార్టీల మధ్య దశాబ్దాల అనుబంధానికి విరామం ఏర్పడింది. అప్పటి నుంచి విడివిడిగా రాజకీయ ప్రయాణం సాగించిన ఈ పార్టీలు ఇప్పుడు తిరిగి ఒక్కటయ్యాయి. **అధికారమే లక్ష్యంగా కొత్త రాజకీయ వ్యూహం** 2027 అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్‌లో అధికారాన్ని దక్కించుకోవాలన్న లక్ష్యంతో బీజేపీ, అకాలీదళ్ పునరేకీకరణకు సిద్ధమయ్యాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో ఈ కూటమి ప్రకటన వెలువడింది. అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో కలిసి బీజేపీ నాయకత్వం కొత్త రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. కూటమిలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషిస్తుందని, ముఖ్యమంత్రి పదవి కూడా పెద్ద పార్టీకి దక్కుతుందని అమిత్ షా ప్రకటించడం గమనార్హం. దీనితో అకాలీదళ్ శ్రేణుల్లో కొంత ఉత్సాహం కనిపించే అవకాశం ఉంది. మరోవైపు పంజాబ్‌లో స్వతంత్రంగా బలపడేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీకి అకాలీదళ్ గ్రామీణ ఓటు బ్యాంకు ఉపయోగపడుతుందన్న అంచనాలున్నాయి. **రెండు పార్టీలకు పరస్పర అవసరం** గత ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే రెండు పార్టీల బలహీనతలు స్పష్టమవుతున్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఘన విజయం సాధించి 92 స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 18 స్థానాలకు పరిమితమైంది. అకాలీదళ్ కేవలం మూడు స్థానాలతో సరిపెట్టుకోగా, బీజేపీ రెండు స్థానాలకే పరిమితమైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ అకాలీదళ్ ఒక స్థానంతో, బీజేపీ సున్నా స్థానాలతో వెనుకబడింది. ఈ పరిస్థితుల్లో విడివిడిగా పోటీ చేస్తే మరింత నష్టపోయే ప్రమాదం ఉందని రెండు పార్టీలు భావించినట్లు కనిపిస్తోంది. అందుకే పరస్పర బలాలను ఉపయోగించుకొని రాజకీయంగా పుంజుకోవాలని నిర్ణయించుకున్నాయి. అయితే కూటమి ఏర్పడినంత మాత్రాన ఓట్లు బదిలీ అవుతాయన్న హామీ లేదు.

రైతుల ఆగ్రహం.. బీజేపీకి ప్రధాన సవాలు

పంజాబ్ రాజకీయాల్లో రైతుల సమస్యలు అత్యంత కీలకమైనవి. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న ఈ రాష్ట్రంలో రైతుల అభిప్రాయాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం బీజేపీపై కొంతమంది రైతుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ఆ సమయంలో రైతుల పక్షాన నిలుస్తూ అకాలీదళ్ ఎన్డీఏ నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు అదే పార్టీ మళ్లీ బీజేపీతో చేతులు కలపడం రైతుల్లో ఎలాంటి స్పందన కలిగిస్తుందన్నది కీలకం. గతంలో రైతుల ఉద్యమానికి మద్దతు తెలిపిన అకాలీదళ్ ఇప్పుడు బీజేపీతో కలిసి ప్రచారం చేస్తే ప్రజలు ఎలా స్వీకరిస్తారో చూడాలి. రైతుల విశ్వాసాన్ని తిరిగి పొందకుండా కూటమి విజయం సాధించడం అంత సులభం కాదు. **సీట్ల పంపకాలే తొలి పరీక్ష** కూటమి ప్రకటించడం ఒక ఎత్తయితే, సీట్ల పంపకం మరో ఎత్తు. గతంలో అకాలీదళ్ ఎక్కువ స్థానాల్లో పోటీ చేయగా, బీజేపీ పరిమిత స్థానాల్లో బరిలోకి దిగేది. ప్రస్తుతం రెండు పార్టీల రాజకీయ బలాబలాల్లో మార్పులు వచ్చాయి. బీజేపీ తన ఓటు శాతాన్ని పెంచుకోవడంతో ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని ఆశించే అవకాశం ఉంది. మరోవైపు అకాలీదళ్ తన సంప్రదాయ ఆధిపత్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉంటుందా అన్నది ప్రశ్న. ముఖ్యమంత్రి పదవి విషయంలో అకాలీదళ్‌కు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించినప్పటికీ, నియోజకవర్గాల కేటాయింపులో ఇరు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరడం అవసరం. సీట్ల పంపకంలో అసంతృప్తి ఏర్పడితే కూటమి ఐక్యతకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. **ఆప్, కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం అంత సులభం కాదు**

పంజాబ్‌లో ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉండగా, కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతోంది. ఈ రెండు పార్టీలకు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పునాది ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆప్ తన పట్టును నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ కూడా అధికారాన్ని తిరిగి దక్కించుకునేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఈ పరిస్థితుల్లో బీజేపీ, అకాలీదళ్ కూటమి కొత్త రాజకీయ శక్తిగా ఎదగాలంటే కేవలం పొత్తు ప్రకటనలు సరిపోవు. ప్రజల సమస్యలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. నిరుద్యోగం, మాదకద్రవ్యాల వ్యాప్తి, రైతుల సమస్యలు, యువత భవిష్యత్తు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై విశ్వసనీయమైన కార్యాచరణను ప్రజల ముందుంచాలి. కేవలం ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేయడం ద్వారా ప్రజల మద్దతు పొందలేరు.

సిక్కు ఓటర్ల విశ్వాసం కీలకం

పంజాబ్ రాజకీయాల్లో సిక్కు సమాజం, మతపరమైన అంశాలు, ప్రాంతీయ ఆత్మగౌరవం కీలక పాత్ర పోషిస్తాయి. అకాలీదళ్‌కు సంప్రదాయంగా సిక్కు సమాజంలో ఒక రాజకీయ పునాది ఉంది. బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో హిందూ ఓటర్ల మద్దతు ఉంది. గతంలో ఈ రెండు వర్గాల ఓట్లను సమన్వయం చేసుకోవడంలో కూటమి కొంతవరకు విజయవంతమైంది. అయితే ప్రస్తుత పరిస్థితులు గతానికి భిన్నంగా ఉన్నాయి. సిక్కు రాజకీయ ఖైదీల విడుదల, పంజాబ్ హక్కులు, రాష్ట్ర ప్రయోజనాలు వంటి అంశాలపై అకాలీదళ్ తన వైఖరిని స్పష్టం చేయాల్సి ఉంటుంది. మరోవైపు బీజేపీపై ఉన్న కొన్ని వర్గాల అసంతృప్తిని తొలగించుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం నాయకుల స్థాయిలో కుదిరిన ఒప్పందం క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతుగా మారుతుందా అన్నదే అసలు ప్రశ్న.

మహిళలపై హింసకు అడ్డుకట్ట ఎప్పుడు?

ఆడపిల్లల భద్రతకు భరోసా ఏదీ? చట్టాలు కఠినతరం కావాలి.. నేరస్థులకు శిక్షలు వేగంగా పడాలి.. సమాజంలో మార్పు రావాలి!



మహిళలు, బాలికలపై రోజురోజుకూ పెరుగుతున్న హింసాత్మక ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. మహిళలకు సమాన హక్కులు కల్పించామని, ఆడపిల్లల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని పాలకులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వారి భద్రత ప్రశ్నార్థకంగానే మిగులుతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆడపిల్ల క్షేమంగా తిరిగి వస్తుందో లేదోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంటోంది. విద్యాసంస్థలు, పని ప్రదేశాలు, ప్రయాణ మార్గాలు, చివరకు ఇళ్లలోనూ మహిళలకు రక్షణ లేకపోవడం ఆందోళన కలిగించే పరిణామం. మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, హత్యలు వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా వాటిని పూర్తిస్థాయిలో అరికట్టలేకపోవడం పాలనా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. **మారుతున్న కాలం.. మారని పురుషాధిక్య భావజాలం** సమాజం ఆధునికత వైపు పరుగులు తీస్తున్నా మహిళల పట్ల కొందరి ఆలోచనా విధానంలో మాత్రం మార్పు రావడం లేదు. మహిళలను సమాన హక్కులు కలిగిన వ్యక్తులుగా చూడకుండా తమ ఆధీనంలో ఉండాల్సిన వారిగా భావించే పురుషాధిక్య ధోరణి అనేక సమస్యలకు మూలంగా మారుతోంది. మహిళల దుస్తులు, నడవడిక, వ్యక్తిగత స్వేచ్ఛపై వ్యాఖ్యలు చేస్తూ వేధింపులకు పాల్పడటం, ప్రేమ పేరుతో వెంటపడటం, తిరస్కరిస్తే దాడులకు దిగడం వంటి ఘటనలు మానవత్వానికే మచ్చగా నిలుస్తున్నాయి. మహిళల స్వేచ్ఛను నియంత్రించడం పరిష్కారం కాదు. మహిళలను గౌరవించే సంస్కృతిని పెంపొందించడమే అసలైన పరిష్కారం. **బాలికలపై దాడులు మరింత ఆందోళనకరం** మహిళలపై హింసతో పాటు చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులు చోటుచేసుకోవడం అత్యంత విషాదకరం. అభం శుభం తెలియని చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు సమాజంలోని విలువలు ఎంతగా దిగజారుతున్నాయో తెలియజేస్తున్నాయి. బాలికలకు కుటుంబ సభ్యులే తొలి రక్షణ కవచంగా ఉండాలి. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వయసుకు తగిన అవగాహన కల్పించాలి. ఏదైనా వేధింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పే ధైర్యాన్ని కల్పించాలి. బాలికల భద్రత విషయంలో కుటుంబాలు, విద్యాసంస్థలు నిర్లక్ష్యం చేయకూడదు. **చట్టాలున్నా.. అమలులోనే అసలు సమస్య** మహిళల రక్షణ కోసం దేశంలో అనేక చట్టాలు అమలులో ఉన్నాయి. అత్యాచారాలు, గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, బాలికలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ నేరాల సంఖ్య తగ్గకపోవడానికి చట్టాల అమలులో ఉన్న లోపాలు, కేసుల విచారణలో జాప్యం, బాధితులకు సకాలంలో న్యాయం అందకపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. నేరం చేసిన వ్యక్తి ఎంతటి పలుకుబడి కలిగినవాడైనా చట్టం ముందు సమానంగా నిలబెట్టాలి. రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక ప్రభావాలకు తావులేకుండా దర్యాప్తు జరగాలి. బాధితులు పోలీస్ స్టేషన్లకు వెళ్లినప్పుడు వారితో గౌరవంగా వ్యవహరించాలి. ఫిర్యాదులను స్వీకరించడంలో నిర్లక్ష్యం చూపే అధికారులపై చర్యలు తీసుకోవాలి. **సత్వర న్యాయం.. నేరస్థుల్లో భయం** మహిళలపై నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడంతోనే ప్రభుత్వ బాధ్యత పూర్తికాదు. నిష్పక్షపాత దర్యాప్తు జరిపి, సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి, న్యాయస్థానాల్లో కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఏళ్ల తరబడి కేసులు కొనసాగడం వల్ల బాధితులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాక్షులను బెదిరించడం, బాధితులపై ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలను అరికట్టాలి. బాధితులకు ఉచిత న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక కౌన్సెలింగ్, పునరావాస సదుపాయాలు కల్పించాలి. నేరస్థులకు శిక్ష పడుతుందనే నమ్మకం సమాజంలో ఏర్పడినప్పుడే నేర ప్రవృత్తికి అడ్డుకట్ట పడుతుంది. **మహిళల భద్రతకు ప్రభుత్వాల బాధ్యత** మహిళల రక్షణ విషయంలో ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం కాకుండా కార్యాచరణకు ప్రాధాన్యత ఇవ్వాలి. పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు పెంచాలి. వీధి దీపాలు, సీసీ కెమెరాలు, అత్యవసర సహాయ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలి. షీ టీమ్స్ వంటి ప్రత్యేక విభాగాలను మరింత సమర్థవంతంగా పనిచేసేలా చూడాలి. మహిళలు తమకు ఎదురైన వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేసే వాతావరణాన్ని కల్పించాలి. **విద్యతో పాటు సంస్కారానికి ప్రాధాన్యం** మహిళలపై హింసను కేవలం పోలీసు చర్యలతోనే పూర్తిగా నిర్మూలించలేం. ఇందుకు సమాజంలో ఆలోచనా విధానంలో మార్పు రావాలి. బాలురకు చిన్నతనం నుంచే మహిళలను గౌరవించడం, వారి అభిప్రాయాలను గుర్తించడం, సమానత్వాన్ని పాటించడం నేర్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో లింగ సమానత్వం, వ్యక్తిగత గౌరవం, మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సినిమాలు, సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రచార మాధ్యమాల్లో మహిళలను కించపరిచే ధోరణులకు స్వస్తి చెప్పాలి. మహిళలపై వేధింపులను వినోదంగా భావించే మనస్తత్వాన్ని మార్చాలి. కుటుంబాల్లోనూ ఆడపిల్ల, మగపిల్ల అనే వివక్ష లేకుండా సమాన అవకాశాలు కల్పించాలి. **సామాజిక మాధ్యమాల వేధింపులపైనా నిఘా** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ మహిళలపై వేధింపులు కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, మార్ఫింగ్ చిత్రాలను ప్రచారం చేయడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటి సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. ఇలాంటి నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. సైబర్ నేర విభాగాలను బలోపేతం చేసి బాధ్యులను త్వరగా గుర్తించి చర్యలు తీసుకోవాలి. బాధిత మహిళల వ్యక్తిగత వివరాలు, గోప్యతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల వినియోగంపై కూడా ప్రజల్లో అవగాహన పెంచాలి. **మహిళల స్వేచ్ఛకు భద్రతే పునాది** మహిళలు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం, వ్యాపారాలు నిర్వహించడం, రాజకీయాల్లో పాల్గొనడం, తమకు నచ్చిన రంగాల్లో ఎదగడం వారి హక్కు. అయితే భద్రత పేరుతో మహిళల స్వేచ్ఛపై ఆంక్షలు విధించడం సరైన విధానం కాదు. రాత్రి వేళ బయటకు వెళ్లవద్దని, ఒంటరిగా ప్రయాణించవద్దని మహిళలకే ఆంక్షలు విధించే బదులు వారిని వేధించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజంలో మహిళలు భయం లేకుండా జీవించే పరిస్థితులు కల్పించాలి. మహిళల భద్రత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదు. నిరంతరం కొనసాగాల్సిన సామాజిక బాధ్యత. మహిళలపై హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ, విద్యాసంస్థలు, కుటుంబాలు, పౌర సమాజం సమష్టిగా పనిచేయాలి. ప్రతి మహిళకు గౌరవం, ప్రతి బాలికకు భద్రత, ప్రతి బాధితురాలికి న్యాయం అందినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. మహిళలను గౌరవించే సమాజమే అభివృద్ధి చెందిన సమాజం. ఆడపిల్లల భద్రతపై మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చూపించాలి. మహిళలపై హింసకు చరమగీతం పాడే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. అప్పుడే భయంలేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

ఎన్ని అరాచకాలు చేసినా.. ప్రజాతీర్పును అడ్డుకోలేకపోయారు

- **రిగ్గింగ్‌లు, బెదిరింపులు, అధికార దుర్వినియోగాన్ని దాటుకుని 43 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ విజయం**
- **30 గ్రామాలు తిరిగినా పరిటాల సునీతకు దక్కని 50 శాతం విజయం.. ఒక్క ఊరికీ వెళ్లని ప్రకాష్‌రెడ్డికి కార్యకర్తలే బలం**
- **టీడీపీ గెలిచామని చెప్పుకుంటున్న 47 స్థానాల్లో అక్రమాలున్నాయి.. డిక్లరేషన్ పొందినవి 33 మాత్రమే**
- **రిగ్గింగ్‌లు, సైక్లింగ్‌లు, బెదిరింపులు.. అన్నింటినీ ఎదుర్కొని 43 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ జయకేతనం**
- **మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**



అనంత పురం బ్యూరో నవంబర్ 27 ప్రజా వాణి

'రాప్తాడు నియోజకవర్గంలోని 96 పంచాయతీల్లో రెండింటిని అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏకగ్రీవం చేసుకోగా, మిగిలిన 94 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. టీడీపీ రెబల్స్ ఆరు చోట్ల విజయం సాధించగా, మరో 12 చోట్ల టీడీపీ మద్దతుదారులు రిగ్గింగ్‌ల ద్వారా గెలిచారు. ఇన్ని అడ్డంకులు, అక్రమాలను ఎదుర్కొని వైఎస్సార్‌సీపీ పోరాడి 43 పంచాయతీలను గెలుచుకుంది. టీడీపీ మద్దతుదారులు డిక్లరేషన్ తీసుకున్నవి 33 పంచాయతీలే. మీరు పోరాడినా, రిగ్గింగ్ చేసుకున్నా, స్ట్రూటినీలో మేనేజ్ చేసినా, మందీమార్బలంతో నామినేషన్లు అడ్డుకున్నా, ఏకగ్రీవం చేసుకున్నా.. మీరు గెలిచామని చెప్పుకుంటున్న స్థానాలు 47 మాత్రమే" అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకాష్ రెడ్డి

మాట్లాడారు.ప్రకాష్‌రెడ్డి ప్రచారానికి వెళ్లకున్నా.. కార్యకర్తలే గెలిపించారు.

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనే నేను ఒక్క ఊరికీ ప్రచారానికి పోలేదు. ఇది ఖచ్చితంగా కార్యకర్తల విజయం. ప్రజలు జగనన్నకు పట్టం కట్టిన విజయం. పరిటాల సునీత సుమారు 30 గ్రామాలకు హడావుడిగా అధికారులను తీసుకెళ్లి, పాత అబద్ధాలు కొన్ని, కొత్త అబద్ధాలు కొన్ని చెబుతూ తన కార్యకర్తలను మళ్లీ మోసం చేశారు. ఎన్ని గ్రామాలు తిరిగినా, అధికారాన్ని ఉపయోగించి మమ్మల్ని ఎంత ఇబ్బంది పెట్టినా కనీసం 50 శాతం కూడా గెలవలేకపోయారు. పరిటాల సునీత పదేపదే గ్రామాల్లో తిరిగి ప్రచారం చేసి ఓట్లు అడిగినా, ప్రకాష్‌రెడ్డి ఒక్క ఊరికీ వెళ్లకపోయినా ప్రజలు వైఎస్సార్‌సీపీకే అండగా నిలిచారు. కొండాపురంలో ఉదయం 11 గంటలకే రిగ్గింగ్.. పేరూరులో హైకోర్టు ఆర్డర్ ఉన్నా సైక్లింగ్.

రామగిరి మండలం కొండాపురంలో ఉదయం 11 గంటలకే రిగ్గింగ్ మొదలైంది. ఎంసీ పల్లిలో సైలెంట్ సైక్లింగ్ చేశారు. హైకోర్టు ఆర్డర్ ఉన్నా పేరూరు పంచాయతీలో సైక్లింగ్‌కు పాల్పడ్డారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరకు వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థే విజయం సాధించారు. మాదాపురం, నసనకోట గ్రామాల నుంచి జనాలను తీసుకెళ్లి రిగ్గింగ్ చేసుకున్నారు. రిగ్గింగ్‌ను అడ్డుకున్న పోలీసులపైనే దాడులు.. ఎస్పీపై రాళ్ల దాడి.కనగానపల్లి మండలం రాంపురంలో రిగ్గింగ్ జరిగింది. దాన్ని అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. మహిళలపై దాడులను సీఐ శేఖర్ అడ్డుకోగా ఆయనపైనే తిరగబడ్డారు. పరిస్థితి అదుపుతప్పుతోందని ఎస్పీ అక్కడికి వస్తే ఆయనపైనా రాళ్ల దాడి చేశారు. రిగ్గింగ్‌ను అడ్డుకున్నందుకు సీఐ శేఖర్‌ను మా పార్టీకి అంటగట్టారు. కోనాపురం, నరసంపల్లి, పాతపాళ్యం, తగరకుంట, దాదులూరు లోనూ రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. చుట్టుపక్కల గ్రామాల్లో రిగ్గింగ్ చేసుకుని, కనగానపల్లిలో అడ్డుకోవడంతో సీఐ శేఖర్‌కు వ్యతిరేకంగా డౌన్‌డౌన్ నినాదాలు చేశారు.పరిటాల సునీత ఏమి చెబితే అదే చేసే డీఎస్పీ.. ముందే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

ధర్మవరం డీఎస్పీ వచ్చి రౌండ్ వేసుకుని వెళ్లిపోతారు. ఆ తర్వాత టీడీపీ వాళ్లు రిగ్గింగ్ చేసుకుంటారు. గతంలోనే ఈ డీఎస్పీ వ్యవహారంపై స్వయంగా ఎస్పీకి వివరించాం. పరిటాల సునీత ఏమి చెబితే అది చేస్తారని చెప్పాం. శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందని హెచ్చరించినా ఎస్పీ వినలేదు. ఈరోజు అదే పరిస్థితి నెలకొంది.మహిళా అభ్యర్థిపై పోలీసుల ఎదుటే అసభ్య దూషణలు.. కన్నీళ్లు ఆపుకోలేని బాధితురాలు.చెన్నేకొత్తపల్లిలో సైక్లింగ్, న్యామద్దెలలో అధికారులను భయభ్రాంతులకు గురిచేసి ఏజెంట్లను బయటకు లాగి రిగ్గింగ్ చేశారు. అయినా మేమే గెలిచాం. మేము బీటెక్ చదివిన విద్యావంతురాలిని అభ్యర్థిగా నిలబెడితే, పోలీసుల ఎదుటే అత్యంత జుగుప్సాకరంగా ఆమెను దూషించారు. నోరు మూసుకుని పక్కన కూర్చోకపోతే మేమింతమంది ఉన్నాం, ఏమి చేస్తామో చూస్తావా అంటూ చెప్పరాని భాషలో తిట్టారు. సిగ్గులేదా మీకు? ఒక సర్పంచ్ స్థానం గెలిస్తే ఏమైనా కిరీటాలు పెడతారా? మీ ఇంట్లో మహిళలను అలాంటి బూతులతో తిడితే మీరు నిద్రపోతారా? మేం పదిమంది ఉన్నాం, ఏమైనా చేస్తామంటారా? ఇదే విషయాన్ని ఎస్పీకి ఫిర్యాదు చేశాం.మన ఇళ్లల్లో ఆడపిల్లలను రాజకీయాల్లోకి తీసుకురావాలంటే భయపడే పరిస్థితి ఉంది. బాధిత అమ్మాయి ఏడుపు ఆపడం లేదు. మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మహిళలను ఇంత దారుణంగా దూషిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి? బి.యాలేరులో పోలీసులే మా పార్టీ వారిని కొట్టారు.

ప్రభుత్వం ఉంటే మీ నాయన జాగీరా?.. కౌంటింగ్‌లోనూ చీకటి రాజకీయాలు.ఓడిపోయే పరిస్థితి ఉంటే కౌంటింగ్ ఆలస్యం చేయడం, చీకటిపడేదాకా ఉంచడం, లైట్లు ఆపేయడం, డీపీలు వద్ద మనుషులను పెట్టి విద్యుత్ నిలిపివేయించడం, చీకట్లో కట్టలు మార్చి లైట్లు వేసి డిక్లరేషన్ ఇచ్చుకోవడం.. ఇవన్నీ సిగ్గులేని పనులు కావా? రెండున్నరేళ్ల పాలన పూర్తిగా విఫలమైందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి? మంచి చేసి ఓట్లు వేయించుకోండి. బెదిరింపులకు పాల్పడితే మళ్లీ గెలుస్తారా? ఈ అరాచకాల వల్ల చంద్రబాబు గెలుస్తారా?పోలీసులు గాజులు తొడుక్కోలేదు.. పచ్చ కండువాలు వేసుకోలేదు.. ప్రజాస్వామ్యాన్ని అమ్ముకున్నారు.

స్థానికంగా ఉన్న పోలీసు అధికారులు గాజులు తొడుక్కోలేదు. పచ్చ కండువాలు వేసుకోలేదు. ప్రజాస్వామ్యాన్ని అంగడి సరుకుగా మార్చేసి అమ్ముకున్నారు. అనంతపురం రూరల్‌లో 21కి 14, చెన్నేకొత్తపల్లి మండలంలో 15కి 11, ఆత్మకూరు మండలంలో 17కి 8, రాప్తాడు మండలంలో 16కి 6 స్థానాలను గెలిచాం. కనగానపల్లి, రామగిరి మండలాల్లో మీరు గుద్దుకున్నా అక్కడ కూడా నాలుగు స్థానాలు గెలిచాం.

ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది.. రెండో, మూడో దశల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొదటి దశ ఎన్నికల్లో పెద్ద ఎత్తున పంచాయతీలను గెలిచాం. ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. జగన్ ప్రభంజనం ప్రారంభమైంది. రెండో, మూడో దశల్లో ఉమ్మడి జిల్లాలో క్లీన్‌స్వీప్ చేస్తాం. వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగిస్తుంది. జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను ప్రజలు మిస్ అవుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మెజార్టీ పంచాయతీ స్థానాలను దక్కించుకుని జగనన్నకు కానుకగా ఇస్తాం.పోలీసుల ఏకపక్ష వైఖరితో శాంతిభద్రతలు గాలికి.. శ్రీసత్యసాయి జిల్లాలో అదుపుతప్పిన పరిస్థితులు.రూరల్ సీఐ శ్రీకాంత్‌యాదవ్ కట్టకిందపల్లిలో మా ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి సోదరుడిపై దాడి చేశారు. పోలీసులు ఏకపక్షంగా తెలుగుదేశం పార్టీ వారి కోసం పనిచేశారు. అనంతపురం జిల్లాలో ఉన్నతాధికారులు అంతోఇంతో శాంతిభద్రతలను నిర్వహించాలని చూస్తున్నారు. కానీ శ్రీసత్యసాయి జిల్లాలో పరిస్థితులు పూర్తిగా అదుపుతప్పాయి. కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి ఎస్ఐల నిర్వాకం వల్ల పోలీసులకు చెడ్డపేరు వచ్చిందని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు.

మళ్లీ ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ

మూడేళ్ల తర్వాత తిరిగి నాయకత్వ బాధ్యతలు.. హార్దిక్ పాండ్యా నిష్క్రమణతో రోహిత్‌కు పగ్గాలు.. ఐదు టైటిళ్లు అందించిన సారథిపై యాజమాన్యం నమ్మకం



ముంబై ఇండియన్స్ అభిమానులకు శుభవార్త. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మరోసారి ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. మూడు సంవత్సరాల విరామం తర్వాత తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు అందుకోవడం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 2027 ఐపీఎల్ సీజన్‌కు రోహిత్‌ను కెప్టెన్‌గా నియమిస్తూ ముంబై ఇండియన్స్ యాజమాన్యం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా గుర్తింపు పొందిన రోహిత్‌కు మరోసారి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. **హార్దిక్ నిష్క్రమణతో మారిన సమీకరణాలు** 2024 ఐపీఎల్ సీజన్‌కు ముందు రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్ పాండ్యాకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే హార్దిక్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది. మూడు సీజన్లలో కేవలం ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరింది. 2026 సీజన్‌లోనూ జట్టు పేలవ ప్రదర్శనతో తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్ చేయగా, పంజాబ్ నుంచి ఆర్ష్‌దీప్ సింగ్ ముంబై జట్టులోకి వచ్చాడు. దీంతో ఖాళీ అయిన కెప్టెన్సీ బాధ్యతలను తిరిగి రోహిత్‌కు అప్పగించాలని యాజమాన్యం నిర్ణయించింది. **ఐదు టైటిళ్లతో అరుదైన రికార్డు** రోహిత్ శర్మ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచింది. 2013, 2015, 2017, 2019, 2020 సంవత్సరాల్లో జట్టుకు టైటిళ్లు అందించాడు. 2013లో మధ్యలో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టి తొలి ప్రయత్నంలోనే ముంబైకి టైటిల్ అందించడం అతడి నాయకత్వ ప్రతిభకు నిదర్శనం. 11 సీజన్ల పాటు జట్టును నడిపించిన రోహిత్ తన వ్యూహాలు, ఆటగాళ్లతో సమన్వయం, ఒత్తిడిలో ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఐదు టైటిళ్లతో ఎంఎస్ ధోనీతో కలిసి అత్యధిక ఐపీఎల్ టైటిళ్లు సాధించిన కెప్టెన్ల జాబితాలో కొనసాగుతున్నాడు. **అభిమానుల్లో కొత్త ఉత్సాహం** రోహిత్ తిరిగి కెప్టెన్ కావడంతో ముంబై ఇండియన్స్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో అతడి నాయకత్వంలో జట్టు సాధించిన విజయాలను అభిమానులు గుర్తుచేసుకుంటున్నారు. ముంబై జట్టు యాజమాన్యం కూడా రోహిత్ అనుభవం, నాయకత్వ లక్షణాలు, యువ ఆటగాళ్లను ప్రోత్సహించే విధానంపై విశ్వాసం వ్యక్తం చేసింది. జట్టు 20వ ఐపీఎల్ సీజన్‌లోకి అడుగుపెడుతున్న తరుణంలో రోహిత్‌కు మళ్లీ బాధ్యతలు అప్పగించడం ప్రత్యేకతను సంతరించుకుంది. **మళ్లీ పూర్వ వైభవం సాధిస్తుందా?** గత ఆరు సీజన్లుగా ఐపీఎల్ టైటిల్‌కు దూరంగా ఉన్న ముంబై ఇండియన్స్‌కు రోహిత్ పునరాగమనం కొత్త ఆశలు కలిగిస్తోంది. జట్టులో జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండటంతో సమతూకమైన జట్టును నిర్మించుకునే అవకాశం ఉంది. అయితే కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడం ఒక ఎత్తయితే, జట్టును మరోసారి విజేతగా నిలపడం మరో ఎత్తు. ఆటగాళ్లందరినీ సమన్వయం చేసుకుంటూ సరైన వ్యూహాలతో ముందుకు సాగాల్సి ఉంటుంది. రోహిత్ అనుభవం ముంబైకి ఎంతవరకు ఉపయోగపడుతుంది? మరోసారి ఐపీఎల్ ట్రోఫీని అందించి అభిమానుల ఆశలను నెరవేరుస్తాడా? అన్నది 2027 సీజన్‌లో తేలనుంది.

టీ20 క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన జయదేవ్ ఉనద్కట్!

- **11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి ప్రపంచ రికార్డు.. 26 బంతుల్లో 40 పరుగులు.. చేతన్ సకారియాతో కలిసి పదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం**



భారత క్రికెట్‌లో తన బౌలింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనద్కట్ బ్యాటింగ్‌లోనూ అద్భుతం చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. సాధారణంగా 11వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే బౌలర్లు తక్కువ పరుగులకే పరిమితమవుతుంటారు. కానీ ఉనద్కట్ మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ 26 బంతుల్లో 40 పరుగులు సాధించాడు. దీంతో పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. **ఆరు సంవత్సరాల రికార్డు బద్దలు** ఇప్పటివరకు ఈ రికార్డు ఇంగ్లండ్ ఆటగాడు డానీ బ్రిగ్స్ పేరిట ఉండేది. 2020లో బిగ్‌బాష్ లీగ్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ తరఫున ఆడిన బ్రిగ్స్ హోబర్ట్ హరికేన్స్‌పై 18 బంతుల్లో అజేయంగా 35 పరుగులు చేశాడు. తాజాగా ఉనద్కట్ 40 పరుగులతో ఆ రికార్డును అధిగమించాడు. తన ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదాడు. కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకోవడమే కాకుండా టీ20 చరిత్రలో తన పేరును చిరస్థాయిగా నిలుపుకున్నాడు. **చేతన్ సకారియాతో అద్భుత భాగస్వామ్యం** ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. 193 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక దశలో 92 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన ఉనద్కట్, చేతన్ సకారియాతో కలిసి అద్భుతంగా పోరాడారు. చివరి వికెట్‌కు 49 బంతుల్లో 62 పరుగులు జోడించారు. టీ20 క్రికెట్‌లో పదో వికెట్‌కు నమోదైన అత్యధిక భాగస్వామ్యాల్లో ఇది సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. అయితే వీరిద్దరి పోరాటం జట్టుకు విజయాన్ని అందించలేకపోయింది. **38 పరుగులతో తమిళనాడు విజయం** తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన సౌరాష్ట్ర 16.4 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌటైంది. దీంతో తమిళనాడు 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఉనద్కట్ వ్యక్తిగత రికార్డు సాధించినప్పటికీ సౌరాష్ట్రకు ఓటమి తప్పలేదు. ఈ పరాజయంతో సౌరాష్ట్ర సూపర్ లీగ్ దశకు అర్హత సాధించే అవకాశాన్ని కోల్పోయింది. **రికార్డుల పుస్తకంలో ఉనద్కట్ పేరు** 35 ఏళ్ల జయదేవ్ ఉనద్కట్ భారత జట్టు తరఫున టెస్టులు, వన్డేలు, టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లోనూ పలు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ప్రధానంగా ఎడమచేతి మీడియం పేసర్‌గా గుర్తింపు పొందిన అతడు కీలక సమయంలో బ్యాట్‌తోనూ సత్తా చాటడం విశేషం. ఈ ప్రదర్శనతో దేశవాళీ క్రికెట్‌లో తన సత్తా మరోసారి నిరూపించుకున్నాడు. ఓటమి ఎదురైనా వ్యక్తిగతంగా సాధించిన ప్రపంచ రికార్డు మాత్రం ఉనద్కట్ కెరీర్‌లో ప్రత్యేక ఘనతగా నిలిచిపోనుంది.

ప్రపంచకప్‌లో వైభవ్‌కు చోటివ్వాలి!

- **2027 వన్డే ప్రపంచకప్‌కు ఎంపిక చేయాలంటూ శ్రీకాంత్ డిమాండ్.. 15 ఏళ్ల యువ సంచలనంపై ప్రశంసల వర్షం.. సెలెక్టర్లు ఇప్పటికైనా గుర్తించాలంటూ సూచన**



భారత క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మరోసారి మార్మోగుతోంది. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్న ఈ 15 ఏళ్ల కుర్రాడిని వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ జట్టులోకి తీసుకోవాలని భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వైభవ్‌లో మూడు ఫార్మాట్లలోనూ రాణించే సామర్థ్యం ఉందని, అతడి ప్రతిభను గుర్తించి జాతీయ జట్టులో మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. కేవలం భవిష్యత్తు ఆటగాడిగా చూడకుండా ఇప్పటి నుంచే పెద్ద వేదికలపై ఆడించేలా చర్యలు తీసుకోవాలని సెలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు. **53 బంతుల్లో 204 పరుగులు.. సంచలన ఇన్నింగ్స్** ఇటీవల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగాడు. కేవలం 53 బంతుల్లోనే 204 పరుగులు సాధించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో 28 సిక్సర్లు, ఏడు ఫోర్లు బాదాడు. కేవలం 28 బంతుల్లోనే శతకం పూర్తి చేయగా, 52 బంతుల్లో ద్విశతకాన్ని అందుకున్నాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా శతకం, ద్విశతకం సాధించిన ఆటగాడిగా పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అతడి విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఇండియా-ఏ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. **మూడు ఫార్మాట్లలోనూ ఆడించాలి** వైభవ్ బ్యాటింగ్‌పై ముగ్ధుడైన శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ అతడిని అన్ని ఫార్మాట్లకు సరిపోయే ఆటగాడిగా అభివర్ణించారు. టెస్టు క్రికెట్‌లో వెంటనే ఆడించడానికి జట్టు యాజమాన్యం సిద్ధంగా లేకపోయినా కనీసం 15 మంది సభ్యుల జట్టులో చోటు కల్పించాలని సూచించారు. త్వరలో శ్రీలంకతో జరగనున్న వన్డే సిరీస్‌లోనూ అవకాశం ఇవ్వాలని కోరారు. యువ ఆటగాడిని తీర్చిదిద్దాలంటే పెద్ద టోర్నీల్లో ఆడించే ధైర్యం చేయాలని, 2027 ప్రపంచకప్ జట్టులో అతడికి స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వైభవ్ ఒంటిచేత్తో భారత్‌కు విజయాలు అందించే స్థాయికి ఎదుగుతాడని విశ్వాసం వ్యక్తం చేశారు. **సచిన్, కోహ్లీలతో పోలిక** వైభవ్ బ్యాటింగ్‌లో కేవలం బంతిని బలంగా బాదే శక్తి మాత్రమే లేదని, అద్భుతమైన టైమింగ్, ఆత్మవిశ్వాసం కూడా ఉన్నాయని శ్రీకాంత్ ప్రశంసించారు. మైదానంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఆడే విధానం అతడిలోని ప్రత్యేక ప్రతిభను తెలియజేస్తోందన్నారు. క్రికెట్ దేవుడిగా పేరొందిన సచిన్ టెండూల్కర్, కింగ్ విరాట్ కోహ్లీల తర్వాత వైభవ్ మరో గొప్ప ఆటగాడిగా ఎదిగే అవకాశం ఉందంటూ ప్రశంసించారు. అతడి ప్రతిభను గుర్తించకుండా ఇంకా అనుభవం కావాలంటూ అవకాశాలను పరిమితం చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. **ప్రతిభకు తగిన అవకాశాలు దక్కేనా?** వైభవ్ ఇప్పటికే తన అసాధారణ ఆటతీరుతో దేశవాళీ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఐపీఎల్‌లోనూ తన సత్తా చాటుతూ భవిష్యత్తుపై భారీ అంచనాలు పెంచాడు. అయితే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణించాలంటే తగిన అవకాశాలతో పాటు అనుభవం కూడా అవసరం. అతడిపై అధిక అంచనాలు, ఒత్తిడి పెంచకుండా సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం జట్టు యాజమాన్యం బాధ్యత. మరోవైపు ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను గుర్తించి ప్రోత్సహించడం సెలెక్టర్ల కర్తవ్యం. శ్రీకాంత్ చేసిన సూచనలను బీసీసీఐ, జట్టు యాజమాన్యం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటాయో చూడాలి. 2027 ప్రపంచకప్‌లో వైభవ్‌కు చోటు దక్కుతుందా? భారత జెర్సీతో అంతర్జాతీయ వేదికపై మరోసారి తన బ్యాట్‌తో సంచలనాలు సృష్టిస్తాడా? అన్నది ఆసక్తికరంగా మారింది.

బౌలింగ్ యాక్షన్ మార్చిన బుమ్రా.. ఎందుకో తెలుసా?

న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో కొత్త ప్రయోగం.. ఒక చేతిలో బంతితో రన్‌అప్.. ముందుగానే సాధన చేశాడన్న ఆకాష్ దీప్!



భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన బౌలింగ్‌లో చేసిన చిన్న మార్పు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు బుమ్రా విభిన్నమైన రన్‌అప్‌తో బౌలింగ్‌కు రావడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా రెండు చేతులతో బంతిని పట్టుకొని, తనదైన ప్రత్యేక శైలిలో పరుగెత్తుకుంటూ వచ్చి బౌలింగ్ చేసే బుమ్రా.. ఈసారి ఒక చేతిలో బంతిని పట్టుకొని మరో చేతిని వేరుగా ఉంచి క్రీజు వైపు పరుగెత్తాడు. దీంతో అతడి బౌలింగ్ శైలిలో మార్పు ఎందుకు వచ్చిందన్న చర్చ మొదలైంది. **ఒక చేతిలో బంతితో కొత్త ప్రయోగం** బుమ్రా బౌలింగ్ యాక్షన్ ప్రపంచ క్రికెట్‌లోనే ప్రత్యేకమైనది. అతడి రన్‌అప్, బంతిని విడుదల చేసే విధానం బ్యాటర్లకు సవాలుగా నిలుస్తుంటాయి. అయితే రెండో టెస్టులో అతడు అనుసరించిన కొత్త విధానం అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా పరుగెత్తే సమయంలో రెండు చేతులను కలిపి ఉంచకుండా ఒక చేతిలోనే బంతిని పట్టుకొని బౌలింగ్‌కు సిద్ధమయ్యాడు. అతడి అడుగుల కదలికల్లోనూ స్వల్ప మార్పు కనిపించింది. బంతిని విడుదల చేసే సమయంలో మాత్రం సాధారణ బౌలింగ్ యాక్షన్‌లో పెద్దగా మార్పు కనిపించలేదు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. **ముందుగానే సాధన చేశాడన్న ఆకాష్ దీప్** బుమ్రా కొత్త బౌలింగ్ విధానంపై భారత జట్టు సహచరుడు ఆకాష్ దీప్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో ఈ మార్పుపై ప్రశ్నించగా.. బుమ్రా ప్రాక్టీస్ మ్యాచ్‌కు ముందే ఇలాంటి బౌలింగ్‌ను సాధన చేశాడని తెలిపాడు. అతడి మనసులో ఏదో ప్రత్యేకమైన ప్రణాళిక ఉండి ఉంటుందని, అందుకే ఈ విధంగా ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నాడు. బుమ్రా ఏం చేసినా ఒక ఆలోచనతోనే చేస్తాడని అతడిపై నమ్మకం వ్యక్తం చేశాడు. దీంతో ఈ మార్పు అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టమవుతోంది. అయితే దాని వెనుక ఉన్న అసలు వ్యూహాన్ని బుమ్రా వెల్లడించలేదు. **వికెట్లు దక్కకపోయినా పరుగుల నియంత్రణ** రెండో టెస్టు తొలి రోజు బుమ్రా 19 ఓవర్లు బౌలింగ్ చేసి 37 పరుగులు మాత్రమే ఇచ్చాడు. నాలుగు ఓవర్లు మెయిడిన్లు వేశాడు. అయితే ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయాడు.

సహచర ఆటగాడిపైనే హర్షిత్ రాణా ఆగ్రహం!

షాబాజ్ అహ్మద్‌పై అసభ్య పదజాలం.. వైరల్‌గా మారిన వీడియో.. యువ పేసర్ తీరుపై అభిమానుల విమర్శలు



భారత యువ పేసర్ హర్షిత్ రాణా మరోసారి వివాదంలో చిక్కుకున్నాడు. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ సెమీఫైనల్‌లో శ్రీలంక-ఏతో జరిగిన మ్యాచ్ సందర్భంగా సహచర ఆటగాడు షాబాజ్ అహ్మద్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. షాబాజ్‌ను ఉద్దేశించి హర్షిత్ అసభ్య పదజాలం ఉపయోగించినట్లు కనిపిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. **బంతి ఆపినా తగ్గని ఆగ్రహం** మ్యాచ్‌లో హర్షిత్ రాణా బౌలింగ్ చేస్తున్న సమయంలో శ్రీలంక బ్యాటర్ కొట్టిన బంతిని ఫీల్డింగ్ చేస్తున్న షాబాజ్ అహ్మద్ బౌండరీ వద్ద అడ్డుకున్నాడు. అయితే బంతిని తిరిగి విసరడంలో కొంత ఆలస్యం కావడంతో బ్యాటర్లు రెండు పరుగులు తీశారు. దీంతో అసహనానికి గురైన హర్షిత్.. షాబాజ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో అసభ్య పదజాలం ఉపయోగించినట్లు వీడియోలో వినిపించడంతో వివాదం మొదలైంది. **షాబాజ్ ప్రదర్శనపై ప్రశంసలు** అదే మ్యాచ్‌లో షాబాజ్ అహ్మద్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 48 బంతుల్లో అజేయంగా 54 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సిక్సర్లు ఉన్నాయి. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ పడగొట్టాడు. జట్టు కోసం రెండు విభాగాల్లోనూ కష్టపడిన ఆటగాడిపై హర్షిత్ ఇలా వ్యవహరించడం సరికాదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. **భారత్-ఏకు ఘోర పరాజయం** తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ జట్టు 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో శ్రీలంక-ఏ జట్టు అద్భుతంగా ఆడింది. లనిత్ క్రూస్‌పుల్లె 116, సినెత్ జయవర్ధనే 105 పరుగులతో శతకాలు సాధించారు. దీంతో శ్రీలంక-ఏ జట్టు కేవలం 41.3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. హర్షిత్ రాణా ఏడు ఓవర్లలో 61 పరుగులు ఇచ్చి ఒక వికెట్ మాత్రమే తీశాడు. **దూకుడుతో పాటు క్రమశిక్షణ అవసరం** క్రికెట్‌లో దూకుడు ఆటగాళ్లకు అవసరమే. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచేందుకు దూకుడుగా వ్యవహరిస్తుంటారు.

స్టార్‌డమ్ పక్కనపెట్టిన జగపతిబాబు.. వర్కర్లతో కలిసి భోజనం



సినిమాల్లో క్రూరమైన విలన్‌గా భయపెట్టే నటుడు జగపతిబాబు నిజ జీవితంలో మాత్రం ఎంతో ఆత్మీయంగా మెలుగుతాడు. వెండితెరపై ఎంతటి గంభీరమైన పాత్రలు పోషించినా బయట చాలా సరదాగా ఉంటాడు. చిత్ర పరిశ్రమలో అగ్ర నటుడిగా ఎంతో గుర్తింపు ఉన్నప్పటికీ ఎలాంటి స్టార్ డమ్ ప్రదర్శించడు. ప్రతి ఒక్కరితో సమానంగా కలిసిపోతూ తన ప్రత్యేకతను చాటుకుంటారు.
తాజాగా ఆయన పంచుకున్న ఒక దృశ్యం సోషల్ మీడియాలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. తన వద్ద పనిచేసే వర్కర్లతో కలిసి ఆయన స్వయంగా భోజనం చేశాడు. పనివారి కోసం బయటి నుంచి ప్రత్యేకంగా రుచికరమైన ఆహారాన్ని తెప్పించాడు. అదే సమయంలో వారు తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న సాధారణ భోజనాన్ని తానే స్వయంగా ఎంతో ఇష్టంగా తిన్నాడు.
పనివారితో కలిసి సరదాగా మాట్లాడుతూ గడిపిన ఈ క్షణాలను ఆయన 'ఎక్స్' వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. హోదా, అంతస్తుల తేడాలు చూపించకుండా మనుషులకు విలువనిచ్చే ఆయన తీరును చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. సామాన్యులతో ఇంత సులువుగా కలిసిపోయే వ్యక్తిత్వం నిజంగా అరుదని ప్రశంసిస్తున్నారు. నటుడిగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన నిరాడంబరతకు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ వీడియో ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతూ విస్తృతంగా ట్రెండ్ అవుతోంది.

'అలియాస్ రుక్మిణీ' ట్రైలర్ రిలీజ్

అమాయకపు కోర్టు స్టెనోగా నితిన్..

టాలీవుడ్ యువ కథానాయకుడు నితిన్ నటించిన సరికొత్త వింటేజ్ రొమాంటిక్ కామెడీ డ్రామా 'అలియాస్ రుక్మిణీ' థియేట్రికల్ ట్రైలర్ గురువారం విడుదలైంది. నేచురల్ స్టార్ నాని సమర్పణలో, 'యునానిమస్ ప్రొడక్షన్స్' పతాకంపై దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహించారు. 2000 దశకం నాటి వింటేజ్ నేపథ్యంలో నడిచే ఈ కథలో నితిన్ లుక్, పాత్ర స్వభావం సరికొత్తగా ఆకట్టుకుంటున్నాయి.
ట్రైలర్ ప్రకారం.. నితిన్ ఇందులో 'కృష్ణ' అనే ఫ్యామిలీ కోర్టు స్టెనోగ్రాఫర్ పాత్రలో నటిస్తున్నారు. కళ్లద్దాలు పెట్టుకుని, పైకి ఎంతో అమాయకంగా, పద్ధతిగా కనిపించే ఈ యువకుడి వెనుక ఒక పెద్ద రహస్యం దాగి ఉంటుంది. ఇంట్లో వాళ్లు "కోరికలే గుర్రాలైతేనా.. ఇవి చదువుతున్నాడా?" అని కంగారు పడుతుంటే.. "చదవట్లేదు.. రాస్తున్నాడు!" అంటూ రివీల్ అయ్యే సీక్రెట్ నవ్వులు పూయిస్తోంది. తన అసలు గుర్తింపు దాచి, ఒక అమ్మాయి కలం పేరుతో ఆ పుస్తకాలు రాస్తున్నట్లు కథనం ద్వారా స్పష్టమవుతోంది. ట్రైలర్ ముగింపులో కథానాయిక ఆఫియా సయ్యద్.. "ఇప్పుడు మిమ్మల్ని ఏమని పిలవాలి? కృష్ణ అనా లేకపోతే రుక్మిణీ అనా?" అని అడిగే డైలాగ్ టైటిల్ వెనుక ఉన్న ట్విస్ట్‌పై మరింత ఆసక్తిని పెంచుతోంది.
ట్రైలర్‌లో చూపించిన పెళ్లిచూపుల సన్నివేశాలు చాలా సహజంగా, నేటి యువతను ఆకట్టుకునేలా ఉన్నాయి. వరుసగా ముగ్గురు తిరస్కరించిన తర్వాత నాలుగో పెళ్లిచూపులకు వెళ్లిన హీరో.. "నన్ను కలవడానికి మీరు ఎంతమందిని రిజెక్ట్ చేశారో తెలుసుకుందామని అడిగాను" అని చెప్పే సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. జోమోన్ టి.జాన్ కెమెరా పనితనం, విజయ్ బుల్గానిన్ అందించిన నేపథ్య సంగీతం సినిమా వింటేజ్ ఫీల్‌ను మరింత పెంచాయి. తన కెరీర్‌లోనే ఇది ఉత్తమ చిత్రంగా నిలుస్తుందని నితిన్ ఇప్పటికే ధీమా వ్యక్తం చేశాడు.



తొలి చూపులోనే ఫిదా -ఆఫియా సయ్యద్



టాలీవుడ్ లో నేచురల్ స్టార్ నాని కొత్త కథలను ఎంకరేజ్ చేయడంలో ఎప్పుడూ ముందుంటారు. ఆయన సమర్పణలో నితిన్ హీరోగా వస్తున్న 'అలియాస్ రుక్మిణీ' ట్రైలర్ ఇప్పుడందరినీ ఆకట్టుకుంటోంది. అయితే ఈ ట్రైలర్‌లో నితిన్ సరసన కనిపించిన అమ్మాయి ఎవరనే చర్చ మొదలైంది. తొలిచూపులోనే తన సహజమైన నటనతో ఫిదా చేస్తున్న ఆ బ్యూటీ మరెవరో కాదు, ఆఫియా సయ్యద్. ఆమె బ్యాక్ గ్రౌండ్ తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఆ విశేషాలు చూద్దాం..
ఆఫియా సయ్యద్ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి కాదు. బాలీవుడ్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా మేనకోడలు ఆమె. అంత పెద్ద సినీ నేపథ్యం ఉన్నా, తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకోవాలనే ఆలోచనతో అడుగులు వేస్తోంది. ఇక అక్టోబర్ 2న విడుదలైన 'ప్రేమ్ కీతను' అనే హిందీ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, ఇప్పుడు డిసెంబర్ 4న 'అలియాస్ రుక్మిణీ'తో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోంది. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నితిన్ 'కృష్ణ' అనే ఫ్యామిలీ కోర్టు స్టెనోగా కనిపిస్తాడు. పైకి ఎంతో అమాయకంగా కనిపించే అతను, రహస్యంగా ఒక అమ్మాయి పేరుతో రొమాంటిక్ పుస్తకాలు రాస్తుంటాడు. ఆ కథలో 'రుక్మిణీ' అనే పేరుకు, ఆఫియా పాత్రకు ఉన్న లింక్ ట్రైలర్‌లో భలే ఫ్రెష్‌గా అనిపించింది. ఇక పెళ్లిచూపుల సీన్లలో నితిన్, ఆఫియా మధ్య వచ్చే సంభాషణలు యూత్‌కు ఇట్టే కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి

రాజకీయాలపై మక్కల్ సెల్వన్ మనసులో మాట!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి స్టార్ డమ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. కోట్లాది మంది అభిమానులున్న బిగ్ స్టార్. హీరో అయినా? విలన్ అయినా? ఇంకెలాంటి పాత్ర అయినా? అందులో అభినయించాలంటే సేతుపతి ఉండాల్సిందే అంటారు. అతడి ట్యాలెంట్ చూసి ఫ్యూచర్ సూపర్ స్టార్ రజనీకాంత్ లా ఎదుగుతాడని కెరీర్ ఆరంభంలోనే మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా రాజకీయాలపై సేతుపతి మనసులో మాటను బయటపెట్టారు. చాలామంది నటులు సినిమాల్లో రాణించిన తర్వాత పాలిటిక్స్ వైపు అడుగులు వేస్తుంటారు. కానీ విజయ్ సేతుపతి ఆలోచన మాత్రం అందుకు భిన్నంగా ఉండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తనకు ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని సినిమాలే మొదటి ప్రాధాన్యత అని తేల్చి చెప్పారు. ఇతరుల కోసం కాకుండా మనస్ఫూర్తిగా ఏదైనా చేయాలనే తపన ఉంటేనే రాజకీయాల్లోకి రావాలని అభిప్రాయపడ్డారు. పేరు కోసమో? అధికారం కోసమో? పాలిటిక్స్‌లోకి వెళ్లే మనస్తత్వం తనది కాదని స్పష్టం చేశారు. సమాజంలోని సమస్యలపై స్పందించడం వేరు. రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండటం వేరు అని సేతుపతి అన్నారు. సాధారణ పౌరుడిగా తనకు నచ్చిన విషయాలపై మాట్లాడే హక్కు ఎప్పుడూ ఉంటుందన్నారు. సినిమా రంగంలో ఇంకా చేయడానికి చాలా ఉందని కొత్త కథలు, కొత్త పాత్రలతో ప్రేక్షకులను అలరించడమే లక్ష్యమని చెప్పుకొచ్చారు. తమిళనాడులో సినీ తారల రాజకీయ ఎంట్రీ ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటుంది. ఈ క్రమంలో విజయ్ సేతుపతి కూడా భవిష్యత్తులో పార్టీ పెడతారా లేక ఏదైనా పార్టీకి మద్దతు ఇస్తారా అనే ఊహాగానాలు గతంలో చాలాసార్లు వచ్చాయి. వాటన్నింటికీ సేతుపతి మాటలతో చెక్ పెట్టారు. తాను ఎవరికీ పోటీ కాదని.. తన దారి తనదేనని చెప్పకనే చెప్పారు.



షార్ట్‌ఫిలింతో సత్తా చాటి..

ఆస్కార్ బరిలో తెలుగమ్మాయిలు



ఆస్కార్ పురస్కారాలకు ఇప్పటకే భారత్ నుంచి 'గోంధల్', 'అంగ్' ఉత్తమ చిత్రాల అంతర్జాతీయ చిత్రం విభాగంలో పరిశీలనకు ఎంపికైన సంగతి తెలిసిందే. అయిత మరో ఘు చిత్రం కూడా ఆస్కార్ అకాడమీ పరిశీలనకు అర్హత సాధించింది కన్నడ-తెలుగు షార్ట్ ఫిలిమ్ 'పంకజ'.. దర్శకురాలు అనూయ స్వామితో పాటు ప్రధాన పాత్రలో నటించిన హర్షిణి బోయళ్ల కూడా తెలుగు వారే కావడం విశేషం. ఈ ఇద్దరు బెంగళూరులో పుట్టి పెరిగారు. భాషలునేర్చుకోండి బెంగళూరులోని ఓ మురికి వాడలో నివసించే కుటుంబాల నేపథ్యంలో 'పంకజ'ను తెరకెక్కించారు. పంకజ అనే మహిళ.. కనిపించకుండా పోయిన తన భర్తను కుమార్తెతో కలిసి వెతికే క్రమంలో ఎదురైన అనుభవాలనే ఈ చిత్ర కథాంశం. ఈ షార్ట్ ఫిలిమ్. ప్రతిష్ఠాత్మక సన్‌డ్యాన్స్ ఫిలిం ఫెస్టివల్ సహా 40కిపైగా అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. రెయిన్‌డ్యాన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో విజేతగా నిలవడం ద్వారా ఆస్కార్ పరిశీలనకు అర్హత సాధించింది.



'ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో సంచలన పోస్ట్ చేసిన ఆర్‌జీవీ

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 'ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐని ఉపయోగించే వ్యక్తులు, దానిని ఉపయోగించని వారిని భర్తీ చేస్తారని (రీప్లేస్ చేస్తారని) ఆయన స్పష్టం చేశారు. ఏఐ కారణంగా ఉద్యోగాలు పోతున్నాయన్న ఆందోళనపై తనదైన శైలిలో సుదీర్ఘ విశ్లేషణను సోషల్ మీడియాలో పంచుకున్నారు.
ఉద్యోగ రంగంలో ఏఐ ప్రభావంపై తన ఆలోచనలను పంచుకుంటూ.. "చాలా మంది ఉద్యోగులు ఏఐ తమ ఉద్యోగాలను దొంగిలిస్తోందని గట్టిగా అరుస్తున్నారు, కానీ నిజానికి వారే తమను తాము 'దొంగిలించుకుంటున్నారు'" అని వర్మ వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కోడ్ రాయడానికి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఐడియాల కోసం, అనలిస్ట్ డేటా విశ్లేషణకు చాట్‌జీపీటీ, క్లాడ్, మిడ్‌జర్నీ వంటి ఏఐ టూల్స్‌ను రహస్యంగా వాడుతున్నారని ఆయన వివరించారు. తాము కష్టపడి చేసినట్టుగా ఆ పనిని పైఅధికారుల ముందు ప్రెజెంట్ చేస్తున్నారని పేర్కొన్నారు. "ప్రతి ఒక్కరూ దీన్ని రహస్యంగా చేస్తున్నారు, కానీ ఎవరూ ఒప్పుకోవడం లేదు. అయితే, కంపెనీలకు ఈ విషయం గణాంకాల రూపంలో తెలిసిపోతుంది" అని వర్మ అన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net